


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




సోమవారం | 30-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 255 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 1.55 తదుపరి పంచమి; నక్షత్రం: ధనిష్ఠ రా. 10.47 తదుపరి శతభిషం; వర్జ్యం: తె. 6.47 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.40-1.24, మ. 2.52-3.35; అమృతఘడియలు: ఉ. 11.23-1.08; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 5.47 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

# ఆరని మంటలు

**రాజధానిపై పోరు ఉధృతం** | **తెల్లవారుజాము అరెస్టులతో పోలీసుల హల్‌చల్**

- 12వ రోజూ ధర్నాలు, రాస్తారోకోలు
- సంఘీభావం తెలిపిన సుజనా బృందం
- మందడంలో గ్రామదేవతకు పొంగళ్లు
- పలు గ్రామాల్లో సంఘీభావ ర్యాలీలు
- బెజవాడ, గుంటూరుల్లోనూ ఆందోళన



తుళ్లూరులో ఆందోళనకు భారీగా విచ్చేసిన రైతులు, మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న సుజనా చౌదరి, మోదీ వేసిన శిలాఫలకం వద్ద కొబ్బరికాయ కొడుతున్న బీజేపీ ఎంపీ

గుంటూరు/తుళ్లూరు/మంగళగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతినే ఉంచాలని డిమాండ్ చేస్తూ రాజధాని గ్రామాల్లో 12వ రోజూ ఆందోళనలు కొనసాగాయి. తుళ్లూరు, మందడం ప్రాంతాల్లో మహాధర్నాలు, వెలగపూడిలో రిలే నిరాహారదీక్షలు కొనసాగించారు. ఉదయాన్నే రైతులు, రైతు కూలీలు, మహిళలు రోడ్లపైకి వచ్చి దీక్షా

మిగతా 9వ పేజీలో...

**దాతృత్వానికి సంకెళ్లు!**

## గోడలు దూకి మరీ
## రైతుల నిర్బంధం

- తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆరుగురిపై హత్యాయత్నం కేసులు నమోదు
- అఖిలపక్ష నేతల ముట్టడితో రాత్రి మేజిస్ట్రేట్ వద్దకు
- భూములిచ్చినందుకు మాకు మంచి బహుమానం
- నాడు సత్కారాలు, నేడు దెబ్బలు.. రైతుల ఆవేదన

## 16 మందితో హైపవర్ కమిటీ

- ఆర్థిక మంత్రి బుగ్గన సారథ్యం.. పది మంది మంత్రులకు చోటు
- ముఖ్య సలహాదారు, పురపాలక, న్యాయ కార్యదర్శులకూ..
- సీసీఎల్‌ఏ, డీజీపీకీ స్థానం.. 3 వారాల్లో నివేదికకు ఆదేశం
- మెంబర్ కన్వీనర్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ

2

## అంతా పకడ్బందీ ప్రణాళికతోనే!

- 19లోపే నివేదికకు కమిటీకి నిర్దేశం.. 20న ప్రత్యేక అసెంబ్లీ
- విశాఖపై పోలీసు అధికారుల్లో వ్యతిరేకత.. నక్సల్స్ ప్రభావం వల్లే
- డీజీపీదీ అదే మాట.. పోలీసు బాస్‌తో మమ అనిపిస్తే లైన్‌క్లియర్!

• **బిగ్ బీ సాహెబ్**



ఆదివారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు స్వీకరిస్తున్న అమితాబ్ బచ్చన్

## పెజావర మఠాధిపతి
## భగవదైక్యం



- లౌకిక 'హిందూత్వ'వాది
- ఏడో ఏటే సన్యాసం.. దళితవాడల్లో పర్యటన
- సర్వమత సమభావనకు కృషి
- రంజాన్‌వేళ మఠంలో ఇఫ్తార్ విందు
- సామాజిక, విద్యా సేవలకు పెద్దపీట

ఉడుపి/బెంగళూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నడనాట అష్ట పీఠాధిపతుల్లో అగ్రగణ్యుడు, ఉడుపి పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థ స్వామీజీ (88) ఇక లేరు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం తన మఠం ప్రాంగణంలోనే కన్నుమూశారు. ద్వైత సిద్ధాంతకర్త

మిగతా 10వ పేజీలో...

## అంగుళం కదిలినా ఊరుకోం!



- కేంద్రంతో మాట్లాడే చెప్తున్నా.. అవసరమైనప్పుడు జోక్యం
- రాజధాని రాష్ట్ర నిర్ణయమే.. కానీ ఇప్పుడు మార్పు కుదరదు
- తరలిస్తే 1.5 లక్షల కోట్ల పరిహారం.. కేంద్ర సంస్థలకూ భూములు
- అమరావతికి 8 వేల కోట్లు చాలు: బీజేపీ ఎంపీ సుజనా చౌదరి

10



## మోదీ మీ చెవిలో చెప్పారా?

- అమరావతి నుంచి అంగుళం కదలదా?.. మీ మాటేమైనా శాసనమా?
- బాబుకు తొత్తువా..?.. వ్యాపారం తప్ప మీకేం తెలుసు?.. సుజనాపై బొత్స ఫైర్

## అమ్మో.. అంత దూరమా?

- విశాఖపై సీమ ప్రజలు గగ్గోలు
- రాజధానిగా అమరావతే మేలు!
- కడప నుంచి విశాఖకు 732 కి.మీ
- అనంత నుంచి 890, కర్నూలుకు 691
- చిత్తూరు నుంచి 831 కి.మీ. ప్రయాణం
- 17 గంటలు ప్రయాణించాల్సిన దుస్థితి
- బెంగళూరు, చెన్నై, హైదరాబాదే దగ్గర

9



దేశ చరిత్రను మలుపు తిప్పిన అనేక ఘటనలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన 2019... మరికొన్ని గంటల్లో కనుమరుగైపోనుంది. ఈ ఏడాది చోటు చేసుకున్న కీలక ఘటనల పునరావలోకనం...

కదిలే కాలం.. చెదరని జ్ఞాపకం... 11వ పేజీలో

## ఇది.. 'నేర' సంవత్సరం!

- మహిళలపై పెరిగిన వేధింపులు, రేప్‌లు
- అడ్డూ అదుపు లేని సైబర్ నేరాలు
- 2019 రాష్ట్ర నేర నివేదిక విడుదల

3

## బడుల్లో తెలుగు
## వెలగాల్సిందే

**ఆంగ్ల మాధ్యమం విజయవంతం కాదు**

- ప్రభుత్వం పంథా మార్చుకోవాలి
- చట్ట ప్రకారం మాతృ భాషలోనే బోధన
- ప్రపంచ మహాసభల్లో వక్తలు
- ముగింపు రోజున 11 తీర్మానాలకు ఆమోదం



'ఒక తెలుగు కథ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

విజయవాడ/కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'బడిలో తెలుగు గంటలు మోగాలి. తెలుగే వెలగాలి. తెలుగు బోధనే అమలు చేయాలి' అని ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు తీర్మానించాయి. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బలవంతంగా అమలుచేయాలన్న ప్రభుత్వ విధానం విజయవంతం కాదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కచ్చితంగా ప్రభుత్వం పంథా మార్చుకోవాలని ముక్తకంఠంతో నినదించారు. విజయవాడలో

మిగతా 2వ పేజీలో...




## గజ గజ..!



- రాష్ట్రంలో పెరిగిన చలి.. వణుకుతున్న ఉత్తర కోస్తా
- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు.. కళింగపట్నంలో 14.2 డిగ్రీలు

2





పరంజ్యోతి

# మనస్సు నిర్మలంగా ఉంటేనే.. 'మనం' బాగుంటాం..!



వయసును బట్టి మనిషి ఆలోచనల్లో తీవ్రతలు, ఉద్వేగాలు, ఆవేశాలు, ఆనందాలు పెరుగుతూ.. తగ్గుతూ ఉంటాయి. అందుకే బాల్యం, యవ్వనం వృద్ధాప్యం వంటి శారీరక స్థితులను మనసు ప్రభావితం చేస్తూ ఉంటుంది. కుటుంబం, పెద్దరికం, సమాజం వంటివి వ్యక్తులను నియంత్రిస్తూ ఉంటాయి. స్వీయ నియంత్రణ కోల్పోతున్న మనుషులు.. పశు ప్రవర్తన వైపు అడుగులు వేస్తున్నారు. దీన్ని రూపుమాపి.. దైవత్వానికి మరల్చే మహత్తర ప్రక్రియ ఆధ్యాత్మికత. ఈ విషయం అర్థం చేసుకోకుండా.. ఆధ్యాత్మికతను మతానికి, ఆత్మకు పరిమితం చేస్తూ.. అసలు విషయాన్ని వదిలేస్తున్నాం. నిజానికి సనాతన ధర్మం ఆధ్యాత్మికతను జీవన విధానంగా మార్చింది. కుటుంబమే మనకు మొదటి సమాజం. అమ్మే మొదటి గురువు. అందుకే 'అమ్మ మొదటి దైవం' అన్నారు.

*ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతం పితా*
*సహస్రంతు పిత్రూన్ మాతా గౌరవేణాతిరిచ్యతే*

అనే మనుధర్మ సూక్తి ప్రకారం.. ఉపాధ్యాయుడికంటే ఆచార్యుడు పది రెట్లు అధికంగా, ఆచార్యుడికంటే తండ్రి వంద రెట్లు అధికంగా.. తండ్రికంటే తల్లి వేయి రెట్లు అధికంగా గౌరవనీయురాలు. అందుకే అమ్మను "మాతా నిర్మాతా భవతి" అన్నారు. కలిగిన సంతానం పురుషుడైనా, స్త్రీ అయినా అమ్మ నుంచి నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి. తల్లి ఒక సాంచె (కమ్మచ్చి) లాంటిది. ఆ మూసలో ఎలాంటి భావాలుంటే.. పిల్లలు అలాగే తయారవుతారు. తల్లిని గౌరవించే పుత్రుడు.. సమాజంలోని స్త్రీలందరినీ గౌరవిస్తారు. కానీ, ఈరోజు తల్లి ఒడిలో పెరిగే పిల్లలకన్నా, హాస్టళ్లలో ఉండేవారే ఎక్కువ. దాని వల్ల విద్యార్థులకు కుటుంబంలోని అనురాగం తెలియడంలేదు. అలాగే ఆడ సంతానం వద్దనుకొని చాలామంది భ్రూణహత్యలు చేస్తున్నారు. దాంతో సామాజిక అసమతుల్యత ఏర్పడుతోంది. దానివల్ల మగవారిని పెళ్లిళ్లకు ఆడపిల్లల కొరత పెరుగుతోంది. అంతేకాదు.. అక్క, చెల్లెళ్ల అనురాగానికి కూడా మగవారికి అవకాశం లేకుండాపోతోంది. దాంతో స్త్రీ తత్వం, ఆమెలోని సున్నితత్వం, సరళత్వం, నిర్భయ సాధికారతను గుర్తించలేకపోతున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే స్త్రీ ఔనత్యాన్ని తెలుసుకోలేని స్థితిలో ఉన్నాడు. దీనికి తోడు మూడేళ్ల వయసు నుంచే.. పిల్లల్ని హాస్టళ్లకు పంపుతున్నారు. వాడికి ముప్పై ఏళ్లు రాగానే తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు చేరుస్తున్నాడు. ఇదే కర్మఫలం. అనేక విషయాల పట్ల తనలోని శక్తిని ప్రకటించే యువకుడు కేవలం చదువుకే పరిమితమవ్వడం వల్ల మిగిలిపోయిన అంతర్గత శక్తిని చెడ్డపనులకు కేటాయిస్తున్నాడు. తల్లితండ్రులు, గురువులకన్నా బలమైన మాధ్యమాలు అతడిని ప్రభావితం చేస్తున్నాయి. వీటి నుంచి మనసును నియంత్రణలో ఉంచకపోతే జరిగే అనర్థాలను మనం చూస్తూనే ఉన్నాం. దీనిపై గీతలో శ్రీకృష్ణుడు ప్రత్యేకంగా చెప్పారు.

*క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః*
*స్మృతి భ్రంశాద్బుద్ధినాశా బుద్ధినాశాత్ ప్రణశ్యతి*

క్రోధం వల్ల వ్యామోహం, దానివల్ల స్మృతి నాశనం, తద్వారా జ్ఞానశక్తి ధ్వంసం అవుతుంది. బుద్ధి నశిస్తే మనిషి తన స్థితి నుండి పతనం అవుతాడు. కాబట్టి మనస్సు నిర్మలంగా ఉంటేనే మనం బాగుంటాం.

- డా.పి. భాస్కరయోగి

## లోకం తీరు




## చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 14.5 | 26.6 |
| గుంటూరు | 17.4 | 28.3 |
| కడప | 18.0 | 31.0 |
| విశాఖపట్నం | 18.4 | 27.4 |
| విజయవాడ | 18.8 | 28.2 |
| అనంతపురం | 18.8 | 29.6 |
| కర్నూలు | 20.2 | 31.1 |
| ఒంగోలు | 21.4 | 26.2 |
| శ్రీకాకుళం | 22.5 | 27.5 |

## కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో కోస్తాలో మేఘాలు ఆవరించి అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం వరకు ఉలవపాడు, జలదంకిలో రెండు, సింగరాయకొండ, కావలిలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయి. రెండు రోజుల తరువాత ఉత్తరాదిలో పయనించనున్న వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావంతో వచ్చే ఉత్తర గాలులు, సముద్రం నుంచి వీచే తూర్పుగాలులు సమ్మిళతం కానున్నందున వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో కోస్తాలో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో వరి నూర్పులు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణుడొకరు సూచించారు.

# అమరావతినే కొనసాగించాలి

- ఒంగోలు రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ఒంగోలు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. కులాలు, మతాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అమరావతిలోనే రాజధానిని కొనసాగించే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఒక సామాజిక వర్గాన్ని దెబ్బతీసేందుకే కుట్ర చేస్తున్నారని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే జేఏసీగా ఏర్పడి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, సీపీఐ, సీపీఎం, జనసేన, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జగన్ ఆర్నెల్ల పాలన బాగుంది!

- 3 రాజధానులపై ప్రజలదే నిర్ణయం: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ ఆర్నెల్ల పాలన బాగుంది. మంచి ప్రారంభం' అని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. ఏపీకి మూడు రాజధానులు మంచిదో.. కాదో.. ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని, తాను కాదని తెలిపారు. ట్విటర్‌లో 'ఆస్క్ కేటీఆర్'లో నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఏపీలో మూడు రాజధానులు ఏర్పాటు చేయడంపై మీ అభిప్రాయం ఏమిటి? రాజధాని నగరం, హైకోర్టు ఇవేనా అభివృద్ధి అంటే? అని ఓ నెటిజన్ కేటీఆర్‌ను ప్రశ్నించాడు. దానికి తెలివిగా సమాధానం చెప్పిన కేటీఆర్.. అది నిర్ణయించేది తాను కాదని, ఆంధ్రప్రదేశ్ ప్రజలని బదులిచ్చారు.

# రాజధాని మార్పుపై హైపవర్ కమిటీ

- ఆర్థిక మంత్రి బుగ్గన సారథ్యం
- పది మంది మంత్రులు, ముఖ్య సలహాదారు
- సీసీఎల్ఏ, డీజీపీకి కూడా స్థానం
- మూడు వారాల్లో నివేదికకు ఆదేశం

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని మార్పు, ఇతర అంశాలపై జీఎన్‌రావు కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించేందుకు ప్రభుత్వం హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేకపాటి గౌతంరెడ్డి, ఆదిమూలపు సురేశ్, మేకతోటి సుచరిత, కురసాల కన్నబాబు, మోపిదేవి వెంకటరమణ, కొడాలి నాని, మంత్రి పేర్ని నానితో పాటు ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం, డీజీపీ గౌతమ్ సవాంగ్, సీసీఎల్ఏ, పురపాలక, న్యాయ శాఖల కార్యదర్శులను సభ్యులుగా నియమిస్తున్నట్లు ఆదివారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరమైతే ఈ కమిటీ అడ్వొకేట్ జనరల్ సలహా తీసుకోవచ్చని సూచించారు. కమిటీ బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూపు (బీసీజీ) నివేదికను కూడా విశ్లేషిస్తుంది. మూడు వారాల్లోపు సిఫారసులతో కూడిన నివేదిక అందించాలని కమిటీని ఆదేశించారు. కాగా రాష్ట్రంలో 3 రాజధానులు ఏర్పాటు చేయాలని జీఎన్ రావు కమిటీ ఇప్పటికే నివేదిక ఇచ్చింది. దీంతో అమరావతి రైతులతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. అనంతరం కేబినెట్ సమావేశంలో అమెరికాకు చెందిన బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూపు (బీసీజీ) నివేదిక రావాలని.. అది వచ్చాక రెండు నివేదికలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి అధ్యయనం చేయిస్తామని చెప్పారు. జనవరి 3న బీసీజీ నివేదిక అందించనుంది. హైపవర్ కమిటీ దీనిని, జీఎన్‌రావు కమిటీ నివేదికను పరిశీలించి సిఫారసులు చేస్తుంది. వాటిని ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో చర్చించి చట్టబద్ధంగా రాజధాని మార్పు ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

# పక్కా స్కెచ్‌తోనే!

- అనుకున్న గడువుకే కొత్త రాజధానికి ఆమోదం!!
- 20న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం
- 19లోపే నివేదికకు హైపవర్ కమిటీకి నిర్దేశం
- విశాఖపై పోలీసు అధికారుల్లో వ్యతిరేకత
- ఆ జిల్లాలో నక్సల్స్ ప్రభావం ఎక్కువనే!
- వార్షిక నివేదికలోనూ ఇదే చెప్పిన డీజీపీ
- ఇప్పుడు ఆయన్నే కమిటీలోకి తీసుకున్న వైనం
- పోలీసు బాస్‌తో మమ అనిపిస్తే లైన్‌క్లియర్!

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధానిని అమరావతి నుంచి విశాఖకు తరలించాలన్న నిర్ణయంపై ఆందోళనలు జరుగుతున్నా.. పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నా.. రాష్ట్రప్రభుత్వం అడుగు ముందుకే వేస్తోంది. పక్కా స్కెచ్‌తో తాను అనుకున్న గడువులోగా ఆమోదింపజేసుకునే దిశగా ముందుకెళ్తోంది. రెండురోజుల క్రితం మంత్రివర్గ సమావేశంలో జీఎన్‌రావు కమిటీ నివేదిక ఇప్పటికే వచ్చిందని, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) నివేదిక రావలసి ఉందని చెప్పారు. ఈ నివేదిక కూడా వచ్చాక.. ఈ రెంటినీ కలిపి అధ్యయనం చేసేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. హైపవర్ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించేందుకు అవసరమైతే జనవరి 20న శాసనసభను ప్రత్యేకంగా సమావేశపరచాలని కూడా అంతర్గతంగా నిర్ణయించారు. దానికి అనుగుణంగా.. ఆదివారం సెలవురోజైనా హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని గడువు పెట్టారు. అంటే సరిగ్గా జనవరి 19నాటికి.. అంతకుముందు కానీ నివేదిక ఇవ్వాలి. 19న మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేసి ఆమోదిస్తారు. 20న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలన్న ముందస్తు నిర్ణయానికి అనుగుణంగానే హైపవర్ కమిటీ ఏర్పాటు చేశారని విశ్లేషకులు అంటున్నారు. వాస్తవానికి బీసీజీ నివేదికే ఇంకా రాలేదు. 3న రావచ్చని చెబుతున్నారు. దాని ప్రభావం ఎలా ఉన్నా కనీసం వచ్చేవరకైనా ప్రభుత్వం ఆగాల్సి ఉండగా.. హడావుడిగా హైపవర్ కమిటీని వేసేశారని అంటున్నారు. మరోవైపు.. కమిటీలో ఉన్న మంత్రులంతా ఇప్పటికే తమ అభిప్రాయాలు చెప్పేశారు. మంత్రివర్గ సమావేశంలో కూడా సీఎం జగన్ వారితో ముఖాముఖి మాట్లాడారు. మీ ఇష్టమే మా ఇష్టమని మంత్రులంతా చెప్పినట్లు సమాచారం. కమిటీలోని మంత్రులు.. బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, బొత్స సత్యనారాయణ, మేకపాటి గౌతంరెడ్డి, ఆదిమూలపు సురేశ్, మేకతోటి సుచరిత, కురసాల కన్నబాబు, మోపిదేవి వెంకటరమణ, కొడాలి నాని, మంత్రి పేర్ని నాని అందరూ ఆయనకు సన్నిహితులే. అమరావతిని వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నవారే. దీంతో జగన్ అభీష్టానికి వ్యతిరేకంగా హైపవర్ కమిటీ వెళ్లే అవకాశాల్లేవు. అయితే డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను ఈ కమిటీలోకి ఎందుకు తీసుకున్నారన్న విషయంపైనా చర్చ జరుగుతోంది. విశాఖకు రాజధానిని తరలించడంపై కొందరు పోలీసు అధికారుల్లో వ్యతిరేకత ఉన్నట్లు తెలిసింది. విశాఖ జిల్లాలో మావోయిస్టుల కదలికలు ఎక్కువగా ఉన్నాయని, అక్కడ రాజధాని పెట్టడం సరైంది కాదని పోలీసు వర్గాల నుంచి వినిపిస్తోంది. కొంతకాలం క్రితమే అరకు ప్రాంతంలో ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును, మాజీ ఎమ్మెల్యే శివేరి సోమాను నక్సల్స్ హత్య చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. డీజీపీ ఇటీవల తన వార్షిక నివేదికలోనూ మావోయిస్టుల ప్రభావం విశాఖలో ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇప్పుడు ఆయన్నే హైపవర్ కమిటీలోకి తీసుకున్నారు. పోలీసు బాస్‌గా విశాఖ రాజధానికి అనువైన ప్రాంతమని ఆయన చెబితే ఇక ఇబ్బంది ఉండదని ప్రభుత్వ ఉద్దేశంగా తెలిసింది. సీఎంకు వ్యతిరేకంగా డీజీపీ వ్యవహరించే అవకాశమే లేదు. మొత్తంగా ప్రతిబంధకాలేమీ లేకుండా రాజధానిని తరలించేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఎన్‌ఆర్‌సీ వద్దు



ఎన్‌ఆర్‌సీ, సీఏఏలను కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలంటూ కడపలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది వీణా అజయకుమార్ నేతృత్వంలో ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం భారీ జాతీయ జెండాతో గోకుల్‌లాడ్జి ఎన్టీఆర్ సర్కిల్‌నుంచి బస్టాండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగించారు. - కడప మారుతీనగర్

# 'పోలవరం'పై ప్రభుత్వంతో చర్చిస్తాం

- ప్రాజెక్టు పనులు పరిశీలించిన కేంద్ర బృందం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 29: పోలవరం ప్రాజెక్టు పనులు అనుకున్న సమయానికి పూర్తయ్యేందుకు ప్రభుత్వంతో చర్చించి, ఆ నివేదికను కేంద్రానికి అందిస్తామని కేంద్ర నిపుణుల కమిటీ చైర్మన్ ఎస్కే హల్దార్ పేర్కొన్నారు. ఆదివారం ఈ బృందం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి స్పిల్‌వే, గేట్ల అమరిక, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం, లెఫ్ట్, రైట్ కెనాల్ పనులను పరిశీలించింది. అనంతరం కమిటీ చైర్మన్ హల్దార్ విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు షెడ్యూల్ ప్రకారం సకాలంలో జరుగుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించామన్నారు. 2017 అక్టోబరులో నిపుణుల కమిటీ పర్యటించిన సమయంలో 2019 డిసెంబరు నాటికి పనులు పూర్తవుతాయని భావించామన్నారు. అయితే స్పిల్‌వే పూర్తవ్వడానికి ఆర్‌అండ్‌ఆర్, నిధులు తదితరాలతో సంబంధం ఉండటంతో మరో ఏడాది, ఏడాదిన్నరలో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్ర బృందంలో ఆర్‌కే పచౌరీ, ఎస్ఎల్ గుప్తా, డి.రంగారెడ్డి, బీపీ పాండే, మాజీ సాంకేతిక నిపుణులు డీపీ భార్గవ ఉన్నారు.

## 1 నుంచి ఈ-పర్మిట్ విధానం

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది చేతివాటం, నకిలీ రశీదులు, మార్కెట్ ఫీజు ఎగవేత వంటి వాటిని నివారించేందుకు ఈ-పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం దాన్ని కొత్త ఏడాదిలో అమలు చేసేందుకు సిద్ధమైంది. వ్యవసాయ ఉత్పత్తుల లావాదేవీలు, పశువుల క్రయవిక్రయాలు, రవాణా సంబంధిత అంశాల కోసం రాష్ట్రంలో ఈ-పర్మిట్ విధానాన్ని మార్కెటింగ్ శాఖ 2020 జనవరి 1 నుంచి అమల్లోకి తీసుకురానుంది. రాష్ట్రంలో 191పాత మార్కెట్ యార్డులు, ప్రభుత్వం తాజాగా ఏర్పాటు చేసిన 25 యార్డుల పరిధిలో ఎక్కడైనా మార్కెటింగ్ శాఖ నోటిఫై చేసిన పంట ఉత్పత్తుల లావాదేవీలు నిర్వహించాలంటే వ్యాపారులు విధిగా ఈ-పర్మిట్ తీసుకోవాలి.

## 'ఏఈల పదోన్నతులకు చర్యలు తీసుకోవాలి'

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ)గా పనిచేస్తున్న వారికి పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే రియాజ్ అహ్మద్, జి.హనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏపీ ఎన్జీఓ హోంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లకుపైగా ఏఈలుగా పనిచేసిన వారు ఎలాంటి పదోన్నతులు లేకుండానే రిటైర్ అవుతున్నారని వాపోయారు.

## వణుకుతున్న ఉత్తర కోస్తా

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. మూడు రోజులుగా ఈశాన్య, తూర్పు దిశల నుంచి చలిగాలులు.. ఉత్తర బంగాళాఖాతంలో కొనసాగిన ద్రోణి.. ఉత్తర, మధ్య, తూర్పు భారతాల నుంచి వీస్తున్న శీతల గాలులతోపాటు సముద్రం నుంచి వీస్తున్న తేమగాలుల ప్రభావంతో కోస్తాలో చలి పెరిగింది. ముఖ్యంగా ఉత్తర కోస్తాలో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఒడిసాకు ఆనుకుని ఉత్తరకోస్తాలో శివారు ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలు చలికి వణుకుతున్నాయి. ఆదివారం కళింగపట్నంలో 14.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తా తీర ప్రాంతంలో ఈ సీజన్‌లో అతి తక్కువ ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారి. ఆరోగ్యవరంలో 16.5, నందిగామలో 17.6, తునిలో 18.7 డిగ్రీలు నమోదయ్యాయి. ఈశాన్య దిశ నుంచి గాలులు ప్రారంభం కావడంతో చలి వాతావరణం నెలకొందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు.

# బడుల్లో తెలుగు వెలగాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

మూడు రోజులపాటు వేడుకగా జరిగిన మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో బోధన విజయవంతం కాదని తేల్చిచెప్పారు. నిరక్షరాస్యతను పూర్తిగా తొలగించటం ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. తెలుగు మాధ్యమ బోధన కోసం ప్రతిజిల్లాలోనూ రచయితల మహాసభలు నిర్వహించాలన్నారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ మాతృభాషలో బోధనతోనే మానసికంగా ఎదుగుదల ఉంటుందన్న భాషా శాస్త్రవేత్తల సూచన గమనించి ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ మాజీ సలహాదారు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ, భాషకు ముప్పువాటిల్లే ప్రభావం ఉందన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతగా భాషను బతికించుకోవాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత స్థితి నుంచి తెలుగు చదువుకోకపోతే పిల్లలు పనికిరారనే స్థితికి మన భాషను తీసుకువెళ్లాలన్నారు. సినీగేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పరాయి భాషలో చదివి గొప్పవాళ్లుగా చరిత్రకెక్కిన దాఖలాలు లేవన్నారు. తెలుగు జాతి అభ్యుదయాన్ని ఆపివేసినట్లుగా తెలుగువారిలో మానసిక కల్లోలాన్ని సృష్టించేలా రాష్ట్రప్రభుత్వ నిర్ణయం ఉందని, దీనిద్వారా వచ్చే ప్రకంపనల అలజడి ప్రభుత్వాన్ని కదిలించే పరిస్థితికి తీసుకువస్తుందని హెచ్చరించారు. సభలో జస్టిస్ కె.జి.శంకర్, మారిషస్ ప్రతినిధి సంజీవ అప్పడు, ఫ్రెంచ్ ప్రొఫెసర్ ఆచార్య డానియేల్, కె.సూర్యనారాయణ, ఎం.పి.జానుకవి, పి.ఆర్.మోహన్‌రావు, అనంత శ్రీరామ్, నందివెలుగు ముక్తేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు తుర్లపాటి కుటుంబరావు, ఎం.వి.ఆర్.శాస్త్రి, తెలంగాణకు చెందిన సాహితీవేత్త లింగం శ్రీనివాసులు ప్రసంగించారు. ఈ సభలో తెలుగు భాషాభివృద్ధి కోసం మొత్తం 11 తీర్మానాలను ఆమోదించారు.

### తెలుగులోనే శాసనాలు: జస్టిస్ భవానీప్రసాద్



'తెలుగువారు మనోధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. 1966లో అధికార భాషా చట్టాలు చేసుకున్నాం. రాజ్యాంగంలో భాషల గురించి చక్కని వివరణ ఇచ్చారు. 1996లో న్యాయశాఖ కార్యదర్శిగా నేను పని చేసినప్పుడు కొన్ని చట్టసవరణలు చేశాం. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి శాసనం, ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగు భాషలోనే ఉండాలని చట్టం ఉంది. దానికి అనుగుణంగా అధికార భాష చట్టప్రకారం మాతృభాషలోనే బోధన జరగాలి. నల్లగొండ జిల్లాలో కలెక్టర్ ముక్తేశ్వరరావు పని చేసినప్పుడు పరిపాలనంతా తెలుగులోనే సాగించారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఎందుకు చేయలేరని ప్రశ్నించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో న్యాయస్థానాల్లో నెలకు రెండు తీర్పులైనా తెలుగులో ఇవ్వాలనేలా చట్టం చేశారు. ప్రస్తుతం తెలుగు భాషా మాధ్యమం తొలగించే అంశం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా వేశారు. అది విచారణలో ఉంది.'

### మేధావుల మౌనం మంచిది కాదు: రెంటాల

భాషకు అన్యాయం జరుగుతున్నప్పుడు మేధావులు, రచయితలు మౌనం వహించడం మంచిది కాదని 'ఆంధ్రజ్యోతి' నవ్య ఇన్‌చార్జి రెంటాల జయదేవ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మాతృభాష పరిస్థితి దేశ భాషలందు తెలుగు లెస్స అన్న స్థాయి నుంచి లెస్....ఆ? అనే స్థాయికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రజల ఆందోళనను వినిపిస్తున్నాయన్నారు. దక్షిణాదిలో తమిళనాడు, కేరళ, కన్నడ వాసుల్లో ఉన్న భాషాభిమానం తెలుగు వారిలో లేకపోవడానికి కారణం ఏమిటో ఆలోచించుకోవాలని సూచించారు. తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత మాతృభాషకు తెలంగాణలో ఉన్న ప్రాధాన్యం మన రాష్ట్రంలో లేకపోవడం దారుణమన్నారు. ఇంట్లో పిల్లలకు మమ్మీ, డాడీ, రైస్, కర్రీ వంటి పదాలు నేర్పుతున్నారని, వాటికి బదులు అచ్చ తెలుగు పదాలైన అమ్మ, నాన్న, అన్నం, కూర వంటి పదాలు నేర్పించడం మొదలుపెట్టాలని విజ్ఞప్తి చేశారు. పత్రికారంగంలో ఉన్న ఉద్యోగుల ఇళ్ల నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబించే వీధినాటకాలు, జాంబపురాణం వంటి వాటిపై డాక్యుమెంటరీలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. వాటిని సజీవంగా నిలిపిన రోజున భాషకు ఎలాంటి ప్రతిబంధకాలు ఉండవని జయదేవ అభిప్రాయపడ్డారు.

## సంక్రాంతి నుంచి 'మన నది- మన నుడి'

- జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్

రాష్ట్రవ్యాప్తంగా జరిగే భాషా ఉద్యమానికి ఎప్పుడూ అండగా నిలుస్తాం. "మన నది- మన నుడి" పేరిట భాషను, సంస్కృతిని సంరక్షించే దిశగా గ్రామ గ్రామానా భాష, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి విస్తృత ప్రచారం కల్పించాలని జనసేన పార్టీ తరఫున నిర్ణయం తీసుకున్నాం. ఈ కార్యక్రమాలు సంక్రాంతి నుంచి ప్రారంభం కానున్నాయి. నేను శాసన సభాపతిగా ఉన్నప్పుడు తెలుగు భాష పరిరక్షణ కోసం బలమైన నిర్ణయాలు తీసుకున్నాను. ప్రశ్నోత్తరాల సమయంలో, బడ్జెట్ ప్రసంగాల్లో ఎంఐఎం శాసనసభ్యులు తమ మాతృభాష ఉర్దూలోనే ప్రసంగాలు చేస్తామని ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే ఉర్దూ టైపిస్టులు లేకపోవటంతో కుదరదని చెప్పాం. దాంతో వారే స్వయంగా టైపిస్టులను తీసుకువచ్చి వాళ్ల ప్రసంగాలన్నీ ఉర్దూలో కొనసాగేలా సాధించుకున్నారు.



## మహాసభల్లో ఆమోదించిన తీర్మానాలు

తెలుగు వాళ్లంతా జాతీయతను నిలబెట్టుకోవడానికి, మానవ సంబంధాలను, కుటుంబ సంబంధాలను బలపరుచుకోవడానికి దోహదపడే విద్యలో ప్రాథమిక స్థాయి నుంచే తెలుగు మాధ్యమాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. తెలుగుదనానికి, తెలుగు భాష మనుగడకు ఎక్కడ ప్రమాదం వాటిల్లినా ప్రపంచంలో ఉన్న తెలుగు వాళ్లతో పాటు రచయితలూ స్పందించాలి. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉండే తెలుగువారికి ఆధునిక సాంకేతిక ఉపకరణాల ద్వారా మాతృభాషను నేర్పించేందుకు తగిన పరిజ్ఞానంతో బోధన వ్యవస్థను ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి. హిందీలో ప్రాథమిక, మాధ్యమిక, విశారద తరహాలో ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉండే తెలుగువారికి సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించాలి. దీనికోసం ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు కృషి చేయాలి. తెలుగు భాషాభివృద్ధికి అవసరమైన ఉత్తమ గ్రంథాల రచనల ప్రచురణలకు, పంపిణీకి ఆర్థికంగా సేవాసంస్థలు, వ్యక్తులు తోడ్పాటును అందించాలి. ఆధునిక సాంకేతిక ఉపకరణాలను వాడటానికి ఉపయోగపడే విధంగా తెలుగును ఆధునీకరణకు కృషి చేయాలి.

తెలుగును 'ప్రపంచ తెలుగు'గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వాలు, సాంకేతిక నిపుణులు, భాషావేత్తలు, ప్రజలు కృషి చేయాలి. న్యాయపాలన, ఇతర పాలనా వ్యవస్థల్లో తెలుగు అమలుకు అవరోధంగా ఉన్న సాంకేతిక పదాల అనువాద విషయంలో ఆయా రంగాల నిపుణుల కృషి అవసరం. తెలుగు బోధనాంశాల్లో భాషా సంస్కృతులు, నైతిక విలువల పట్ల అవగాహన, వ్యక్తిత్వ వికాసం పెంపుదలతో పాటు ప్రాంతీయ పదాల పట్ల గౌరవం కలిగించే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ సందర్భాల్లో అందించే కానుకలు, జ్ఞాపికల స్థానంలో ఉత్తమ తెలుగు భాషా సాహిత్య గ్రంథాలను అందించి తెలుగు భాషా సాహిత్యానికి తోడ్పాటు ఇవ్వాలి. గ్రామగ్రామాన తెలుగు వేదికల నిర్మాణం కోసం రచయితలు, భాషాభిమానులు సమాయత్తమవ్వాలి. ఈ విధంగా ప్రజల గుండె తలుపులు తట్టాలి. ఈ తీర్మానాల అమలుకు భవిష్యత్తులో అవసరమైన ఉపసంఘాల నిర్మాణానికి కార్యవర్గ సభ్యులను నియమించాలి. అవసరాన్ని బట్టి అత్యవసర నిర్ణయాలను తీసుకోవడానికి సంస్థ అధ్యక్షుడికి అధికారాలు ఇస్తూ మహాసభలు తీర్మానం చేశాయి.



## మా నాన్న మళ్లీ గెలిస్తే వైట్‌హౌస్‌ను వదిలివెళ్తానేమో!

వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మా నాన్న డొనాల్డ్ ట్రంప్ మళ్లీ గెలిస్తే, వైట్‌హౌస్‌ను నేను వదిలివెళ్తానేమో. నాకు నా పిల్లలు, వాళ్ల సంతోషమే ముఖ్యం. అదే నన్ను నడిపిస్తుంది. మొదట నా పిల్లల అవసరాలు తీర్చడమే నాకు ప్రధానం.

- ఇవాంకా ట్రంప్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు, సలహాదారు



## విత్తనాల్లో పోషకోత్పత్తి గుట్టు వీడింది

లండన్, డిసెంబరు 29 : విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా మారుతాయనే విషయం మనందరికీ తెలుసు!! అయితే ఈ ప్రక్రియకు ముందు.. విత్తనాలు నీటి నుంచి పోషకాలను ఎలా ఉత్పత్తి చేసుకుంటాయి ? ఇందుకోసం అంతర్గతంగా ఏయే రసాయనిక చర్యలు జరుపుతాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు కనుగొనే దిశగా జర్మనీలోని మన్‌స్టర్ వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రయోగాలు జరిపారు. అధ్యయనంలో భాగంగా 'థేల్ క్రెస్' జాతి మొక్కల విత్తనాల్లో చోటుచేసుకునే మార్పులను మైక్రోస్కోప్ పరిధిలో సునిశితంగా పరిశీలించారు. ఆక్సిడేషన్-రిడక్షన్‌లో భాగంగా జరిగే అణువుల బదిలీ కారణంగా విత్తనాలు మొలకెత్తుతాయని.. ఇదంతా నిమిషాల వ్యవధిలోనే జరిగిపోతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

## అధిక బీఎంఐతో కేన్సర్ కట్టడి

వాషింగ్టన్, డిసెంబరు 29 : శరీర బరువు(బీఎంఐ) అధికంగా ఉన్నవారికి వ్యాధుల ముప్పు అధికంగా ఉంటుందని సాధారణంగా అంటుంటారు!! కానీ ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మాత్రం బీఎంఐ ఎక్కువగా ఉన్నవారికి కేన్సర్‌తో పోరాడి గెలిచే వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ప్రయోగ పరీక్షల్లో భాగంగా ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడుతున్న రోగులకు అటెజోలిజ్యుమాబ్ థెరపీ ద్వారా చికిత్స అందించారు. అనంతరం ఆరోగ్య నివేదికలను పరిశీలించగా.. బీఎంఐ అధికంగా ఉన్నవారిలో కేన్సర్ గణనీయ స్థాయిలో అదుపులోకి వచ్చినట్లు గుర్తించారు.

## ప్రశ్న ద్రోహమైంది నేనేం చేయను




నా దగ్గర కొంచెం
freedom of expression మిగిలిపోయింది
మీకు కావాలంటే తీసుకోండి
నా కవసరం లేదు
ఇప్పుడు నేనేమీ మాట్లాడటం లేదు

ప్రాథమిక హక్కుల్ని కూడ ఇచ్చేద్దామనుకుంటున్నాను
ఎవరికైనా పనికొస్తాయనుకుంటే తీసుకోండి
పౌరసత్వం అపహాస్యం చేయబడుతున్న వేళ
fundamental rights ఏం చేసుకోను?

IPC Section 124A ఎంత చదివినా
అర్థం కావడం లేదు
బహుశ ప్రశ్నించడమే దేశద్రోహమేమో!
dissent voice ఇప్పుడు దేశద్రోహి!

Indian Constitution ని అపురూపంగా పట్టుకొని
గుండెకు హత్తుకుంటూ,
law college కు వెళ్ళిన సమయాలు
ఈ రోజెందుకో గుర్తుకొస్తున్నాయి

preamble ని ప్రేమించినంతగా
నేను దేన్నీ ప్రేమించలేదు
ఆ page ని ఎన్నిసార్లు ముద్దుపెట్టుకున్నానో చెప్పలేను
నిజానికి అదొక కవిత
democracy వైపు దారి చూపించే
అక్షరాల అమరిక
ప్రపంచానికి ఆదర్శమైన నా భారత సంవిధాన్‌లో
తొలి పేజీ అది
నా ఊపిరది

అయితే-
ఆ page అదృశ్యమైనట్టు
నిన్న రాత్రి కల ఒకటి వచ్చింది
నన్ను కలవర పెట్టి వెళ్ళింది
ఈ రోజేమో NRC, CAB/ CAA

కల్లోల సముద్రమైంది నా ఇండియా
సొంత నేల మీద statelessness
వేల వేల గొంతుల అస్తిత్వ వేదన
కెరటమై ఎగసి పడింది
వర్తమాన భారతి తొలి రాజకీయ పాఠం నేర్పింది

■ మహెజబీన్

### శాంతి రజనీకాంత్ స్మారక కథా పురస్కారం

శాంతి రజనీకాంత్ స్మారక కథా పురస్కారాన్ని 2019 సంవత్సరానికి 'సీమేన్' కథా సంపుటికి అద్దేపల్లి ప్రభు స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ 2020 జనవరి 5 ఉ.10.30గం.లకు అనంతపురం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరుగుతుంది. సభలో యం. ప్రగతి, తెలకపల్లి రవి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణ స్వామి, తదితరులు పాల్గొంటారు. పురస్కార ప్రదాతలు ఆర్. విమల, శాంతి నారాయణ.

- శాంతి నారాయణ

### 'మిణుగురుల తోట' అభినందన సంచిక

అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య రంగంలో ప్రవేశించి 52 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి 'మిణుగురుల తోట' అభినందన సంచికను ప్రచురిస్తున్నది. అమ్మంగి వేణుగోపాల్ మిత్రులు వారి సాహిత్యాన్ని, వారితో తమ అనుబంధాన్ని వ్యాసాలుగా రాసి జనవరి 20లోగా చిరునామా: డా.గంటా జలందర్ రెడ్డి, ఇం.నెం.:11-9-317, లక్ష్మీనగర్, రోడ్‌నెం.4, కొత్తపేట, హైదరాబాద్-500035కు పంపాలి. వాట్సాప్: 98482 92715.

గంటా జలంధర్ రెడ్డి

### 'ముఝే ఏకాంత్‌మే జీనేదో' కవిత్వ సంపుటి

నసీరుద్దీన్ కవిత్వ సంపుటి 'ముఝే ఏకాంత్‌మే జీనేదో' ఆవిష్కరణ సభ 2020 జనవరి 5 ఉ.10 గం.లకు ఫిలింభవన్, కరీంనగర్‌లో జరుగుతుంది. కందుకూరి అంజయ్య, గాజోజు నాగభూషణం తదితరులు పాల్గొంటారు.

తెలంగాణ రచయితల వేదిక

### 'కేళీగోపాలమ్' - మల్లాది రామకృష్ణశాస్త్రి

మల్లాది రామకృష్ణశాస్త్రి జావళీలు, విఏకె రంగారావు ఎంపికచేసిన మల్లాది కథలు, నాట్యగీతాలు కూర్చి అల్లిన కదంబమాల 'కేళీగోపాలమ్' (సంస్కృతి, గుంటూరు ప్రచురణ) ఆవిష్కరణ సభ 2020 జనవరి 4 సా.6గం.లకు సప్తపర్ణి, రోడ్ నెం.8, బంజారాహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పప్పు వేణుగోపాలరావు, జయప్రభ, మల్లాది రాజేశ్వరశాస్త్రి, విఏకె రంగారావు పాల్గొంటారు.

- మోదుగుల రవికృష్ణ

## ఉండకుండా పోకు



ఎదురుచూస్తుంది
ఎద బరువు మోస్తుంది
అలసిపోతుంది
అలిగి పోతుంది
పగిలిపోయిన వేళ
కనుమరుగైపోతుంది..

కాలాన్ని దాచిన కాలం
శవమైపోతుంది

అందుకే
ఊపిరున్నంతసేపు
ఉండకుండా పోకు
ఉండకూడనిచోటికి
అసలే పోకు

వెళ్లిపోయిన అలతో
బయటి కాలం
కరిగిపోయింది
నువ్వు లేకుండా పోతే
భళ్ళున పరిగెత్తుకొచ్చి
నీ అడుగులు చెరిపేసి
నువ్వెవరో ఎవ్వరికీ
ఎప్పటికీ తెలియనట్లు
జీవన్మరణాలను కలిపి
అందుకోలేని తీరంలో
బందీ చేస్తుంది..

పుట్టడమూ చావడమూ
స్పృశించలేని వ్యధలో
నిన్ను మరచిన నేను
కాలం లోపలి కాలంలో
నిదురిస్తూనే ఉంటాను..
నిన్నప్పటికే పూర్తిగా
మరచివేయబడి ఉంటాను..
అంతకంటే ముందే
నాకు నువ్వు
ఉండకుండా పోకు..

ఉండకుండా పోకు
ఉండకూడని చోటికి పోకు
నువ్వు లేని చోట
నీ ఉనికికోసం చూడకు
కాలం లోపలి కాలం
గడిచేకొద్దీ మారుతుంటుంది

■ స్వేచ్ఛ వొటార్కర్
swetcha.vs@gmail.com

# ఆదీ అంతమూ లేనిదే 'ఆధునికత' అంటే!

కాలప్రవాహంలో ఏరోజుకారోజు, ఇంకా సూక్ష్మంగా చెప్పాలంటే ఏ క్షణానికి ఆ క్షణం ఆధునికమైనవే అనే సాధారణ సూత్రం స్థూలంగా సాహిత్యానికీ వర్తిస్తుందన్నది వొప్పుకోవడమే సమంజసమైనది. అయితే, సమకాలీన సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం ఇత్యాది గుణాలు ప్రతిబింబించేదే ఆధునిక సాహిత్యానికి లక్షణంగా చెప్పుకుని చేసిన యుగ విభజనలో- తెలుగు సాహిత్యానికి ఆధునిక యుగం క్రీ.శ.1800 తరువాతనే మొదలైందనీ, ఆ కారణంగా అంతకు ముందటిదంతా సనాతన సాంప్రదాయ సాహిత్యమనీ, కనుక అందులో ఆధునికతకు తావే లేదనే అభిప్రాయం పెంచి పోషించబడి, సామాజికంగా అభ్యుదయాన్ని ఆశించేవారు ఆ సాహిత్యం జోలికి పోకపోవడం వలన జరిగే నష్టం ఏమీ లేదనే దురభిప్రాయం క్రమంగా స్థిరపరచబడింది.

నన్నయతో మొదలై ఆధునిక యుగం మొదలుగా చెప్పబడుతూన్న క్రీ.శ.1800 వరకూ మధ్యలో దాదాపు ఎనిమిది శతాబ్దాలుగా సాగిన తెలుగు సాహిత్య ప్రస్థానంలో వివిధ కాలాల్లో తిక్కన, పోతన, శ్రీనాథాది మహాకవుల రచనలలో ఆయా కాలాల సామాజిక చింతనకు, రాజకీయ స్పృహకు అనుగుణంగా జరిగిన మార్పులను గుర్తించి, విశ్లేషించి, నిష్పాక్షిక దృష్టితో అర్థంచేసుకుని, అభినందించే ప్రయత్నం అవసరమైనంత స్థాయిలో మనం చేశామా, చేస్తున్నామా? అనే ప్రశ్నలకు సంతృప్తికర సమాధానం దొరకడం సులభం కాదు. ఆ దిశగా చిన్న ప్రయత్నమే ఈ వ్యాసంలో జరిగింది. నన్నయ ఆంధ్రీకరించిన భారత భాగంలోంచి రెండు సందర్భాలను ఎన్నుకుని, మూలానికీ ఆంధ్రీకరణానికీ జరిగిన మార్పు చేర్పులలో ఆనాటి ఆధునిక ఆలోచనా విధానానికి అనుగుణంగానే జరిగినవిగా అనిపించే మార్పులేమిటో, ఆ మార్పులను చేసి నన్నయ 'తన నాటికి తాను ఆధునికుడే!' అన్నది ఎలా చెప్పకనే చెప్పాడో, ఇందులో నిరూపించడం జరిగింది.

వ్యాసభారతాన్ని ఆంధ్రీకరించే క్రమంలో అనుసరించిన పద్ధతిని గురించి మాట్లాడుకునే సందర్భం వచ్చినపుడల్లా, అనవసరమనుకున్న భాగాలను తగ్గించి, అవసరమనిపించిన చోట్ల పెంచి వ్యాస భారతంలో లేని కొన్ని మార్పులూ చేర్పులూ చేసి, ఆంధ్ర భారతాన్ని సంస్కృత భారతానికి మక్కికి మక్కి అనువాదంలా కాకుండా ఒక స్వతంత్ర రచన అనిపించే విధంగా, తన ప్రభువైన రాజరాజ నరేంద్రుని కోరికకు అనుగుణంగా కొనసాగించి, ఆ క్రమంలో తెలుగులో అదే మొదలైన ఒక నూతన పద్ధతికి నాంది పలికి, ముందు తరాలకు అనుసరణీయంగా అందించాడు నన్నయ అని చెప్పడం పరిపాటి. అయితే, వ్యాస భారతంలోని భాగాలను తగ్గించడమూ, పెంచడమూ, మార్పులూ చేర్పులూ చేయడం అనే ప్రక్రియకు అవసరం, అనవసరం అనే మాటలనే ప్రమాణాలుగా చూపి సరిపుచ్చుతూ వచ్చాముగాని, ఆ 'అవసరానికి' కాని, 'అవసరం లేదు' అనిపించడానికి కాని ఏది అసలైన కారణమో కాస్త లోతుగా పరిశీలన చేసినది లేదు. ఆ 'కారణం' తానున్న కాలంలో వ్యక్తుల, సాంప్రదాయ విద్యావంతుల ఆలోచనా విధానంలో ఆనాటికి చోటుచేసుకున్న నవ్యతకు, హేతుబద్ధతకు, దానికి అనుగుణంగా కథలోని సంగతులను అర్థం చేసుకుని అసంబద్ధతను ప్రశ్నించగలిగే ధోరణికి అనుగుణంగా రచన ఉండాల్సిన అవసరం వలన యేర్పడినది అయివుండొచ్చునని, అది అప్పటికి కాలానుగుణంగా రూపుదిద్దుకున్న ఆధునికత అని, ఆ అవసరాన్ని గుర్తెరిగి రచన సాగించిన నన్నయ తన కాలానికి తాను ఆధునికుడే అని అర్థంచేసుకునే ప్రయత్నం మనం చేయలేదు.

నన్నయ కవిత్వం అంతా సంస్కృత పదాలమయం అని ఒక ముద్ర పడిపోయింది. అందులోని నిజానిజాల మాటెలా వున్నా, ఆ వ్యాఖ్య అర్థం నన్నయ కవిత్వంలో అసలు తెలుగు మాటలు లేవని కాదు. నన్నయ కవిత్వంలో అందమైన అచ్చ తెలుగు నుడికారం పుష్కలంగా కనిపిస్తుంది. ఈ వ్యాసానికి గాను నన్నయ భారత భాగంలోని తెలుగు మాటలలోంచి ('తెలిసి తెలిసి' అనే అర్థంలో ఉపయోగించిన) 'యెఱిఁగి యెఱిఁగి' అనే జంటపదాల తెలుగు నుడికారాన్ని గ్రహించి, ఆ నుడికారం ప్రయోగంతో నన్నయ తన నాటి భావజాలానికి అనుగుణంగా ఆంధ్ర భారతంలో చేసిన మార్పును, ఆధునీకరణను విశదీకరిస్తాను.

తెలివిడి, ఎరుక- ఈ రెండూ తెలుగు మాటలే. అయినా నన్నయ ఈ రెంటిలో 'ఎరుక' అనే మాటకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి తన రచనలో ప్రయోగించాడు. ఆయనకు 'ఎరుక' అనే మాటపై, చెప్పలేనంత మమకారం వున్నట్లుగా కనబడుతుంది. అలాగే ఈ 'ఎరుక' అనే మాటనుంచి పుట్టిన జంట మాటల నుడికారం 'యెఱిఁగి యెఱిఁగి' అనే జంట పదం అన్నా కూడా నన్నయకు మాటలలో చెప్పలేనంత మమకారం. ఈ జంట పదం ఇప్పుడు వాడకంలో వున్న 'తెలిసి తెలిసి' అన్న రూపంలో నన్నయ భారతంలో కనబడదు. ఎన్ని సందర్భాలలో ఈ జంట మాటల నుడికారాన్ని నన్నయ ప్రయోగించాడో అన్ని సందర్భాలలోనూ తప్పనిసరి పరిస్థితులకు లోబడిగానీ, మరే కారణంచేతగానీ, తెలిసితెలిసీ మనుషులుచేసే తప్పులకు, మనసు మూలుగుతూ నిస్సహాయంగా పడే బాధ ఎలా వుంటుందో వారి వారి మాటలలోవ్యక్తీకరించి చూపించాడు నన్నయ. ఈ వ్యాసంలో పరిశీలనకై ఎంచుకున్న అలాంటి రెండు సందర్భాల లోని పద్యాలలో మొదటిది ఆదిపర్వం, తృతీయాశ్వాసం లోని 5వ పద్యం:

యెఱిఁగి యెఱిఁగి వారి నేల వారింపర;
యిట్టి గోత్రకలహ మేల పుట్టె?
దీని కలతెఱంగు దెలియంగ నానతి
యిండు నాకు సన్మునీంద్రవంద్య!

వ్యాసభగవానుని శిష్యులలో ఒకడైన రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడనే సౌతి, నైమిశారణ్య పుణ్యప్రదేశంలో లోకకళ్యాణార్థం 12 సంవత్సరాలు సాగే సత్రయాగం చేస్తూ వున్న శౌనకాది మహామునుల వద్దకు వచ్చినపుడు, 'మీరు ఏ కథను నా నుంచి వినాలని కోరుకుంటున్నారు?' అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా వారు మహాభారత కథను వినాలని కోరుకుంటున్నాము అని చెప్పగా, ఆ కథనే చెప్పడం మొదలెడతాడు.



> నన్నయతో మొదలై ఆధునిక యుగం మొదలుగా చెప్పబడుతూన్న క్రీ.శ.1800 వరకూ మధ్యలో దాదాపు ఎనిమిది శతాబ్దాలుగా సాగిన తెలుగు సాహిత్య ప్రస్థానంలో వివిధ కాలాల్లో తిక్కన, పోతన, శ్రీనాథాది మహాకవుల రచనలలో ఆయా కాలాల సామాజిక చింతనకు, రాజకీయ స్పృహకు అనుగుణంగా జరిగిన మార్పులను గుర్తించి, విశ్లేషించి, నిష్పాక్షిక దృష్టితో అర్థంచేసుకుని, అభినందించే ప్రయత్నం అవసరమైనంత స్థాయిలో మనం చేశామా, చేస్తున్నామా? అనే ప్రశ్నలకు సంతృప్తికర సమాధానం దొరకడం సులభం కాదు.

ఆ కథలో పరీక్షిత్తు మహారాజు కుమారుడైన జనమేజయుడు వ్యాస భగవానుని అడిగిన ప్రశ్న ఈ పద్యం. మహాభారత కథ మొత్తానికి కీలకమైన ప్రశ్న ఇది. "జరగబోయే మహా సంగ్రామం వలన అపార జననష్టం జరుగుతుందన్నది 'తెలిసి తెలిసీ' భీష్మద్రోణాది మహాపురుషులు, ఇరువైపులలోనూ పెద్దవారు, ఇరుపక్షాలవారినీ సమాధాన పరచి వారిని ఎందుకు వారించలేకపోయారు? అసలు అంత భయంకరమైన వంశకలహం ఎలా పుట్టింది? దానికి అసలు కారణం యొక్క యదార్థ స్థితిని నేను తెలుసుకోవాలనుకుంటున్నాను" అని పై పద్యం భావం. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, మూలంలో, అంటే వ్యాసుని భారతంలో, జనమేజయుడు వ్యాసభగవానుని 'తెలిసి తెలిసీ మీరు ఎందుకు వారిని వారించలేదు?' అని ప్రశ్నించినట్లుగా వుండదు. నన్నయ పద్యానికి మూలమైన సంస్కృత భారతంలోని (క్రింద ఇవ్వబడిన) మూడు శ్లోకాల భాగాన్ని చూస్తే అది స్పష్టమవుతుంది.

జనమేజయ ఉవాచ:
కురూణాం పాణ్డవానాం చ భవాన్‌ప్రత్యక్షదర్శివాన్
తేషాం చరితమిచ్ఛామి కథ్యమానం త్వయా ద్విజ ||

జనమేజయుడు అడిగాడు: "స్వామీ! మీరు పాండవుల కౌరవుల నడవడిని ప్రత్యక్షంగా చూశారు. కనుక నేను మీ ముఖతహ వర్ణించబడే వారి చరిత్రను వినాలని కోరికతో వున్నాను."

కథం సమభవద్ భేదస్తేషామక్లిష్టకర్మణామ్
తచ్చ యుద్ధం కథం వృత్తం భూతాన్తకరణం మహత్ ||

= "వారు రాగద్వేషాది దోషాలకు అతీతులైనవారు, సత్కార్యాలనే చేసే అలవాట్లు కలవారు. అటువంటి వారిలో, ఒకరిపై ఒకరికి బేధభావాలు యెట్లా ఉత్పన్నమ్యాయి? ఎంతోమంది ప్రాణాలను అంతం చేసినటువంటి మహాయుద్ధం వారి మధ్య ఏవిధంగా జరిగింది?"

పితామహానాం సర్వేషాం దైవేనానిష్టచేతసామ్ |
కార్త్స్న్యేనైతన్మమాచక్ష్వ యథావృత్తం ద్విజోత్తమ ||

= "స్వామీ! నాకు తెలిసినదేమనగా, ప్రారబ్ధమనేదే ప్రేరణ చేసి, మా ప్రపితామహుల మనస్సులను యుద్ధరూపమైన అనిష్ఠలో లగ్నంచేసింది అని. వారిదైన సంపూర్ణ వృత్తాంతాన్ని నాకు మీరు జరిగింది జరిగినట్లుగా వర్ణించి వివరించ వలసింది."

మూలంలోని ఈ మూడు శ్లోకాలను, వాటి భావాన్ని గ్రహించిన మీదట, ఆంధ్రభారతంలోనిపై పద్యంలో, మొదటి పాదంలో వేయబడిన ప్రశ్న ఖచ్చితంగా నన్నయ ఆ సందర్భంలో చేసిన చేర్పు అని విదిత మవుతుంది. దీనికి కారణం ఆలోచిస్తే అది తన కాలానికి అనుగుణంగా నన్నయ చేసిన ఆధునీకరణలో ఒక భాగం అని కూడా అనిపిస్తుంది. కాలాలు మారుతున్న కొలదీ మూల మహాభారత గ్రంథానికి చేర్పులు జరిగి పాతిక వేల శ్లోకాలతో ఉన్న గ్రంథం కాస్తా లక్ష శ్లోకాల మహా గ్రంథంగా ఎలాగైతే మారిందో, అలాగే తరాలు గడిచే కొలదీ మహాభారతంలోని విషయాలపై అవగాహన, కొన్ని కొన్ని సందర్భాలలో అందులోని వ్యక్తుల ప్రవర్తనపై విమర్శనా దృష్టి కూడా పెరిగి పాఠకుల మనస్సులలో వారి వారి దృక్కోణాలకు అనుగుణంగా, మహాభారతంలో జవాబు దొరకని కొన్ని సందేహాలూ, ప్రశ్నలూ ఉదయించాయి. నన్నయ కాలానికి ఆదిలోనే అలా ఉదయించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు 'యుద్ధం జరిగితే అపారమైన జననష్టం, ఆస్తినష్టం జరుగుతుందని తెలిసి కూడా భీష్మ, ద్రోణాదులైన పెద్దలు కురుపాండవుల మధ్య వైరం యుద్ధం దాకా వెళ్ళకుండా ఎందుకు ఆపలేకపోయారు? యుద్ధం జరగకుండా ఆపడానికి వారి వైపునుంచి నిజమైన ప్రయత్నం అసలు జరిగిందా? నిజంగా జరిగితే దాని పర్యవసానం అంత ఘోరంగా ఉండకపోను గదా?' అన్నవి. వీటన్నిటి భావాన్నే 'యెఱిగి యెఱిగి' అన్న ఒక్క జంటపదాలతెలుగు నుడికారంలో గర్భితం చేసి జనమేజయుని ద్వారా అడిగించాడు నన్నయ. తన కాలం నాటికి విజ్ఞుల మనస్సులలో ఉదయించిన సందేహాన్ని పై పద్యం మొదటి పాదంలో అలా చేర్చి ఆనాటికి మహాభారతాన్ని అలా ఆధునీకరించాడు నన్నయ అని తెలుతుంది.

ఇప్పుడు రెండవ సందర్భంగా, ఆదిపర్వం, తృతీయా శ్వాసం లోనిదే 'యయాతి చరిత్ర' లోని పద్యాన్ని పరిశీలిద్దాం.

తగిలి జరయు రుజయు దైవవశంబున
నయ్యెనేని వాని ననుభవింత్రు
గాక యెఱిఁగి యెఱిఁగికడఁగి యారెంటిఁ జే
కొందురయ్య యెట్టి కుమతులైన?

"ముసలితనం గాని, రోగం గాని దైవవశంగా సంభవిస్తే ఎవరైనా ఇక తప్పదు గనుక అనుభవిస్తారుగాని, తెలిసి తెలిసీ ఈ రెండు బాధలను ఎంత బుద్ధిలేని వాడైనా తనంత తాను స్వీకరిస్తాడా?" అని ఈ పద్యం భావం. ఇది కూడా మూలంలో లేనిదే. మూలంలోవున్న వాటిని సంక్షేపిస్తూ నన్నయ కూర్చిన ఒక అందమైన పద్యం ఇది. మూలంలో యయాతి తన పుత్రులలో ఒక్కొక్కడినే పిలిచి తన ముసలితనాన్ని స్వీకరించి వారి యవ్వనాన్ని తనకు ఇమ్మంటాడు. చివరి కుమారుడైన పూరుడు తప్ప మిగిలిన నలుగురు కుమారులు (యదు, తుర్వసు, ద్రుహ్యు, అను అనువారు) "ముసలితనం ఒక భరించలేని బాధ. అందులో శరీరం దుర్బలమవుతుంది. మడతలు పడుతుంది. వెంట్రుకలు తెల్లబడతాయి. తీసుకున్న ఆహారం కూడా సరిగా వొంటికి పట్టక అనేకమైన బాధలకు కారణమవుతుంది" అని ఒకరికి తరువాత ఒకరువారి మనసుకు తోచిన బాధలు వివరంగా చెప్పి, తండ్రి కోరికను నిరాకరించడం ఈ పద్యానికి సందర్భం. 'యెఱిగి యెఱిగి' అన్న ఒక్క తెలుగు నుడికారంతో ఆ మొత్తాన్నీ సంక్షిప్తం చేసి, అదనంగా వ్యాసభారతంలో లేని, వారి నిరాకరణకు సామాన్యుని చిత్తానికి సహజమైనదిగానూ, సహేతుకమైనదిగానూ అనిపించే అసలైన కారణాన్ని ఆంధ్ర భారతంలో చేర్చి, సామాన్యుని ఆలోచనా విధానం ఆ సందర్భంలో ప్రతిబింబించేలా ఆధునీకరించాడు నన్నయ.

మచ్చుకు ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే. భారత ఆంధ్రీకరణ బృహత్సౌధానికి పటిష్ఠమైన పునాదిని వేసే క్రమంలో, ఆ పునాది గట్టిదనానికి నన్నయ ఎంచుకున్నది కేవలం సంస్కృతము, తెలుగు అన్న భాషలే కావనీ, కాలానుగుణంగా ఆనాటికి వృద్ధిచెందిన హేతుబద్ధ ఆలోచనా సరళికి అనుగుణంగా వలసిన మార్పు చేర్పులను చేయడం ద్వారా అది సాధించదలిచాడనీ, అదే ఆధునికతకు అంతఃసూత్రమనీ, అది సాధించడంలో కృతకృత్యుడైన నన్నయ తన నాటికి తాను ఆధునికుడనీ నిరూపించగలిగే సందర్భాలు నన్నయ భారత భాగంలో చాలానే కనిపిస్తాయి.

■ భట్టు వెంకట రావు

> భారత ఆంధ్రీకరణ బృహత్సౌధానికి పటిష్ఠమైన పునాదిని వేసే క్రమంలో, ఆ పునాది గట్టిదనానికి నన్నయ ఎంచుకున్నది కేవలం సంస్కృతము, తెలుగు అన్న భాషలే కావనీ, కాలానుగుణంగా ఆనాటికి వృద్ధి చెందిన హేతుబద్ధ ఆలోచనా సరళికి అనుగుణంగా వలసిన మార్పు చేర్పులను చేయడం ద్వారా అది సాధించదలిచాడనీ, అదే ఆధునికతకు అంతఃసూత్రమనీ, అది సాధించడంలో కృతకృత్యుడైన నన్నయ తన నాటికి తాను ఆధునికుడనీ నిరూపించగలిగే సందర్భాలు నన్నయ రచిత భారత భాగంలో చాలానే కనిపిస్తాయి.

## "పాఠకుల ఆదరణ ధారగా రాసేలా చేసింది."

పలకరింపు
చిరంజీవి వర్మ



**ఇటీవల విడుదలైన మీ 'కాకిబొడ్డు' కథా సంపుటిలోని కథలన్నీ క్షత్రియ సామాజిక వర్గ నేపథ్యంలోవి. ఒకరకంగా ఉత్తరాంధ్ర నుంచి కె.ఎన్.వై.పతంజలి, పూసపాటి కృష్ణంరాజుల సాహిత్యానికి గోదావరి డెల్టా నేపథ్యం నుండి వచ్చిచేరిన కొనసాగింపుగా ఉంటాయి మీ కథలు. మీరేమంటారు?**

ఎవరైనా సరే... మనకి తెలియని జీవితాలకన్నా తెలిసిన జీవితాల గురించే బాగా చెప్పగలరని నమ్ముతాను. నేను పుట్టి పెరిగింది తూర్పు గోదావరి జిల్లాలోని క్షత్రియ కుటుంబం కాబట్టి, సహజంగానే, నా జీవిత నేపథ్యానికి సంబంధించిన విషయాలు నా కథల్లో భాగం అవుతూ ఉన్నాయి. ఉత్తరాంధ్రలో పూసపాటి, పతంజలితోపాటూ దాట్ల నారాయణమూర్తి రాజు కూడా అక్కడి క్షత్రియ సామాజిక నేపథ్యంతో విరివిగా కథలు రాసారు. ఈ సామాజికవర్గం నుంచే... తెలుగునాట ఇంకా చాలామంది రచయితలు న్నప్పటికీ వారి కథా నేపథ్యాలు వేరు వేరు. పూసపాటి, పతంజలి, నారాయణ మూర్తి కథల్లోలా... నా కథల్లో వుండే క్షత్రియ నేపథ్యం మూలాన వారి కథలతో పోలిక వస్తోంది. ఒకటే సామాజికవర్గం అయినప్పటికీ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల క్షత్రియ కుటుంబాల మధ్య కొన్ని పద్ధతులూ, పడికట్ల తేడాలుంటాయి. మర్యాదలూ మాటతీరు కూడా. ఈ పరిస్థితుల్లో కృష్ణంరాజు, పతంజలి సాహిత్యానికి నేను కొనసాగింపా? అంటే అవుననీ చెప్పలేను, కాదనీ చెప్పలేను. అది పాఠకుల, ఇతర సాహిత్య విశ్లేషకుల స్వవిషయం. క్షత్రియ నేపథ్యంలో విస్తారంగా రాసిన ఆ ముగ్గురూ ఇప్పుడు లేరు. నా కథలు చదివిన పాఠకులతోపాటూ ఉత్తరాంధ్ర సాహితీమిత్రులు కూడా ఆ గొప్ప రచయితల కథల్ని జ్ఞాపకం చేసుకోవడం సంతోషాన్ని కలిగిస్తుంటుంది.




> ఒకటే సామాజికవర్గం అయినప్పటికీ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల క్షత్రియ కుటుంబాల మధ్య కొన్ని పద్ధతులూ, పడికట్ల తేడాలుంటాయి. మర్యాదలూ మాటతీరు కూడా. ఈ పరిస్థితుల్లో కృష్ణంరాజు, పతంజలి సాహిత్యానికి నేను కొనసాగింపా? అంటే అవుననీ చెప్పలేను, కాదనీ చెప్పలేను. అది పాఠకుల, ఇతర సాహిత్య విశ్లేషకుల స్వవిషయం.

**ఈ కథలన్నీ దాదాపుగా నోస్టాల్జియా. మీ పాత్రల ఫాల్స్ ప్రిస్టేజెస్, అతి లౌక్యం, ఎవరూ స్పృశించని క్షత్రియ స్త్రీల కష్టాలు, అండర్ ప్లేగా వుండే హాస్యం ఇవన్నీ ఇలా చూపించాలనే ఎరుక మీకెలా కలిగింది?**

నా కథలు నోస్టాల్జియాలా అనిపిస్తాయి కానీ, ఇవన్నీ నా బాల్య జ్ఞాపకాల నుంచి పుట్టినవి మాత్రమే కాదు. నేను పుట్టిన డెబ్బైయవ దశకం నుంచి ఇప్పటివరకూ మారిన, మారుతున్న సామాజిక, సాంకేతిక రాజకీయార్థిక పరిస్థితులకి నా కథల్లో అద్దం పడుతుంటాను. కథల్లో కాలం, పాత్రలూ వెనుకటి తరానికి చెందినవి కావడంతో కథలు నోస్టాల్జియాలా అనిపిస్తాయి. వర్తమాన సమస్యలని కూడా గతకాలపు పాత్రలతో చెప్పిన కథలున్నాయి. ఉదాహరణకి 'నివురుగప్పిన పరువు', 'ఉండేలు' లాంటివి. నిజానికి నేను క్షత్రియ నేపథ్యంతో రాసిన కథలకంటే ఇతర వస్తువులతో రాసిన కథలే ఎక్కువ. క్షత్రియ స్త్రీల కష్టాలంటూ నేను ప్రత్యేకించి రాసింది లేదు. 'కాకిబొడ్డు' లాంటి కొన్ని కథలని స్త్రీ పాత్రల చుట్టూ తిప్పడంవల్ల ఆ సమస్యలు ఆవిష్కృతమయ్యాయి. ఆ సమస్యల గురించి చక్కగా రాసిన రచయిత్రి దాట్ల లలితగారు. ఇక హాస్యం, వ్యంగ్యం అంటారా? అది గోదారి నీళ్ళ మహత్యంతో పాటూ, సామాజికవర్గ నేపథ్యం నుంచి పుట్టినవనుకుంటా.

**మూడు దశాబ్దాల సాహిత్య నేపథ్యం వుంది మీకు. చాలా గ్యాప్ తరవాత తక్కువ కాలంలో ఈ కథలు ధారగా రాశారు. ఆ ప్రేరణ ఎలా కలిగింది?**

ఒకప్పుడు తక్కువగానూ ఇప్పుడు ఎక్కువగా రాయడం అంటూ ఏమీలేదు. నా కథల నిడివి ఎక్కువగా వుండడం ప్రధాన సమస్య. కథ మొదలెడితే నలభై, యాభై పేజీలు అలా పోతూనే వుంటుంది. ఇవి పత్రికలలో రావాలనుకోవడం ఎంత అత్యాశో ఓ జర్నలిస్టుగా నాకు తెలుసు. దీనికి తోడు ఇరవైఏళ్ళుగా, టివి రిపోర్టర్‌గా జిల్లాలు మారుతూ వుండడంతో... చదవడంలోవున్న సౌఖ్యం, నాకు రాయడంలో కనిపించలేదు. దీంతో కొంత విరామం వచ్చిన మాట వాస్తవం. స్వంత జిల్లాకి వచ్చాకా, కాకినాడ సాహిత్య వాతావరణం నన్ను మళ్ళీ రాయడం వైపు ఆకర్షించింది. క్రమం తప్పకుండా జరిగే సాహిత్య సభలూ, చిరపరిచయం అయిన రచయితలు, రచయిత్రులు నాలో మళ్ళీ రాయాలన్న ఆలోచన కలిగించారు. వెబ్ పత్రికల రాకతో స్థల సమస్యా సమసింది. పాఠకుల ఆదరణ ధారగా రాసేలా చేసింది.

✆ 85559 84787

## ఖాళీ అయిన ఇల్లు



ఓ మూలన నక్కి ఉంది
గోడ మీద
పిల్లలు గీచిన దెయ్యం బొమ్మ
ఉన్నట్టుండి భయపెడుతోంది

అక్కడక్కడ
పగిలిన గాజుముక్కలు
సొంతింటి కలల్లా ఉన్నాయ్

పిల్లలు ఆడి వదిలిన
గాలి లేని బంతి ఒకటి
చచ్చుగా పడి ఉంది

సరిగ్గా ఆపని కుళాయి నుండి
జీవితం బొట్లు బొట్లుగా
రాలుతోంది

ఇల్లు ఖాళీ అని తెలిస్తే
చూడటానికి వెళ్లాం
గతంలో ఉన్న ఇల్లాలు వేసిన మొక్క ఒకటి
జ్ఞాపకాలను పూస్తోంది
తీసిన తలుపు
గత సంసార దుఃఖాన్ని పాడుతోంది
గుండెలో నాలుగు గదుల్లా
ఇంట్లో నాలుగు గదులు ఉన్నాయ్

గోడకు
తగిలించిన క్యాలెండర్
పోయిన్నెలనే భరిస్తూ ఉంది
అమ్మా నాన్నా గొడవ పడ్డప్పుడు వణికిన
పిల్లల భయం

ఆ ఇల్లు
కష్టాలకు దుఃఖించి
ఉండవచ్చు
సుఖాలకు ఎగిరి గంతేసి
ఉండవచ్చు

ప్రతీ ఇంట్లోనూ ఒక
సముద్రముంటుంది
దాటేయడానికి
పడవల్లాంటి
మనుషులు కావాలి.

■ సుంకర గోపాలయ్య
✆ 94926 38547

ఇలా చేయండి!

# ఇల్లు సర్దుతున్నారా?



ఇంట్లో వస్తువులు శుభ్రంగా ఉంటే ఇల్లు చూడ్డానికి బాగుంటుంది. ముఖ్యంగా కొన్ని వస్తువుల శుభ్రత మీద మనం ఎక్కువ దృష్టి పెట్టం. అలాగే ఇల్లు సర్దడంలో ప్లానింగ్‌గా వ్యవహరించం. ఇంటి శుభ్రత గురించి కొన్ని టిప్స్...

- ఇంటిని శుభ్రం చేసేటప్పుడు అవుటర్ ఏరియాపై మొదట దృష్టిపెట్టాలి. రెండో రోజు డైనింగ్ ఏరియా సర్దుకోవాలి.
- లెదర్ బ్యాగులను కొంతకాలం వాడి పక్కన పడేస్తాం. చలికాలంలో వీటిపై దుమ్ము, బూజులాంటిది ఏర్పడుతుంది. దీన్ని తొలగించాలంటే మెత్తటి బట్టను నూనెతో తడిపి తుడిస్తే లెదర్ బ్యాగులు తళ తళ మెరుస్తాయి.
- ఇంట్లోని వెండి సామాన్లు మెరుపు కోల్పోయి నల్లగా మారితే వాటిని వంటసోడాతో శుభ్రం చేయాలి. వెడల్పాటి గిన్నెలో అల్యూమినియం ఫాయిల్ పరిచి దానిపై వెండిసామాగ్రి ఉంచాలి. వంటసోడా, ఉప్పు కలిపిన వేడినీటిని వెండిసామాన్ల మీద పోయాలి. తర్వాత నీళ్లతో కడిగితే తళక్కున మెరుస్తాయి.
- కూరలు తరిగే ప్లాస్టిక్ బోర్డుపై, డైనింగ్ టేబుల్‌పై మరకలు ఉంటే నిమ్మచెక్కతో రుద్ది పదిహేను నిమిషాల తర్వాత కడిగితే మరకలు, మురికి రెండూ పోతాయి.
- ప్లాస్టిక్ డబ్బాలలో ఘాటైన మసాలా దినుసులు పెడుతుంటాం. అవి అయిపోయిన తర్వాత డబ్బాల్లో మసాలా వాసన వస్తుంటుంది. ఆ వాసన పోవడానికి ఒక అగ్గిపుల్ల వెలిగించి ఆర్పేసి పొగ పైకి పోకుండా ప్లాస్టిక్ డబ్బాను దానిపై బోర్లించాలి. ఇలా కాసేపు ఉంచితే ఘాటైన మసాలా వాసనలు పోతాయి.

తిరుప్పావై




## కంస మర్దనుణ్ణి కొలుద్దాం!

**పదిహేనో పాశురం**

"ఎల్లే! ఇళంగిళియే ఇన్నమ్ ఉరంగుదియో?"
"శిల్లెన్ఱు అళైయేన్మిన్ నంగైమీర్! పోదరుగిన్ఱేన్"
"వల్లై, ఉన్ కట్టురైగళ్! పణ్డే ఉన్ వాయ్ అఱిదుమ్!"
"వల్లర్గళ్ నీంగళే నానే తాన్ అయిడుగ!"
"ఒల్లై నీ పోదాయ్ ఉనక్కు ఎన్న వేఱు ఉడైయై!"
"ఎల్లారుమ్ పోన్దారో?" పోన్దార్ పోనుదు ఎణ్ణిక్కొళ్;
వల్లానై కొన్ఱానై, మాత్తారై మాత్తు అళిక్క
వల్లానై, మాయనై ప్పాడు ఏల్ ఓర్ ఎంబావాయ్"

**భావం:** పక్కింటి దగ్గర గోపికల అలజడి విని, ఈ ఇంటి గోపిక నిదుర లేచి, గానం మొదలుపెట్టింది. ఆమెను చెలులు పిలుస్తూ ఉంటే వాదనకు దిగింది. వారి మధ్య జరిగిన ఆ చమత్కార సంభాషణ ఇది.

**బయటివారు:** ఏమే లేత చిలుకా! ఇంకా నిద్రపోతున్నావా?

**గోపిక:** (చిరు కోపం ప్రదర్శిస్తూ) నన్ను అలా పిలవకండి. మీరే పరిపూర్ణులైన గోపకాంతలు. ఇదిగో వస్తున్నాను.

**బయటివారు:** నీ నంగనాచి కబుర్లు కట్టిపెట్టు. నీ నోటి పదును మేము ఎప్పుడో తెలుసుకున్నాం.

**గోపిక:** మాట్లాడడంలో మీ సమర్థతకు ఎవరూ తీసిపోరు. నేనే ఒంటరిదాన్నయిపోయాను.

**బయటివారు:** సరి సరి! వెంటనే బయటకు రా! నీకు వేరే పనేం లేదు కదా?

**గోపిక:** మన వారందరూ వచ్చేరా?

**బయటివారు:** అందరూ వచ్చేరా? నువ్వు బయటకు వచ్చి, కావాలంటే అందరినీ పట్టుకొని, లెక్కపెట్టు.

"కువలయాపీడం అనే మదపుటేనుగునూ, చాణూర ముష్టికులనూ, కంసాది శత్రువులనూ హతమార్చిన శ్రీకృష్ణుడి గుణగానం చెయ్యడానికి బయలుదేరుదాం రా! ఇది మన విలక్షణమైన వ్రతం" అని ఆమెను గోపికలు పిలుస్తున్నారు.

● ఎ.సీతారామారావు

యోగా గురు!



# పరిస్థితిలో మార్పుకోసం...

పద్ధతుల్లో కాలానుగుణమైన మార్పు మంచిదే! అయితే యోగాభ్యాసంలో ఆధునికత జొప్పించడం... వ్యాయామ ప్రక్రియలా కొత్త రూపాలు సంతరించుకోవడం సమంజసం కాదు. 'మూలాలు చెక్కుచెదరకుండా... ఉద్దేశాలు, ఫలితాలు సన్నగిల్లకుండా సాగేది 'హఠ యోగా' ఒక్కటే' అంటున్నారు ఈషా హఠ యోగా బోధకురాలు ఉషా ముర్తినేని. సద్గురు నుంచే యోగాభ్యాసం నేర్చుకున్న ఆమె ఇప్పటివరకూ కొన్ని వేలమందికి యోగా నేర్పారు. వారిలో సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు. యోగాభ్యాస మార్గంలో తన పయనం గురించి ఆమె 'నవ్య'కు ఇలా వివరించారు!

"మాది విజయవాడ దగ్గర ఉన్న తోట్లవల్లూరు. ఏలూరు, బెంగుళూరు, గుంటూరుల్లో నా చదువు సాగింది. నాన్న సత్యనారాయణ ఫిజిక్స్ లెక్చరర్. ఆయన ఉద్యోగ బదిలీల కారణంగా మూడు ప్రాంతాలు తిరిగాం.

### అనుకోని సంఘటనలతో...

నేను బీఎస్సీ కంప్యూటర్స్, ఎంబీఏ చదివాను. పైచదువులు చదవాలనే కోరిక ఉన్నా చిన్న వయసులోనే పెళ్లి చేయడంతో అది వీలుపడలేదు. నా జీవితంలో అదొక తీవ్రమైన అసంతృప్తి. పెళ్లైన కొన్నేళ్లకే మావారు అనారోగ్యంతో చనిపోయారు. దాంతో తెలియని శూన్యత ఆవరించింది. ఇదొక్కటే కాదు. చిన్న వయసు నుంచే ఏదో ఒక వేదన నా మనసును పీడిస్తూ ఉండేది. నేను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు మా అమ్మ ఝాన్సీలక్ష్మి కండరాల సమస్యతో బాధపడడం చూశాను. నడవడం వీలుపడక నేల మీద దేకుతూ కదిలేది. అమ్మని ఆ స్థితిలో చూడడం కన్న బిడ్డగా నాకెంతో కష్టంగా ఉండేది. ఎన్ని చికిత్సలు చేయించినా తగ్గని ఆ సమస్య సహజసిద్ధ పద్ధతులతో తగ్గిపోయింది. ఆమె పరిస్థితి మెరుగు పడడంతో నా గుండె కుదుట పడింది. అలా ఈ అంశాలన్నీ నన్ను ఆధ్యాత్మిక మార్గంలోకి నడిపించాయని చెప్పవచ్చు. ప్రారంభంలో మానసిక సాంత్వన కోసం పలు ఆధ్యాత్మిక సంస్థల్లో చేరాను. కానీ ఎక్కడా నాకు తృప్తిగా అనిపించలేదు. 2005లో హైదరాబాద్‌లో సద్గురు ఏర్పాటుచేసిన వర్క్‌షాపులకు హాజరయ్యాను. ఆ శిక్షణ నచ్చి, యోగా టీచర్ అవ్వాలనే ఆలోచనతో కోయంబత్తూరులోని సద్గురు 'ఈషా యోగా సెంటర్'లో చేరాను. సద్గురు సమక్షంలో, ఆయన శిక్షణలో కొద్ది రోజుల పాటు సాధన కొనసాగింది. అలా ఆరు నెలల యోగా టీచర్ శిక్షణ తీసుకుని, తిరిగి వచ్చి హైదరాబాద్‌లో 'హఠ యోగా సెంటర్'ను స్థాపించాను.


యోగా నేర్పిస్తూ...

హఠం అనే సంస్కృత పదానికి 'అత్యుత్తమం' అని అర్థం. వాడుకభాషలో మొండితనాన్ని 'హఠం' అంటారు. నిజానికి ఎలాంటి వ్యాయామం చేయాలనుకున్నా, ప్రారంభంలో ఉండే ఉత్సాహం ఆ తర్వాత తగ్గిపోతుంది. శరీరం బద్ధకిస్తే, మనసు శరీరాన్ని విశ్రాంతి తీసుకోమని ఆదేశిస్తుంది. దాంతో క్రమేపీ వ్యాయామానికి దూరమవుతాం. ఇలా జరగకుండా ఉండాలంటే వ్యాయామం చేయాలనే మొండితనం ఉండి తీరాలి. హఠ యోగా సాధన చేయాలంటే ఇలాంటి గుణం కలిగి ఉండాలి. అప్పుడే ఈ యోగా ఫలితాన్ని సంపూర్ణంగా పొందగలుగుతాం. మిగతా యోగాభ్యాసానికీ హఠ యోగాకు చాలా తేడా ఉంది. హఠయోగాను సద్గురు నుంచే నేర్చుకుంటాం! ఆ అవకాశం, వెసులుబాటు ప్రపంచంలో మరే యోగాలో ఉండదు.

### గురుశిష్య పరంపరగా...

ఆదియోగి శివుని ద్వారా వేర్వేరు విద్యల్లో భాగంగా యోగాభ్యాసం సప్తరుషులకు అందిందని అంటారు. నిజానికి పతంజలి మహర్షి అనుసరించిన యోగాలో కాలానుగుణ మార్పులతో ఆయనదైన ముద్ర వేయడం జరిగింది. అందుకే పతంజలి మహర్షిని 'ఫాదర్ ఆఫ్ మోడర్న్ యోగా' అంటారు. ఈ యోగా విధానం గురువు నుంచి శిష్యులకు, వారి నుంచి బోధకులకు, వారి నుంచి శిక్షకులకు వ్యాప్తి చెందింది. అంటే... యోగాభ్యాసం నేర్చుకునే వారికి ఆ విధానం చేరే క్రమంలో నాణ్యత, సాధనావిధాన పద్ధతులు లోపించే అవకాశం ఉంటుంది. సద్గురు హఠ యోగాలో ఇందుకు అవకాశమే లేదు. గురుశిష్యుల పరంపర ఆధారంగానే యోగాశిక్షణ కొనసాగుతుంది. అలా నేర్చుకున్న శిక్షకులే హఠ యోగాను నేర్పిస్తారు కాబట్టి స్వచ్ఛత, నాణ్యత చెక్కుచెదరదు. ఇందుకోసం ప్రతి శిక్షకుడు కోయంబత్తూరులోని సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆశ్రమంలో ఆరు నెలల పాటు శిక్షణ పొందాలి. 2012లో నేను శిక్షణ పొందాను. ఆరు నెలల కాలంలో 1750 గంటల పాటు శిక్షణ తీసుకున్నాను. ఆ శిక్షణలో కేవలం హఠ యోగా ఒక్కటే కాకుండా జీవితాన్ని అనుసరించే విధానం, పరికించే దృక్కోణం మారుతుంది. యోగా సాధన చేయాలనే ఆసక్తి ఉండడం సహజం. కానీ యోగా పట్ల స్వతఃసిద్ధమైన ఇష్టం కలిగి ఉండడం అరుదు. నా విషయంలో రెండోదే జరిగింది.

### అదే లక్ష్యంగా...

మా 'హఠ యోగా సెంటర్'లో నాతో పాటు మా అమ్మాయి శారద కూడా యోగా టీచర్‌గా పని చేస్తోంది. తను కూడా నాకు లాగే ఈషా యోగా సెంటర్‌లో రెండేళ్ల క్రితమే టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి వచ్చింది.

ప్రకృతి నుంచి క్రమేపీ వేరుపడిపోతున్నాం. సహజసిద్ధ ఆరోగ్య విధానాలు, చికిత్సా పద్ధతులను వదులుకున్నాం. ఫలితంగానే తరచుగా రుగ్మతల బారిన పడుతున్నాం. ప్రాచీన భారతదేశంలో వ్యాధికి గురయ్యే వారిని వేళ్ల మీద లెక్కపెట్టగలిగే పరిస్థితి ఉండేది. వారికి కూడా సహజసిద్ధ పద్ధతుల్లో చికిత్సలు జరిగేవి. కానీ ఇప్పుడు ఎవరిని చూసినా ఏదో ఒక రుగ్మత ఉంటోంది. ఇందుకు కారణం అస్తవ్యస్త జీవనశైలి! ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చి ప్రకృతితో కోల్పోయిన అనుబంధాన్ని పునరుద్ధరించాలనే సంకల్పం ఉంది. వాటికి నేను ఎంచుకున్న మార్గాలు... యోగిక్ కిచెన్ (ఆరోగ్యకరమైన ఆహారం), హఠం (యోగాసనాలు), చేనేత (వస్త్రధారణ). వీటిని బోధించడం ద్వారా ఎవరికి వారు జీవనశైలిని సరిదిద్దుకుని, మెరుగైన ఆరోగ్యం పొందేలా చేయాలనేది నా లక్ష్యం!"

• గోగుమళ్ల కవిత
ఫొటోలు: అశోకుడు

### 21 రోజుల్లో...

ఒకసారి యోగాభ్యాసం నేర్చుకున్న వారు స్వయంగా సాధన చేసుకోగలిగేలా 21 రోజుల 'ఫిట్‌నెస్ ఇంటెన్సివ్ ప్రోగ్రాం' రూపొందించాం. మర్దన, సూర్యక్రియ, యోగాసనాలు, ఉపయోగ, ప్రాణాయామం... హఠ యోగాలో ప్రధానమైన అంశాలు. వీటిని సాధన చేయడం ద్వారా ఎసిడిటీ, థైరాయిడ్, వెన్నునొప్పి లాంటి సమస్యలు తగ్గుతాయి. మరీ ముఖ్యంగా మహిళల్లో పి.సి.ఒ.డి సమస్య మందులతో పని లేకుండానే నయమవుతుంది. వారంలో ఐదు రోజులు ఉండే ఈ యోగాభ్యాసం సాధన చేయడం వల్ల జీవనశైలికి సంబంధించిన 80% సమస్యలను తగ్గించుకోవచ్చు లేదా వాయిదా వేసుకోవచ్చు. యోగాభ్యాసంతో పాటు సుగంధద్రవ్యాలు, ఆకుల నుంచి తయారు చేసిన కషాయాలు అందిస్తాం. మరిన్ని వివరాలకు www.hatamyogastudio.com వెబ్‌సైట్ చూడండి.


లక్ష్మీ మంచుతో...

### ప్రముఖులూ ఉన్నారు!

ఇప్పటివరకూ హైదరాబాద్‌లో పలు ఐటి కంపెనీల్లో, కార్యాలయాల్లో వర్క్‌షాపులు ఏర్పాటుచేసి మూడు వేల మందికి పైగా శిక్షణ ఇచ్చాను. సినీ ప్రముఖుల్లో రానా, లక్ష్మి మంచు, రకుల్‌ప్రీత్, రియా చక్రవర్తి తదితరులున్నారు. రాజకీయ ప్రముఖుల్లో ఎంపీ సుజనా చౌదరి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి ఉన్నారు.

విభిన్నం

## చీరకట్టుతో మారథాన్!



అంకితా కొన్వార్... ప్రముఖ మోడల్, ఫిట్‌నెస్ గురు మిలింద్ సోమన్ భార్య (ఇద్దరికి వయసులో ఇరవై ఆరేళ్ల తేడా ఉంటుంది). భర్తలానే ఆమెకూ ఫిట్‌నెస్ పట్ల ప్రేమ ఎక్కువ. ఇటీవల ముంబయ్‌లో జరిగిన 'పింకథాన్' 8వ ఎడిషన్‌లో ఆమె పాల్గొన్నారు. అయితే అందరికన్నా భిన్నంగా అస్సాం సాంప్రదాయ సిద్ధమైన చీరకట్టులో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మారథాన్ పరుగుకు చీర కట్టు అడ్డుకాదని నిరూపించారు.

అంకిత స్వస్థలం అస్సాంలోని గువహటి. ప్రముఖ మోడల్, 'పింకథాన్' ఈవెంట్ ప్రచారకర్త మిలింద్ సోమన్‌ను గత ఏడాది ఆమె పెళ్లిచేసుకున్నారు. భర్తతో కలిసి ఎక్కడ ఫిట్‌నెస్ ఈవెంట్ జరిగినా ఉత్సాహంగా పాల్గొనేవారు. ప్రతి మారథాన్‌లో టీషర్ట్, ప్యాంట్, స్పోర్ట్స్ షూ ధరించే అంకిత ఇటీవల ముంబయ్‌లో జరిగిన 'పింకథాన్'లో వినూత్నంగా చీర కట్టుకొని, చెప్పులు తొడుక్కుని పరుగెత్తడం విశేషం. సాధారణంగా ఇలాంటి మారథాన్‌లకు అందరూ జాగింగ్ ట్రాక్స్ వేసుకుంటారు. అయితే అంకిత చీరకట్టులో పాల్గొనడానికి ప్రత్యేక కారణం ఉంది. 'పింకథాన్'లో భాగంగా 10 కి.మీ దూరాన్ని 64 నిమిషాల్లోనే ముగించి చీర కూడా మారథాన్ పరుగుకు సౌకర్యంగానే ఉంటుందని నిరూపించారీ ఫిట్‌నెస్ ప్రేమికురాలు. "ప్రస్తుతం నేను మా కుటుంబానికి దూరంగా ఉన్నా. అస్సాం మహిళలు ధరించే సాంప్రదాయ చీరతో పింకథాన్‌లో పాల్గొనడం ద్వారా నేను వారితో ఉన్నాననే భావన కలిగింది. అస్సాంలో ప్రస్తుతం పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. అక్కడ గత కొన్ని రోజులుగా అల్లర్లు చెలరేగుతున్నాయి. ఆ పరిస్థితులు సద్దుమణిగి శాంతియుత వాతావరణం ఏర్పడాలని కోరకుంటున్నా" అంటూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో చీరలో పరుగెడుతున్న ఫొటోలను పోస్ట్ చేశారు అంకిత.



### ఆమె స్ఫూర్తితో ...

మారథాన్‌లో పాల్గొనే మహిళలు అంకిత ఫొటోలు చూసి ఆశ్చర్యపోయారు. తన రాష్ట్రం పట్ల ఆమెకున్న అనుబంధానికి ముచ్చటపడ్డారు. "చీరకట్టుతో పరుగెత్తడం ఇబ్బందిగా, కష్టంగా ఉంటుందని అనుకునే మహిళలు ఒకసారి గ్రామీణ మహిళల్ని గుర్తుచేసుకోవాలి. వారు రోజంతా చీరలోనే ఉంటారు. అంతేకాదు సైకిల్ తొక్కడం, పొలాల్లో పనిచేయడం, ఈతకొట్టడం వంటి పనులన్నీ సులువుగా చేస్తారు. చీరతో మారథాన్‌లో పరుగెడుతున్న సమయంలో నాకు మా ప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు బిర్బలా (కనకలతా బరూహ) గుర్తుకొచ్చారు. చీర కట్టుకునే ఆమె ఎన్నో పోరాటాలు చేశారు" అని ఈ సందర్భంగా అన్నారామె. మహిళల్లో ఆరోగ్య స్పృహ పెంచేందుకు ముఖ్యంగా రొమ్ము కేన్సర్ మీద అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో పింకథాన్ నిర్వహిస్తున్నారు పింకథాన్ సభ్యులు. రోజూ పరుగెత్తడం ద్వారా మహిళలు ఫిట్‌నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని చెప్పడమే ఈ మారథాన్ ఉద్దేశం.

ఫిట్‌నెస్

## వారెవ్వా... వాటర్ ఏరోబిక్స్!

బరువు తగ్గాలంటే వ్యాయామం చేయక తప్పదు. అయితే వ్యాయామం చేయడమంటే అందరికీ నచ్చకపోవచ్చు. అలాంటివాళ్లు 'వాటర్ ఏరోబిక్స్' ఎంచుకోవచ్చు. సరదాగా సాగే ఈ వ్యాయామంతో ఉల్లాసానికి ఉల్లాసం, వ్యాయామానికి వ్యాయామం రెండూ దక్కుతాయి!

**అధిక బరువు!**



అధిక బరువుతో బాధపడేవారికి ఏ వ్యాయామం చేయాలన్నా బద్ధకంగా ఉంటుంది. దాంతో పూర్తిగా వ్యాయామానికే దూరమవుతారు. ఇలాంటివారు వాటర్ ఏరోబిక్స్‌ను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు. ఈ వ్యాయామంలో 80% శరీరం నీళ్లలో మునిగి ఉంటుంది కాబట్టి శరీరం బరువు అనిపించదు. దాంతో తేలికగా వ్యాయామాలు చేయగలుగుతారు.

**పెద్ద వయసు, కీళ్లనొప్పులు!**

పెద్దవయసులో కీళ్ల నొప్పులు సహజం. దాంతో వ్యాయామం చేయడానికి కీళ్లు సహకరించవు. వాటర్ ఏరోబిక్స్‌లో ఈ సమస్య ఉండదు. కీళ్ల మీద బరువు తక్కువగా పడుతుంది కాబట్టి వ్యాయామాలు చేయడం తేలిక!

**రిహ్యాబిలిటేషన్!**

సర్జరీ తదనంతరం శరీరాన్ని తిరిగి గాడిలో పడేయాలంటే వ్యాయామం చేయాలి. అయితే వ్యాయామం ఒత్తిడి శరీరం మీద పడకుండా ఉండాలంటే వాటర్ ఏరోబిక్స్ చేయాలి. ఈ వ్యాయామంతో నొప్పులు తగ్గి, శరీరంలో ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది.

## ముత్యాల ముగ్గు


13 చుక్కలు
1 వరకు (ఇటు అటు వదిలి)
సరి చుక్కలు


కమల
వెల్దండ, మహబూబ్‌నగర్


17 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకు


జయ
నిజామాబాద్


15 చుక్కలు
8 మధ్య చుక్కలు
ప్రతికోణం దగ్గర 7-1
మధ్య చుక్కలు


సామ్రాజ్యలక్ష్మి
గుంటూరు


17 చుక్కలు
5 వరుసలు (ఇటు అటు వదిలి)
5 వరకు


పద్మ పుల్లమరాజు
సీతారాంబాగ్, హైదరాబాద్

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.
మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com




# కరెంట్ అఫైర్స్ - అవార్డులు

## అట్వూడ్, ఎవరిస్టోలకు బుకర్ ప్రైజ్

ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకమైన బుకర్ ప్రైజ్ కెనడా రచయిత మార్గరెట్ అట్వూడ్, బ్రిటిష్ రచయిత బెర్నార్డైన్ ఎవరిస్టోలను సంయుక్తంగా వరించింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ అవార్డును జ్యూరీ 1992 తర్వాత తొలిసారి ఇద్దరికి ప్రకటించింది. బుకర్ ప్రైజ్ గెలుచుకున్న అతి పెద్ద వయస్కురాలిగా అట్వూడ్ (79) నిలిచారు. మరో విజేత ఎవరిస్టో ఈ ప్రైజ్ గెలుచుకున్న తొలి నల్లజాతి మహిళ.

## 91వ ఆస్కార్ అవార్డులు

- ఉత్తమ చిత్రం: గ్రీన్‌బుక్; ఉత్తమ దర్శకుడు: అల్ఫోన్సో క్యూరాన్ (రోమా);
- ఉత్తమ నటుడు: రామి మాలిక్ (బొహేమా నియా రాప్సోడీ);
- ఉత్తమ నటి: ఒల్వియా కోల్‌మెన్ (ది ఫేవరెట్);
- ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్: పీరియడ్: ది ఎండ్ ఆఫ్ సెంటెన్స్ (ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలోని కతిఖేరా గ్రామంలో కొంత మంది స్త్రీలు తయారు చేస్తున్న శానిటరీ ప్యాడ్స్ గురించి ఈ డాక్యుమెంటరీ తీశారు)

## జాతీయ చలన చిత్ర పురస్కారాలు



66వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను ఆగస్టు 9న ప్రకటించారు. విజేతల వివరాలు..

- ఉత్తమ నటుడు (సంయుక్తంగా): ఆయుష్మాన్ ఖురానా (అంధాదున్), విక్కీ కౌశల్ (ఉడి)
- ఉత్తమ నటి : కీర్తి సురేశ్ (మహానటి),
- ఉత్తమ దర్శకుడు : ఆదిత్యధర్ (ఉడి), ఒరిజినల్ స్క్రీన్ ప్లే : చి.ల.సౌ, ప్రజాదరణ పొందిన సినిమా : బదాయిహో (హిందీ),
- ఉత్తమ సామాజిక చిత్రం: ప్యాడ్‌మాన్ (హిందీ)
- ఉత్తమ సహాయ నటి: సురేఖ సిక్రీ (బదాయిహో),
- ఉత్తమ సహాయ నటుడు : స్వానంద్ కిర్‌కిరే (చంబక్), ఉత్తమ బాల నటులు : పీవీ రోహిత్ (కన్నడ), సందీప్ సింగ్ (పంజాబీ), తల్హా అర్షాద్ (ఉర్దూ), శ్రీనివాస్ పొకాలే (మరాఠి),
- ఉత్తమ బాలల చిత్రం : సర్కారీ హిరియా ప్రాథమిక శాల, కాశరగోడు (కన్నడ), నర్గీస్ దత్ అవార్డు : వండల్లా ఎరడల్లా (కన్నడ).

## ప్రణబ్‌కు భారతరత్న



కేంద్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ సందర్భంగా భారతరత్న, పద్మ అవార్డులను ప్రకటించింది. వివరాలు.. భారతరత్న: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, జనసంఘ్ నాయకుడు నానాజీ దేశ్‌ముఖ్, అస్సామీ వాగ్గేయకారుడు భూపేన్ హజారికా. పద్మ విభూషణ్: తీజన్‌బాయ్ (జానపదం), ఇస్మాయిల్ గుల్లేహ్ (ప్రజాసంబంధాలు), అనిల్‌కుమార్ నాయక్ (వాణిజ్యం, పరిశ్రమలు), బల్వంత్ మోరేశ్వర్ పురందరే (రంగస్థలం). పద్మ భూషణ్: జాన్ చాంబర్స్ (అమెరికా వ్యాపారవేత్త), సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా (రాజకీయ వ్యవహారాలు), ప్రవీణ్ గోవర్ధన్ (దక్షిణాఫ్రికా మంత్రి), తదితరులు. పద్మశ్రీ: 94 మందికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి.

## కీర్తి చక్ర

దేశ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం కీర్తి చక్ర నలుగురు జవాన్లకు లభించింది. వీరిలో జాట్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ తుషార్ గౌబా, 22వ రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సోవర్ విజయ్ కుమార్ (మరణానంతరం)తోపాటు 2017లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన జవాన్లు ప్రదీప్‌కుమార్ పండా, రాజేంద్ర కుమార్ నైన్ ఉన్నారు.

## హర్ష్‌పాల్ సింగ్‌కు కీర్తి చక్ర

సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ హర్ష్‌పాల్ సింగ్‌కు శాంతి సమయంలో ఇచ్చే రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్ర'ను స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రదానం చేశారు.

## నజీర్ అహ్మద్‌కు అశోచక్ర పురస్కారం

ఉగ్రవాదం బాటవీడి సైన్యంలో చేరి అమరుడైన లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీకి శాంతి సమయంలో ఇచ్చే అత్యున్నత సైనిక పురస్కారం అశోక చక్రను కేంద్ర ప్రభుత్వం జనవరి 24న ప్రకటించింది.

## 16 ఏళ్ల బాలుడికి శౌర్యచక్ర

ఉగ్రవాదులతో ధైర్యంగా పోరాడిన 16 ఏళ్ల బాలుడు ఇర్ఫాన్ రంజాన్ షేక్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మార్చి 19న శౌర్యచక్ర పతకాన్ని ప్రదానం చేశారు.

## గాంధీ శాంతి బహుమతులు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఫిబ్రవరి 26న న్యూఢిల్లీలో గాంధీ శాంతి బహుమతులను ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతలు వివరాలు.. వివేకానంద కేంద్ర (2015), అక్షయపాత్ర ఫౌండేషన్, సులభ్ ఇంటర్నేషనల్ (2016), ఏకల్ అభియాన్ ట్రస్ట్ (2017), యోహి శసకవా (2018).

## వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ప్రైజ్

మయన్మార్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను వెలుగులోకి తెచ్చినందుకుగాను రాయిటర్స్ జర్నలిస్టులు వా లోన్, క్యావ్ సో వూలు వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ప్రైజ్ - 2019కి ఎంపికయ్యారు.

## అల్‌హారికి మాన్ బుకర్ బహుమతి

మాన్‌బుకర్ ప్రైజ్ 2019 ఓ అరబ్ మహిళను వరించింది. ఒమన్‌కు చెందిన రచయిత్రి జోఖా అల్‌హారి రాసిన 'సెలెస్టియల్ బాడీ' నవలకు ఈసారి మాన్ బుకర్ ప్రైజ్ దక్కింది.

## అమితాబ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే



దేశంలోనే అత్యున్నత సినీ పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్ సెప్టెంబరు 24న ఎంపికయ్యారు.

## గ్రేటాకు బాలల శాంతి బహుమతి



స్వీడిష్ బాలల ఉద్యమకారిణి 16 ఏళ్ల గ్రేటా థంబెర్గ్‌కు అంతర్జాతీయ బాలల శాంతి బహుమతి లభించింది. గ్రేటాతోపాటు కెమెరూన్ శాంతి ఉద్యమకారిణి 15 ఏళ్ల దివినా మలోమ్ కూడా ఈ అవార్డుకు ఎంపికయింది.

## భట్‌కు ఇందిర సమగ్రతా అవార్డు

ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త చండీ ప్రసాద్ భట్‌కు ఇందిరా గాంధీ జాతీయ సమగ్రతా పురస్కారం లభించింది. 2017, 18 సంవత్సరాలకు ఆయనను ఎంపిక చేశారు.

## నోబెల్ బహుమతులు-2019

- **రసాయన శాస్త్రం:** జాన్ గూడ్‌నౌ (జర్మనీ), ఎం.స్టాన్లీ విట్టింగమ్ (బ్రిటిష్-అమెరికన్), అకిరా యోషినో (జపాన్).
- **భౌతిక శాస్త్రం:** జేమ్స్ పీబుల్స్ (కెనడియన్ అమెరికన్), మైఖేల్ మేయర్ (స్విట్జర్లాండ్), డిడియర్ క్యులోజ్ (స్విట్జర్లాండ్).
- **సాహిత్యం:** వోల్గా టొకార్చుక్ (2018, పోలండ్ నవలా రచయిత్రి), పీటర్ హాన్‌డ్కే (2019, ఆస్ట్రియా రచయిత).
- **శాంతి:** ఇథియోపియా ప్రధాన మంత్రి అబీ అహ్మద్ అలీ.
- **వైద్యం:** జీ కెలీన్ జూనియర్ (హార్వర్డ్ యూనివర్సిటీ, అమెరికా), డాక్టర్ గ్రెగ్ ఎల్ సెమెన్జా (హాప్కిన్స్ యూనివర్సిటీ, అమెరికా), డాక్టర్ పీటర్ జే రాట్‌క్లిఫ్ (ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్, బ్రిటన్).
- **ఆర్థిక శాస్త్రం:** ప్రవాస భారతీయుడు అభిజిత్ బెనర్జీతోపాటు ఆయన భార్య ఎస్తర్ డఫ్లో, మరో అమెరికన్ ఆర్థికవేత్త మైకేల్ క్రెమెర్.

## రైట్ లైవ్లీహుడ్ అవార్డు

పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌కు రైట్ లైవ్‌లీహుడ్ అవార్డు లభించింది. థన్‌బర్గ్‌తోపాటు అమీనాటౌ హౌదర్ (మొరాకో), గువో జియాన్మీ (చైనా), డేవి కోపెనావా (బ్రెజిల్) కూడా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

## సచిన్‌కు స్వచ్ఛతా రాయబారి అవార్డు



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు 'అత్యంత ప్రభావశీల స్వచ్ఛతా రాయబారి' అవార్డు లభించింది. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా అక్టోబరు 2న న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## అక్కితమ్‌కు జ్ఞానపీఠ్ అవార్డు

ప్రముఖ మలయాళీ కవి అక్కితమ్‌కు 2019 సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని నవంబరు 29న ప్రకటించారు. ఆయన పూర్తి పేరు అక్కితమ్ అచ్యుతన్ నంబూద్రి. ఆయన్ను కేంద్రం 2017లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

## ఇన్ఫోసిస్ సైన్స్ ప్రైజ్-2019



ఇన్ఫోసిస్ సైన్స్ ప్రైజ్ - 2019 విజేతలను నవంబరు 7న బెంగళూరులో ప్రకటించారు. వారి వివరాలు.. ప్రొఫెసర్ సునీతా సరవాగి (ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్, ఐఐటీ బాంబే), మంజులా రెడ్డి (లైఫ్ సైన్సెస్, సీసీఎంబీ హైదరాబాద్), ప్రొఫెసర్ ముగేశ్ (భౌతిక శాస్త్రం, ఐఐఎస్‌సీ బెంగళూరు), ప్రొఫెసర్ సిద్ధార్థ మిశ్రా (గణితం, ఈటీహెచ్ జ్యూరిచ్ వర్సిటీ, స్విట్జర్లాండ్), ప్రొఫెసర్ మను వి.దేవదేవన్ (హ్యూమానిటీస్, ఐఐటీ మండి), ప్రొఫెసర్ ఆనంద్ పాండ్యన్ (సోషల్ సైన్సెస్, జాన్ హాప్కిన్స్ వర్సిటీ, అమెరికా).

## రామన్ మెగసెసె అవార్డులు-2019



రామన్ మెగసెసె - 2019 అవార్డులను ఆగస్టు 2న మనీలాలో ప్రకటించారు. విజేతలు.. **రవీశ్ కుమార్ (భారత్)**, వారుకో స్వే విన్ (మయన్మార్), అంగ్‌ఖానా నీలపాయిజిత్ (థాయిలాండ్), రెముండో పుజాంతే (ఫిలిప్పీన్స్), కిమ్ జోంగ్ కి (దక్షిణాఫ్రికా).

# వార్తల్లో వ్యక్తులు

## తొలి లోక్‌పాల్‌గా జస్టిస్ పీసీ ఘోష్



భారత తొలి లోక్‌పాల్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ మార్చి 23న ప్రమాణస్వీకారం చేశారు.

## ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా గీతా

ఇండో-అమెరికన్ ఆర్థికవేత్త గీతా గోపినాథ్.. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రధాన ఆర్థికవేత్తగా జనవరి 1న బాధ్యతలు చేపట్టారు. తద్వారా ఐఎంఎఫ్‌లో చీఫ్ ఎకనామిస్ట్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా గీతా గోపినాథ్ గుర్తింపు పొందారు.

## 'రా' చీఫ్‌గా సామంత్ గోయెల్

'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) చీఫ్‌గా సామంత్ గోయెల్, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్‌గా అరవింద్ కుమార్ నియమితులయ్యారు.

## ఈసీబీ అధ్యక్షురాలిగా క్రిస్టిన్ లగార్డే

యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షురాలిగా అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టిన్ లగార్డే ఎంపికయ్యారు.

## మహిళా ఫ్లయిట్ కమాండర్‌గా ధామీ

వింగ్ కమాండర్ షలీజా ధామీ భారత వాయుసేనలో ఫ్లయింగ్ యూనిట్ ఫ్లయిట్ కమాండర్ హోదా సంపాదించారు. దీంతో ఈ బాధ్యతలు స్వీకరించనున్న తొలి మహిళా కమాండర్‌గా ధామీ నిలవనున్నారు.

## సీఐసీగా సుధీర్ భార్గవ

కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా సుధీర్ భార్గవ జనవరి 1న ప్రమాణస్వీకారం చేశారు.



## మొదటి అంధ మహిళా ఐఏఎస్

దేశంలోనే మొట్టమొదటి అంధ మహిళా ఐఏఎస్‌గా ప్రంజల్ పాటిల్ నియమితులయ్యారు. కేరళలోని తిరువనంతపురం సబ్‌కలెక్టర్‌గా, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా అక్టోబరు 14న ఆమె బాధ్యతలు స్వీకరించారు.

## మిస్ వరల్డ్ 2019గా టోనీ-ఆన్ సింగ్

జమైకాకు చెందిన టోనీ-ఆన్ సింగ్ మిస్ వరల్డ్ - 2019 కిరీటం దక్కించుకున్నారు. జమైకా నుంచి మిస్ వరల్డ్ గెలుచుకున్న నాలుగో మహిళ టోనీ-ఆన్. లండన్‌లోని ఎక్సెల్ లండన్ కన్వెన్షన్ సెంటర్‌లో డిసెంబరు 14న జరిగిన మిస్ వరల్డ్ - 2019 పోటీల్లో మొదటి రన్నరప్‌గా ఒఫ్లి మెజినో (ఫ్రాన్స్), రెండో రన్నరప్‌గా సుమన్ రావ్ (భారత్) నిలిచారు.

## మిస్ యూనివర్స్ -2019 జోజిబినీ

అమెరికాలోని అట్లాంటాలో డిసెంబరు 8న జరిగిన 68వ మిస్ యూనివర్స్ పోటీల్లో దక్షిణాఫ్రికాకు చెందిన జోజిబినీ టున్జీ మిస్ యూనివర్స్ - 2019 కిరీటాన్ని దక్కించుకున్నారు.

## తొలి మహిళా యుద్ధ పైలట్ భావన



యుద్ధ విమానంలో పోరాట ఆపరేషన్లు చేపట్టేందుకు అర్హత సాధించిన తొలి మహిళగా ఫ్లయిట్ లెఫ్టినెంట్ భావన కాంత్ చరిత్ర సృష్టించారు.

## మహిళల స్పేస్ వాక్

అమెరికాకి చెందిన మహిళా వ్యోమగాములు క్రిస్టీనా కోచ్, జెస్సికా మియెర్‌లు చేపట్టిన స్పేస్ వాక్ అక్టోబరు 18న విజయవంతమైంది. పురుషులతో కలసి కాకుండా మహిళా వ్యోమగాములు మాత్రమే స్పేస్ వాక్ చేసిన తొలి సందర్భం ఇదే.

## మహిళా సైనిక దౌత్యవేత్తగా అంజలి

భారత సైన్యం తరపున విదేశాలతో సంబంధాలు నెలకొల్పడంలో కీలకపాత్ర పోషించే దౌత్యవేత్త స్థానంలో తొలిసారి మహిళా అధికారిని నియమించారు. ఆమె పేరు అంజలి.

## ఐఏఎఫ్ నూతన చీఫ్ రాకేశ్

భారత వైమానిక దళం నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ రాకేశ్ భదౌరియాను నియమించినట్లు సెప్టెంబరు 19న కేంద్రం వెల్లడించింది.

## టైమ్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ గ్రెటా

పర్యావరణ పరిరక్షణ కోసం గళమెత్తి ప్రపంచ దేశాలను కదిలించిన స్వీడన్‌కు చెందిన 16 ఏళ్ల గ్రెటా థున్‌బర్గ్ ఈ ఏడాదికి టైమ్ మేగజీన్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ - 2019గా ఎంపికయ్యారు. దీంతో ఈ ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా గ్రెటా నిలిచారు.

## జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ముర్ము

జమ్మూకశ్మీరు యూటీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కేంద్ర వ్యయవిభాగ కార్యదర్శి గిరీశ్ చంద్ర ముర్ము, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రక్షణ శాఖ మాజీ కార్యదర్శి రాధాకృష్ణ మాథుర్ అక్టోబరు 25న నియమితులయ్యారు.



## సీజేఐగా జస్టిస్ బాబ్డే

సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శరద్ అర్వింద్ బాబ్డే నవంబరు 18న ప్రమాణస్వీకారం చేశారు.

## నౌకాదళ అధిపతి కరంబీర్

భారత నౌకాదళ 24వ అధిపతిగా అడ్మిరల్ కరంబీర్ సింగ్ మే 31న బాధ్యతలు చేపట్టారు.

## సిస్టర్ థ్రెసియాకు సెయింట్‌హుడ్

భారత్‌కు చెందిన సిస్టర్ మరియం థ్రెసియా చిరమెల్ మంకిడియాన్‌కు 'పునీత హోదా' (సెయింట్‌హుడ్)ను పోప్ ఫ్రాన్సిస్ అక్టోబరు 13న ప్రకటించారు.

## ఆర్మీ చీఫ్‌గా జనరల్ మనోజ్



భారత తదుపరి సైన్యాధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణె నియమితులు కానున్నారు. ఆయన ప్రస్తుతం వైస్ చీఫ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## అత్యంత శక్తిమంతమైన మహిళలు

ఫోర్బ్స్ మ్యాగజైన్ 'ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళలు - 2019' జాబితాలో జర్మనీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ వరుసగా తొమ్మిదో ఏడాది అగ్రస్థానంలో నిలిచారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 34వ స్థానంలో ఉన్నారు.

## విదేశీ వ్యవహారాల కార్యదర్శిగా ష్రింగ్లా

విదేశీ వ్యవహారాల కార్యదర్శిగా 1984 ఐఎఫ్ఎస్ బ్యాచ్ అధికారి హర్ష్‌వర్ధన్ ష్రింగ్లా డిసెంబరు 23న నియమితులయ్యారు.

## ఎన్ఎస్ఏగా అజిత్ దోభాల్

జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ)గా అజిత్ దోభాల్ మే 31న రెండోసారి నియమితులయ్యారు.

మరికొన్ని అంశాలు స్టడీ పేజీలో...

విశేషం



## ఈ పిల్లలు ప్లాస్టిక్ చెత్తను ఏరేశారు

చిప్స్ ఇష్టంగా తింటాం... చిప్స్ ప్యాకెట్‌ను రోడ్డుపై పడేస్తాం. కానీ ఆ ప్యాకెట్ల వల్ల పర్యావరణానికి ఎంత నష్టం జరుగుతుందో ఆలోచించం. గుర్‌గావ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు మాత్రం అందరిలా మాకెందుకులే అని వదిలేయలేదు. నాలుగు నెలలు కష్టపడి 14 వేల చిప్స్ ప్యాకెట్స్, చాక్లెట్ కవర్లను సేకరించారు. స్కూల్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆ విద్యార్థులు ఈ పని చేపట్టారు. వీరు గుర్‌గావ్‌లోని హెరిటేజ్ ఎక్స్‌పీరియెంటల్ లెర్నింగ్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నారు. స్కూల్ ప్రాజెక్టులో 'జియోగ్రఫీ దట్ షేప్స్ అజ్' సబ్జెక్ట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులు సేకరించిన ప్లాస్టిక్ కవర్లను సిమెంట్ ఫ్యాక్టరీ ఫర్నేస్‌లో మండిస్తారు. ప్యాకేజ్డ్ ఆహారపదార్థాలను విక్రయించే సంస్థలు ఉపయోగించే ప్యాకెట్లు రీసైక్లింగ్‌కు పనికిరావు. వీటివల్ల పర్యావరణానికి జరుగుతున్న హాని అంతాఇంతా కాదు. అందుకే ఈ నలుగురు తమ వంతు బాధ్యతగా స్కూల్ ప్రాజెక్టులో భాగంగా రోడ్డు మీద, వీధుల్లో పడిఉన్న ప్లాస్టిక్ కవర్లను సేకరించారు. ప్లాస్టిక్ కవర్ల కోసం కలెక్షన్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు.అంతేకాదు ప్లాస్టిక్ కాలుష్యం మీద అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పోస్టర్లు అంటించారు. ప్రెజెంటేషన్లతో ఆకట్టుకున్నారు. ఈ పిల్లల పని చూసిన వారంతా శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

## 3 తేడాలు గుర్తించండి?



## సరైన నీడను గుర్తించండి?



## బొమ్మ గీయండి!



## జత ఉన్న బొమ్మ ఏది?



## డైలీ సుడోకు - 238

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 1 | 4 | | | | 9 |
| | | | | 6 | | 8 | | 1 |
| | 5 | | | 8 | | | 4 | 3 |
| | | | | | 2 | | 3 | |
| 2 | | 3 | | | | 7 | | 8 |
| | 9 | | 8 | | | | | |
| 6 | 1 | | | 5 | | | 9 | |
| 9 | | 7 | | 2 | | | | |
| 5 | | | | 1 | 7 | | | |

### సుడోకు- 237 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 7 | 9 | 2 | 5 | 4 | 8 | 3 | 1 |
| 3 | 1 | 2 | 8 | 7 | 9 | 4 | 6 | 5 |
| 4 | 5 | 8 | 1 | 3 | 6 | 7 | 9 | 2 |
| 7 | 3 | 1 | 6 | 9 | 5 | 2 | 8 | 4 |
| 2 | 6 | 5 | 7 | 4 | 8 | 9 | 1 | 3 |
| 9 | 8 | 4 | 3 | 2 | 1 | 5 | 7 | 6 |
| 5 | 9 | 6 | 4 | 8 | 3 | 1 | 2 | 7 |
| 8 | 2 | 3 | 5 | 1 | 7 | 6 | 4 | 9 |
| 1 | 4 | 7 | 9 | 6 | 2 | 3 | 5 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



# నేను పూర్తి చేయాల్సిన పని చాలా ఉంది

- అమితాబ్



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అమితాబ్ బచ్చన్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరించారు. ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 77 ఏళ్ల అమితాబ్ ఈ అవార్డ్ అందుకొన్నారు. ఈ కార్యక్రమానికి జయా బచ్చన్, అభిషేక్ బచ్చన్ కూడా హాజరయ్యారు. వాస్తవానికి గత వారం జరిగిన చలనచిత్ర జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో అమితాబ్ పాల్గొనాల్సి ఉంది. కానీ అనారోగ్యం కారణంగా ఆయన హాజరు కాలేక పోయారు. అవార్డుల విజేతలకు ఆదివారం రాష్ట్రపతిభవన్‌లో తేనీటి విందు ఏర్పాటు చేయడంతో ఈ సందర్భంగా అమితాబ్‌కు ఫాల్కే అవార్డ్ అందజేశారు. 'ఫాల్కే అవార్డ్ నాకు ప్రకటించారనే వార్త తెలియగానే నాకో సందేహం కలిగింది. 'ఇక నటన చాలించి ఇంటిపట్టున కూర్చుని రెస్ట్ తీసుకో ' అనే సంకేతాన్ని ఈ అవార్డ్ ఇస్తోందా? అనిపించింది. అయితే ఇంకా నేను పూర్తి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. కొన్ని బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. అందుకే ఈ విషయమై నాకు వివరణ కావాలి' అని అవార్డ్ స్వీకరించిన అనంతరం ట్వీట్ చేశారు అమితాబ్. 'తల్లితండ్రుల ఆశీస్సులు, భగవంతుని దీవెనలు, దర్శకనిర్మాతల ప్రోత్సాహం... అన్నింటికంటే మించి ప్రేక్షకుల అండదండల వల్లే నేనీ స్థాయికి చేరుకోగలిగాను. ఫాల్కే అవార్డ్ ప్రవేశపెట్టి యాభై సంవత్సరాలు పూర్తయ్యాయి. అలాగే నేను పరిశ్రమలోకి ప్రవేశించి కూడా యాభై ఏళ్లు అయింది. అందుకే ఇటువంటి నేపథ్యంలో దాదాసాహెబ్ ఫాల్కే వంటి అత్యున్నత పురస్కారాన్ని స్వీకరించడం చాలా ఆనందంగా ఫీలవుతున్నాను.' అని అమితాబ్ పేర్కొన్నారు.

# అల.. మ్యూజిక్ ఫెస్టివల్

అల్లు అర్జున్, పూజా హెగ్డే జంటగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అల వైకుంఠపురంలో'. హారిక - హాసిని క్రియేషన్స్, గీతాఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మాతలు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం మ్యూజికల్ ఫెస్టివల్‌ను జనవరి 6న హైదరాబాద్, యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నారు. ఈలోపే బన్నీ అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఈ నెల 31న 'సామజవరగమన' పాట ప్రోమోను విడుదల చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "బన్నీ, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే తమన్ సంగీతంలో విడుదలైన పాటలన్నీ సంగీత ప్రియులను ఏ స్థాయిలో అలరించాయో అందరికీ తెలిసిందే! సినిమా అంతకుమించి అలరిస్తుంది" అని అన్నారు. టబు, రాజేంద్రప్రసాద్, సచిన్ ఖేడ్ కర్, తనికెళ్ల భరణి, మురళీ శర్మ, సముద్ర ఖని, జయరాం, సునీల్, నవదీప్, సుశాంత్, నివేతా పేతురాజ్, రోహిణి, ఈశ్వరీ రావు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: పి.ఎస్.వినోద్, సంగీతం: తమన్, ఎడిటర్: నవీన్ నూలి: ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్.



పూజా హెగ్డే, అల్లు అర్జున్

# అయితే ఏంటి?

- తమన్నా

మిల్కీబ్యూటీ తమన్నా లౌక్యం తెలిసిన అమ్మాయి. సినీ పరిశ్రమలో ఎక్కడ ఎలా నడుచుకోవాలో.. ఎవరితో ఎలా మెలగాలో ఆమెకు బాగా తెలుసు. ఏ సమస్యనైనా చాలా సున్నితంగా పరిష్కరించే టాలెంట్ ఆమెలో ఉంది. వృత్తిరీత్యా ఎంత గ్లామరస్‌గా కనిపించినా హద్దులు మాత్రం దాటరు. బికినీలో నటించనని తమన్నా ఓసారి చెప్పారు. ఇటీవల విడుదలైన తమిళ సినిమాలో బికినీలో కనిపించడంతో 'తమన్నా మాట తప్పింది' అంటూ నెటిజన్లు కామెంట్లు చేశారు. ఎప్పుడూ ప్రశాంతంగా మాట్లాడే తమన్నా ఈసారి కాస్త ఘాటుగానే స్పందించారు. "సినిమాల్లో మనం అనుకున్నవన్నీ జరగవు. కొన్ని సందర్భాల్లో కథ, పాత్రకు తగ్గట్టు మౌల్డ్ కావాల్సి ఉంటుంది. అలాంటి కారణంతోనే బికినీలో కనిపించా. అయితే ఏంటి? నేనేమీ అందాలు ఆరబోయాలని అలా కనిపించలేదు" అన్నారు. ప్రస్తుతం తమన్నా 'సరిలేరు నీకెవరూ' చిత్రంలో 'డాంగ్ డాంగ్' అంటూ సాగే పాటకు మహేశ్‌తో కలిసి స్టెప్పులేశారు. ఇటీవల ఆ పాట ప్రోమోను విడుదల చేశారు.





# ఆ సినిమాకు సీక్వెల్ అనుకోవచ్చు

- రామ్‌గోపాల్ వర్మ



నైనా, వర్మ, సూరి

"నేను రొమాంటిక్ ప్రేమ కథా చిత్రాలు తీసి యుగాలై పోయింది. కిందటి జన్మలో 'రంగీలా' తీశా. 'బ్యూటిఫుల్' ఆ సినిమాకు సీక్వెల్‌గా ఉండొచ్చు" అని రామ్ గోపాల్ వర్మ అన్నారు. ఆయన నిర్మాణ సారథ్యంలో సూరి, నైనా గంగూలీ జంటగా అగస్త్య మంజు దర్శకత్వం వహించిన చిత్రం 'బ్యూటిఫుల్'. ట్రిబ్యూట్ టు రంగీలా అన్నది ఉపశీర్షిక. టి. నరేశ్‌కుమార్, టి.శ్రీధర్ నిర్మాతలు. నట్టి కరుణ, క్రాంతి సహనిర్మాతలు. జనవరి 1న ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "సాధారణంగా మగవాళ్ళు ఎదిగితే ఆడవాళ్లు వెనకుంటారు. ఈ చిత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. హీరోయిన్ ఎదుగుతుంటే హీరో వెనకుంటాడు. అయితే హీరోయిన్ సక్సెస్‌ను హీరో తట్టుకోగలడా లేదా? అన్నది ఈ సినిమా ఇతివృత్తం. రొమాంటిక్ సన్నివేశాలతోపాటు భావోద్వేగానికి గురిచేసే సన్నివేశాలూ ఉంటాయి. ఈ పాత్ర కోసమే నైనా పుట్టిందా...అనిపించేలా దర్శకుడు తీర్చిదిద్దారు" అని అన్నారు. "ఇందులో ఛాలెంజింగ్ రోల్ దక్కింది. హీరోకూ, నాకూ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. తెలుగులో మంచి గుర్తింపు పొందే సినిమా అవుతుంది" అని నైనా గంగూలీ అన్నారు. అందరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది. ఈ సినిమా చూసి వర్మ కూడ ఏడ్చారు" అని సూరి అన్నారు.

# రేసీ స్ర్కీన్‌ప్లేతో...



జి.తాతారెడ్డి

ధనుష్ హీరోగా గౌతమ్‌వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన 'ఎన్నై నోకి పాయుమ్ తోట' సినిమా తెలుగులో 'తూటా'గా అనువాదమవుతోంది. మేఘా ఆకాశ్ కథానాయిక. జి.తాతారెడ్డి, జి సత్యానారాయణరెడ్డి నిర్మాతలు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం జనవరి 1న ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా నిర్మాత విలేకర్లతో మాట్లాడుతూ "ప్రేమకథలకు కేరాఫ్ అయిన గౌతమ్‌మీనన్ నుంచి వస్తున్న పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. 70 శాతం యాక్షన్ సన్నివేశాలతో సినిమా ఉంటుంది. తెలుగు నేటివిటీకి తగ్గటుగా కొన్ని మార్పులు చేసి మాతృక నిడివి తగ్గించాం. స్ర్కీన్‌ప్లే రేసీగా ఉంటుంది. త్వరలో స్ట్రెయిట్ సినిమా తీస్తా. మంచి కథల కోసం ఎదురుచూస్తున్నా" అని చెప్పారు.





# హాలీవుడ్‌లో తెలుగు దర్శకుడి సత్తా!



జగదీశ్ దానేటి

సినిమాను ప్రేమించే ప్రతి సినీ శ్రామికుడికీ హాలీవుడ్‌లో అడుగుపెట్టాలన్నది ఓ కల. చాలా మంది విషయంలో ఇది కలగానే మిగిలిపోతోంది. అయితే తెలుగువాడైన జగదీశ్ దానేటి మాత్రం తన కలను నిజం చేసుకోబోతున్నారు. రచయిత, దర్శకుడైన జగదీశ్ 'మార్టిన్ ఫిల్మ్స్' వంటి హాలీవుడ్ నిర్మాణ సంస్థలతో కలసి నిర్మాణంలోకి దిగుతున్నారు. తెలుగు చిత్రపరిశ్రమలో రచయితగా, దర్శకునిగా అనుభవం గడించిన జగదీశ్ అంతర్జాతీయ చిత్రాలకు 'క్రియేటివ్ కన్సల్టెంట్'గా పనిచేశారు. 'ది హ్యాంగ్‌మ్యాన్', ' వెంజెన్స్ ఎ లవ్‌స్టోరీ', 'ఐ యామ్ ప్రాత్' వంటి చిత్రాలు నిర్మించిన హాలీవుడ్ దిగ్గజం జానీ మార్టిన్ ఈ తెలుగు దర్శకుడికి స్వాగతం పలుకుతూ , జగదీశ్‌తో కలసి హాలీవుడ్ చిత్రాలు నిర్మించనున్నట్లు ఇటీవల లాస్‌ఏంజిల్స్‌లో ప్రకటించారు. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఈ చిత్రాలు సెట్స్ పైకి వెళ్లనున్నాయి. పలు రకాల ప్రాజెక్టులు ఖారారయ్యాయనీ, హాలీవుడ్ స్టార్స్, కొంతమంది భారతీయ నటులు ఆ చిత్రాల్లో నటిస్తారనీ జగదీశ్ చెప్పారు.

# శ్రీసింహా మాటిచ్చాడు

- కీరవాణి



కాలభైరవ, కీరవాణి, శ్రీసింహా

"ఉమ్మడి కుటుంబ బాధ్యతలు భుజాన ఉండి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ఇంట్లో సింగపూర్ వెళ్లాలనే ప్రతిపాదన వచ్చింది. అప్పట్లో అంత స్తోమత లేకపోవడంతో కుదరదని చెప్పాను. అయితే 'నేను తీసుకెళతా' అని నాలుగేళ్లున్న శ్రీసింహ అన్నాడు. ఆ మాటను తన మొదటి పారితోషికంతో శ్రీసింహా నెరవేర్చుతాడనే నమ్మకముంది" అని కీరవాణి అన్నారు. ఆయన తనయుడు శ్రీసింహా హీరోగా మరో తనయుడు కాల భైరవ సంగీత దర్శకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రితేశ్ రానా దర్శకత్వం వహించిన చిత్రం 'మత్తు వదలరా'. సినిమా సక్సెస్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎవల్యూషన్ మీట్‌లో నిర్మాతలు మాట్లాడుతూ "సినిమా విడుదలకు ముందు ప్రమోషన్ వైవిధ్యంగా చేశాం. ఆ వైవిధ్యతే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది" అని అన్నారు. "ప్రస్తుతం ఈ తరహా కథలకే మంచి పేరు, ఆదరణ ఉంటుంది. కాన్సెప్ట్ ఓరియెంటెండ్ సినిమాలతో కెరీర్‌లో ఒక్కో మెట్టు ఎదిగినప్పుడే సంతృప్తి ఉంటుంది" అని శ్రీసింహా అన్నారు. "ఇప్పుడున్న పరిస్థితుల్లో సినిమా అవకాశం రావడమే గొప్ప. కథా బలమున్న సినిమా కావడంతో అందరికీ మంచి గుర్తింపు వచ్చింది"అని కాలభైరవ చెప్పారు.

# విలన్‌గా సునీల్



హాస్యనటుడిగా, కథానాయకుడిగా అలరించారు సునీల్. తాజాగా ఆయన నటిస్తున్న కొత్త సినిమా వివరాలను చిత్ర బృందం ప్రకటించింది. అమృత ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'కలర్ ఫోటో' చిత్రంలో సునీల్ విలన్‌గా కనిపించనున్నారు. 'మజిలీ', 'డియర్ కామ్రేడ్', 'ప్రతిరోజూ పండగే' వంటి చిత్రాల్లో తనదైన కామెడీతో ఆకట్టుకున్న సుహాస్ ఈ చిత్రంతో హీరోగా, యూట్యూబ్‌లో పాపులర్ అయిన సందీప్ రాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. చాందిని చౌదరి కథానాయిక. సాయి రాజేశ్ నీలం, బెన్నీ ముప్పానేని నిర్మాతలు. "1995లో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే ప్రేమకథ ఇది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. మరిన్ని విశేషాలు త్వరలో తెలియజేస్తాం" అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సమర్పణ: శ్రవణ్ కొంక.





# నమ్మితే ప్రాణమిస్తాడు!



మమ్ముట్టి

మమ్ముట్టి కథానాయకుడిగా రూపొందిన 'మధుర రాజా' చిత్రం తెలుగులో 'రాజా నరసింహా'గా విడుదల కానుంది. 'మన్యం పులి' ఫేం వైశాక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జై, మహిమా నంబియార్ కీలక పాత్రధారులు. జగపతిబాబు ప్రతినాయకుడిగా కనిపిస్తారు. జై చెన్నకేశవ పిక్చర్స్ పతాకంపై సాధు శేఖర్ జనవరి 1న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "నమ్మితే ప్రాణమిచ్చే వ్యక్తి రాజా. ఓ అటవీ ప్రాంతంలో అమాయక ప్రజల్ని మోసం చేసిన ఓ వ్యక్తికి రాజా ఎలా బుద్ధి చెప్పాడు అన్నది సినిమా ఇతివృత్తం. యాక్షన్‌తోపాటు చక్కని సందేశం ఉంది. సన్నీలియోన్ ప్రత్యేక గీతం సినిమాకు అదనపు ఆకర్షణ" అని తెలిపారు.

## ఇక ఎయిర్‌టెల్ కనీస రీచార్జ్ రూ.45

న్యూఢిల్లీ: టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ కస్టమర్లపై మరింత భారాన్ని మోపింది. ఇప్పటిదాకా కనీస రీచార్జ్ మొత్తం రూ.23 ఉండగా.. దీన్ని రూ.45కు పెంచుతున్నట్టు ఆదివారంనాడు ప్రకటించింది. ఇదే రోజు నుంచి దీన్ని అమల్లోకి తెచ్చింది. 28 రోజుల పాటు ఎయిర్‌టెల్ సర్వీసులను పొందాలంటే ఇక రూ.45తో రీచార్జ్ చేసుకోవాల్సిందే. టారిఫ్ కాలపరిమితి ముగిసిన అనంతరం మరో 15 రోజుల గ్రేస్ పీరియడ్ తర్వాత రీచార్జ్ చేయకపోతే సర్వీసులను నిలిపివేయనున్నట్టు కంపెనీ తెలిపింది.

# కొత్త ఏడాదిపై కోటి ఆశలు

### అమ్మకాలు పుంజుకుంటాయంటున్న పరిశ్రమవర్గాలు

## ఆటో ఎక్స్‌పోతో కొత్త ఉత్తేజం

వాహనాల అమ్మకాల్లో తీవ్ర మందగమనాన్ని చవిచూసిన దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ కొత్త ఏడాదిపై కోటి ఆశలు పెట్టుకుంటోంది. ఈ ఏడాదిలోనైనా పరిస్థితి మెరుగుపడి పూర్వవైభవం వస్తుందని ఆశిస్తోంది. కొత్త మోడళ్లతోపాటు అప్‌గ్రేడ్ చేసిన మోడళ్ల ద్వారా అమ్మకాలు పుంజుకుంటాయన్న ఆశాభావం కంపెనీల్లో వ్యక్తం అవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో మందగమనం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. దీని ప్రభావం వాహనాల అమ్మకాలపై పడుతోంది. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మందగమనం నుంచి ఆర్థిక వ్యవస్థ బయటపడుతుందని, కొనుగోలుదారులతో తమ షోరూమ్‌లు మళ్లీ కిటకిటలాడే రోజులు వస్తాయని కంపెనీలు భావిస్తున్నాయి. ఇక కొత్త ఏడాదిలో బీఎస్-4 వాహనాలకు కాలం చెల్లిపోనుంది. ఏప్రిల్ నుంచి బీఎస్-6 వాహనాల రిజిస్ట్రేషన్ మాత్రమే జరగనుంది. బీఎస్-6తో పాటు నూతన భద్రతా నిబంధనలను అమలు చేయడం వల్ల వాహనాల ధరలు పెరగనున్నాయి. ఫలితంగా కంపెనీలకు కొత్త సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందన్న అంచనాలు కూడా వెలువడుతున్నాయి.

### ఉత్పత్తి, ఉద్యోగాల్లో కోత

ఈ ఏడాదిలో ఆకర్షణీయమైన ఆఫర్లు, డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లు ఇచ్చినప్పటికీ కంపెనీలు ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగలేదు. టూవీలర్ల నుంచి కార్లు, హెవీ డ్యూటీ ట్రక్‌ల ద్వారా అన్నింటి అమ్మకాల్లోనూ క్షీణతే నమోదయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ 13-17 శాతం క్షీణతను నమోదు చేసుకోవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. అమ్మకాలు క్షీణించిన ఫలితాలు చాలా కంపెనీలు తమ ఉత్పత్తిని తగ్గించుకున్నాయి. కొన్ని కంపెనీలు ఉద్యోగులను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేక డీలర్‌షిప్‌లు మూతపడినాయి. విడిభాగాల పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. ఆటో రంగంలో మందగమనం కారణంగా దాదాపు 3.5 లక్షల మంది ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిణామాలు ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో మంచి రోజులు వస్తాయని ఆటో పరిశ్రమ సంఘం సియామ్ ఆశిస్తోంది.



"2020లో బీఎస్-6 నిబంధనలు అమలుకానున్నాయి. ఈ ఏడాది ఆసక్తికరంగా ఉంటుంది. మార్కెట్లో మొత్తం కొత్త ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రానున్నాయి" సియామ్ ప్రెసిడెంట్ రాజన్ వధేరా అంటున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందన్న అంచనాలు వెలువడుతున్నాయన్నారు. కొత్త మోడళ్ల ద్వారా పరిశ్రమలో వృద్ధి నెలకొంటుందని భావిస్తున్నామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి పునరుజ్జీవం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అయితే ఇది మూడో త్రైమాసికంలో కనిపించే అవకాశం ఉందన్నారు. ఇక బీఎస్-6తో కూడిన వాహనాల్లో కొత్త టెక్నాలజీ ఉండటం వల్ల ధర 8-10 శాతం పెరగొచ్చని, దీని వల్ల అమ్మకాలు ప్రభావం కావచ్చన్న ఆందోళన వ్యక్తం అవుతోందని చెప్పారు.

### ఆటో ఎక్స్‌పో

కొత్త ఏడాదిలో ఆటో ఎక్స్‌పో జరగనుంది. ఇది ఆటో పరిశ్రమ పునరుజ్జీవానికి లాంచింగ్ ప్యాడ్‌గా ఉపయోగపడుతుందంటున్నారు. ఈసారి ఆటో ఎక్స్‌పోలో పర్యావరణ అనుకూల వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయంటున్నారు. ఎలక్ట్రిక్, హైబ్రిడ్, కనెక్టెడ్ వాహనాలు ప్రదర్శనకు రానున్నాయని చెబుతున్నారు. టాటా మోటార్స్ తన నెక్సాన్ ఈవీ, ఎంజీ మోటార్ తన జడ్ఎస్ ఈవీలు త్వరలోనే రోడ్లపైకి రానున్నాయి. ఇప్పటికే హ్యుండయ్ కోనా మార్కెట్లోకి వచ్చేసింది. ఈసారి ఎక్స్‌పోలో 60 కొత్త వాహనాల విడుదల, ఆవిష్కరణ ఉంటుందని సమాచారం. చైనాకు చెందిన గ్రేట్ వాల్ మోటార్ కంపెనీ, ఫస్ట్ ఆటోమోటివ్ వర్క్స్ (ఎఫ్ఏడబ్ల్యూ) భారత మార్కెట్లోకి ప్రవేశించనున్నాయి. ఈసారి మారుతీ సుజుకీ, హ్యుండయ్, ఎం అండ్ ఎం, టాటా మోటార్స్, కియాలతోపాటు స్కోడా, ఫోక్స్‌వ్యాగన్ బ్రాండ్లు ఎక్స్‌పోలో సందడి చేయనున్నాయి. గత ఐదు త్రైమాసికాల్లో ఆటో అమ్మకాలు నిరాశాజనకంగా ఉండటం వల్ల కొన్ని కంపెనీలు ప్రదర్శనలో పాల్గొనడానికి ముందుకు రావడం లేదు. హోండా, టయోటా, ఫోర్డ్, బీఎండబ్ల్యూ, ఆడి, లెక్సస్, వోల్వో, జాగ్వార్ లాండ్ రోవర్‌తోపాటు టూవీలర్ల కంపెనీలైన హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, టీవీఎస్‌లు పాల్గొనకపోవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ ఏడాదిలో కియా మోటార్స్, ఎంజీ మోటార్ కంపెనీలు తమ కార్లను మార్కెట్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. వీటికి ఇప్పటికే కస్టమర్ల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.



# బుల్స్ జైత్రయాత్ర

**రివ్యూ 2019**

## జీవితకాల గరిష్ఠ స్థాయిలో సూచీలు

*దేశ ఆర్థిక వ్యవస్థ ఆపసోపాలు పడుతోంది. వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. డిమాండ్ క్షీణించి కంపెనీలు అల్లాడుతున్నాయి. స్టాక్ మార్కెట్‌పై మాత్రం ఈ ప్రభావం అంతగా కనిపించడం లేదు. రెండు ప్రధాన సూచీలూ రేసు గుర్రాల్లా పరిగెడుతున్నాయి. సెన్సెక్స్ 40,000 పాయింట్లు, నిఫ్టీ 12,000 పాయింట్లు అధిగమించి జీవిత కాల గరిష్ఠ స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. అయితే ఈ పెరుగుదలంతా సెన్సెక్స్, నిఫ్టీల్లోని కొన్ని కంపెనీల షేర్ల చలవే. మార్కెట్ డేటా ప్రకారం చూస్తే.. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీ ఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి 10-15 పెద్ద కంపెనీల షేర్లు మాత్రమే ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీలను పరిగెత్తిస్తున్నాయి.*

ఈ ఏడాది సెన్సెక్స్ 36,254.57 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. మార్చి వరకు స్థిరంగానే కొనసాగింది. అప్పటికే అధికారం మళ్లీ మోదీ సర్కార్‌దే అనే సంకేతాలు అందాయి. దాంతో లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు ముందు ఏప్రిల్ 2న సెన్సెక్స్ తొలిసారిగా 39,000 స్థాయిని దాటింది. మే 23న ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే లాభాల స్వీకరణ అమ్మకాలతో సెన్సెక్స్ కొంత నీరసించింది. జూన్ నుంచి మార్కెట్లో మళ్లీ బుల్స్ జోరు పెరిగింది. దీంతో జూన్ 3న సెన్సెక్స్ 40,000 పాయింట్లు, నిఫ్టీ 12,000 పాయింట్లను దాటిపోయాయి.

### బడ్జెట్‌తో వెనక్కి

జూలై 5న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్, మార్కెట్‌ను తీవ్రంగా నిరాశపరిచింది. ఎఫ్‌పీఐలతో పాటు సంపన్నులపై విధించిన సర్‌చార్జీ, లిస్టెడ్ కంపెనీల ఈక్విటీలో ఫ్లోటింగ్‌లో ఉండాల్సిన షేర్లను మరింత పెంచాలన్న ప్రతిపాదన, మార్కెట్‌కు ఏ మాత్రం రుచించలేదు. దీంతో భారీ స్థాయిలో అమ్మకాలకు దిగడంతో బడ్జెట్ రోజే సెన్సెక్స్ 400 పాయింట్లు నష్టపోయింది. జూలై 8న మరో 793 పాయింట్లు నష్టపోయింది. ఎఫ్‌పీఐలు పెద్దఎత్తున అమ్మకాలకు దిగడమే ఇందుకు ప్రధాన కారణం. ఒక్క జూలైలోనే ఎఫ్‌పీఐలు రూ.12,418.73 కోట్ల విలువైన షేర్లను అమ్మాయి.

### సెప్టెంబరు నుంచి మళ్లీ జోరు

గత ఆగస్టు వరకు దేశీయ స్టాక్ మార్కెట్ నిస్తేజంగానే ఉంది. సెప్టెంబరు నుంచి మార్కెట్ మళ్లీ గాడిలో పడింది. సూపర్ రిచ్‌పై విధించిన సర్‌చార్జీని వెనక్కి తీసుకోవడం, కంపెనీలపై ఆదాయ పన్ను భారాన్ని 10 శాతం తగ్గించడం, కష్టాల్లో ఉన్న కొన్ని రంగాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన 'సహాయ' ప్యాకేజీలు ఇందుకు దోహదం చేశాయి. దాంతో సెప్టెంబరు 20న సెన్సెక్స్ గత పదేళ్లలో ఎన్నడూలేని విధంగా ఒకే రోజు 1,921 పాయింట్లు దూసుకుపోయింది. నవంబరు 27న తొలిసారిగా సెన్సెక్స్ 41,000 పాయింట్లు అధిగమించింది. సంవత్సరం మొత్తానికి చూస్తే, ఈ నెల 27 నాటికి, సెన్సెక్స్ 15.26 శాతం, నిఫ్టీ 12.73 శాతం రాబడులు పంచాయి.

### ర్యాలీకి కలిసొచ్చిన అంశాలు

- ఆర్‌బీఐ రెపో రేటును 1.35% తగ్గించడం
- ఎఫ్‌పీఐలు రూ.97,250 కోట్ల పెట్టుబడులు పెట్టడం
- ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలు
- కొనసాగుతున్న ఎంఎఫ్‌ల పెట్టుబడులు
- వ్యక్తిగత మదుపరులూ లార్జ్ క్యాప్ షేర్లపై ఆసక్తి చూపడం
- వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని సహాయ ప్యాకేజీలు ఉంటాయనే ఆశలు

### దారెస్తున్న పీఈ

ప్రస్తుతం సెన్సెక్స్ 29 పీఈ వద్ద ట్రేడవుతుంది. అంటే ఒక రూపాయి రాబడి ఇచ్చే షేర్ల కొనుగోలు కోసం, మదుపరులు సగటున రూ.29 ఖర్చు చేయాల్సి వస్తోంది. గత 20 సంవత్సరాల్లో సెన్సెక్స్ ఎన్నడూ ఇంత భారీ పీఈతో ట్రేడవలేదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో 2020లో ఈ వాల్యుయేషన్స్ నిలబడతాయా? లేదా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులూ అంత అనుకూలంగా లేవు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్న ఆందోళనా మార్కెట్‌ను వెంటాడుతోంది. దీంతో వచ్చే మార్కెట్‌లో ఆటుపోట్లు తప్పకపోవచ్చని భావిస్తున్నారు.



## రూ.60,000 కోట్లు తగ్గిన కంపెనీల అప్పుల భారం

దేశంలోని ప్రముఖ కంపెనీలు అప్పుల భారం తగ్గించుకుంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో టాప్-50 కంపెనీలు తమ అప్పుల భారాన్ని రూ.59,600 కోట్ల మేర తగ్గించుకున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. గత ఆర్థిక సంవత్సరం (2018-19) మొత్తం మీద తగ్గించుకున్న రూ.43,000 కోట్లతో పోలిస్తే ఇది రూ.16,600 కోట్లు ఎక్కువ. బ్యాంకుల రుణ వితరణ తగ్గడానికి ఇది కూడా ఒక కారణమని భావిస్తున్నారు. అధిక వడ్డీ రేటు ఉన్న దేశీయ రుణాలు చెల్లించి, చౌకగా లభించే విదేశీ వాణిజ్య రుణాలవైపు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. దీనికి తోడు దివాలా చట్టం కూడా అప్పుల భారం ఎక్కువగా ఉన్న కంపెనీలను భయపెడుతోంది. దీంతో కంపెనీలు వీలైనంత వరకు అప్పుల భారం తగ్గించుకునే పనిలో పడ్డాయి.

## 2026నాటికి భారత్ నంబర్ 4

**» ఆర్థిక వ్యవస్థపై బ్రిటిష్ సంస్థ అంచనా**

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2026నాటికి జర్మనీని అధిగమించి ప్రపంచంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని బ్రిటన్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ (సీబీఈఆర్) అంచనా వేసింది. అదే ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుందని కూడా తెలిపింది. సీబీఈఆర్ ప్రకటించిన అంచనా ప్రకారం ప్రభుత్వం నిర్దేశించుకున్న టార్గెట్ కన్నా ఈ లక్ష్య సాధన రెండేళ్లు వెనుకబడింది. 2019 సంవత్సరంలోనే ఫ్రాన్స్, బ్రిటన్‌లను దాటి ప్రపంచంలో ఐదో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. ఆ తర్వాత రానున్న 15 ఏళ్ల కాలంలో ప్రపంచంలో మూడో స్థానం చేరడానికి భారత్, జపాన్, జర్మనీ పోటీ పడతాయని సీబీఆర్ఈ పేర్కొంది. 2024 ఏళ్లకే 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా నిర్దేశించినా ఆర్థిక వ్యవస్థపై మేఘాలు కమ్ముకుని ఉన్నందువల్ల అది సాధ్యంకాదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సీ రంగరాజన్ స్పష్టం చేశారు.

## అపాచీలో మరో 3,000 కొలువులు

**» 2021 నాటికి విస్తరణ పూర్తి**

నెల్లూరు (తడ) : నెల్లూరు జిల్లా తడలోని అపాచీ ఫుట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విస్తరణకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం నెలకు 12 నుంచి 14 లక్షల మధ్య ఉన్న నెలవారీ బూట్ల తయారీ సామర్థ్యాన్ని 20 లక్షలకు పెంచాలని నిర్ణయించింది. 2021లోపు ఈ విస్తరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆదివారం జరిగిన గెట్ టుగెదర్ కార్యక్రమంలో కంపెనీ జీఎం గెవింగ్‌చాంగ్ చెప్పారు. ఈ విస్తరణ పూర్తయితే ప్రస్తుతం 11,900 ఉన్న కార్మికుల సంఖ్య మరో 3,000 వరకు పెరుగుతుందన్నారు.

### మరిన్ని ఆర్డర్లు

ప్రస్తుతం అమెరికా- చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం తమ కంపెనీకి అనుకూలంగా మారిందని గెవింగ్‌చాంగ్ చెప్పారు. ప్రధాన కస్టమర్ అడిడాస్ నుంచి మరిన్ని ఆర్డర్లు వస్తాయన్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ మార్కెట్‌కే పరిమితమైన తమ ఉత్పత్తులను, ఇక దేశీయ మార్కెట్‌లోనూ విక్రయిస్తామన్నారు.

## రేటింగ్ సంస్థల దందాపై ఆర్‌బీఐ గుస్సా

ముంబై: మొన్న సెబీ, నేడు ఆర్‌బీఐ.... వరుస పెట్టి పరపతి రేటింగ్ సంస్థ(సీఆర్ఏ)ల పనితీరును తప్పు పడుతున్నాయి. ఈ సంస్థల నిర్వాకం వల్లే ఆర్థిక సత్తా లేకపోయినా, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ వంటి సంస్థల రుణ పత్రాలకు అత్యధిక పరపతిని సూచించే 'ట్రిపుల్ ఏ లేదా డబుల్ ఏ+' రేటింగ్స్ లభించాయని ఆర్‌బీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. తన తాజా ద్రవ్య స్థిరత్వ నివేదికలో ఆర్‌బీఐ ఈ విషయం పేర్కొంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థ దివాలా ప్రకటించడానికి 15 రోజుల ముందు కూడా ఇక్రా, క్రిసిల్, ఇండియా రేటింగ్స్ సంస్థలు, ఆ సంస్థ రుణ పత్రాలకు అత్యధిక భద్రతను సూచించే 'ఏఏఏ' 'ఏఏ+' రేటింగ్ ఇవ్వడాన్ని ఉదహరించింది. ఈ రేటింగ్స్‌ను నమ్మే మ్యూచువల్ ఫండ్స్, బ్యాంకులు అనేక కంపెనీల దీర్ఘకాలిక రుణ పత్రాల్లో మదుపు చేసి చేతులు కాల్చుకున్నాయి. డీహెచ్ఎఫ్ఎల్ కంపెనీ రుణ పత్రాల్లో మదుపు చేసిన ఇన్వెస్టర్లూ ఇలాగే నష్టపోయారు. బ్యాంకులైతే ఈ పెట్టుబడుల నష్టాలకు కేటాయింపులు చేయలేక సతమతమవుతున్నాయి. ఈ రేటింగ్ ఇచ్చే నాటికే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూపు రూ.లక్ష కోట్ల అప్పుల్లో ఉన్న విషయాన్ని ఆర్‌బీఐ ఎఫ్ఎస్ఆర్ గుర్తు చేసింది.

### రూ.లక్ష కోట్ల అప్పుల్నీ పట్టించుకోలేదు

రేటింగ్ ఇచ్చేనాటికే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూపు రూ.లక్ష కోట్ల అప్పుల్లో ఉన్న విషయాన్ని ఆర్‌బీఐ ఎఫ్ఎస్ఆర్ గుర్తు చేసింది. జూన్ 2018నాటికి ఇదే గ్రూప్‌నకు చెందిన ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ కంపెనీ తన రుణ పత్రాల చెల్లింపుల్లో విఫలమైంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆర్థిక డొల్లతనం ఇంత స్పష్టంగా తెల్తున్నా సీఆర్ఏలు, ఏ మాత్రం పట్టించుకోకుండా, ఆ సంస్థ రుణ పత్రాలకు ట్రిపుల్ ఏ, డబుల్ ఏ+ రేటింగ్స్ ఇవ్వడాన్ని ఆర్‌బీఐ తప్పుబట్టింది.

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 92 | విజయవాడ | 95 |
| వరంగల్ | 92 | గుంటూరు | 94 |
| మహబూబ్‌నగర్ | 92 | ఒంగోలు | 97 |
| కరీంనగర్ | 92 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 92 | నెల్లూరు | 90 |
| విశాఖపట్నం | 93 | అనంతపురం | 93 |
| గోదావరి | 93 | | |



### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్‌100 గుడ్లు)

| | | | |
|---|---|---|---|
| 29వ తేదీకి.. | | విజయవాడ | 468 |
| హైదరాబాద్ | 458 | విశాఖపట్నం | 475 |
| 30వ తేదీకి.. | | వరంగల్ | 461 |
| చిత్తూరు | 478 | డజను గుడ్లు రూ. 69 | |
| గోదావరి | 468 | | |



## టెక్ వ్యూ: 12300 పైన మరింత అప్‌ట్రెండ్



వి సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కరెక్షన్‌లో పడి 12100 వరకు వెళ్లినా గురువారం కోలుకుంది. శుక్రవారం స్వల్పకాలిక మద్దతు స్థాయి 12150 కన్నా పైన బలమైన పునరుజ్జీవం సాధించి కరెక్షన్ ట్రెండ్‌ను నివారించుకోవడమే కాకుండా వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా క్లోజయింది. గత వారం ఏర్పడింది పుల్‌బ్యాక్ అయినా కీలక మద్దతు స్థాయి కన్నా పైనే కోలుకుని ప్రస్తుత అప్‌ట్రెండ్‌ను సురక్షితంగా నిలిపింది. వీక్లీ చార్టుల్లో కూడా కరెక్షన్ అనంతరం వారం గరిష్ఠ స్థాయిలో ముగియడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. 20 డిఎంఏకన్నా పైన రికవరీ సాధించింది. 11800 వద్ద నుంచి ఏర్పడిన ఈ రికవరీలో 500 పాయింట్లకు పైగా లాభపడింది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి కూడా గత వారం సద్దుబాటయింది. కొత్త శిఖరాలకు చేరాలంటే రానున్న కొద్ది రోజుల్లో కీలక నిరోధం, ఆల్‌టైమ్ హై 12300కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి.

**బుల్లిష్ స్థాయిలు:** మరింత పాజిటివ్ ధోరణి ఏర్పడితే 12300 వద్ద గట్టినిరోధం ఎదురు కావచ్చు. ఆ పైన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. మానసిక అవధులు 12400, 12500.

**బేరిష్ స్థాయిలు:** 12300 వద్ద విఫలమైతే బలహీనతను ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 12150. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 12000. ఇదే డిసెంబరు 13న ఏర్పడిన కనిష్ఠస్థాయి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** రియాక్షన్ అనంతరం ఈ సూచి మైనర్ లాభం సాధించి మరింత అపట్రెండ్ సంకేతాలు వెలువరించింది. ప్రధాన నిరోధం 32500 కన్నా పైన మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. మానసిక అవధి 33000.

**స్వల్పకాలిక వ్యూహం:** 12300 కన్నా పైన నిలదొక్కుకుంటే స్వల్పకాలిక ట్రేడర్లు మరిన్ని స్వల్పకాలిక బై పొజిషన్లు తీసుకోవచ్చు. వీక్లీ చార్టుల్లో మరోసారి ఓవర్‌బాట్ స్థితిలోకి ప్రవేశించడం వల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండక తప్పదు.

**పాటర్న్:** 12300 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" వద్ద బ్రేకౌట్ సాధిస్తే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగిస్తుంది. "ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా మార్కెట్ చాలా పైన ఉంది. సాధారణ పరిస్థితుల్లో తక్షణ ముప్పు లేదు. 12150 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

**టైమ్ :** ఈ సూచి ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది. గరిష్ఠ లేదా కనిష్ఠ స్థాయిలను నమోదు చేసి స్వల్ప రివర్సల్ తీసుకునే ఆస్కారం ఉంది.



**దివీస్ లాబ్ (రూ.1,843) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..**

రూ.1,850 ఎగువన అప్‌ట్రెండ్ మొదటి నిరోధం రూ.1,900 రెండో నిరోధం రూ.1,960

రూ.1,820 దిగువన డౌన్‌ట్రెండ్ మొదటి మద్దతు రూ.1,770 రెండో మద్దతు రూ.1,720

**సోమవారం స్థాయిలు** — నిరోధం: 12270, 12300 | మద్దతు: 12235, 12200

www.sundartrends.in

## ఆస్ట్రో టెక్: 12025 దిగువన ముగిస్తే బేరిష్

**(డిసెంబరు 30-జనవరి 3 తేదీల మధ్య వారానికి)**

**గత వారం నిఫ్టీ : 12246 (-26)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12119-12287 పాయింట్ల మధ్యన కదలాడి 26 పాయింట్ల నష్టంతో 12246 వద్ద వారం గరిష్ఠ స్థాయికి చేరువలో నెగెటివ్‌గా ముగిసింది.

- ఈ వారంలో జ్యోతిషపరంగా కొత్త నెల మొదలవుతోంది. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 12192, 11942, 11558, 11556 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డిఎంఏల కన్నా పైన ఉంది. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైనే ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌ను సూచిస్తోంది. ఈ వారాంతంలో 12500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి : 12475** **బ్రేక్‌డౌన్ స్థాయి : 12025**

**నిరోధ స్థాయిలు :** 12400, 12475 (12325 పైన బుల్లిష్)

**మద్దతు స్థాయిలు :** 12100, 12025 (12175 దిగువన బేరిష్)

**ఇన్వెస్టర్లకు సూచన...**

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

**గ్రహగతులు**

- కర్కాటకంలోని ధనిష్ట పాదం 2 నుంచి మీనంలోని రేవతి పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1-2 మధ్యలో రవి సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3 నుంచి పూర్వాషాఢ పాదం 1 మధ్యలో బుధ సంచారం
- కర్కాటకంలోని శ్రవణం పాదం 3-4 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని విశాఖ పాదం 4 నుంచి అనూరాధ పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని ఉత్తరాషాఢ పాదం 1లో ధనస్సు నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4లో కర్కాటక నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 3లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో కేతువు సంచారం

### ద్వితీయార్ధం బలహీనం (సోమవారం నాటికి)

**తిథి:** పుష్య శుక్ల చతుర్థి; నక్షత్రం : ధనిష్ట

**అప్రమత్తం:** పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు: 9.32**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 11.15 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 12.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఏటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12285, 12320**

**మద్దతు స్థాయిలు : 12205, 12170**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.**

# ఒక రాష్ట్రం.. 3 రాజధానులు



అమరావతి రైతులకు మద్దతుగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో నిరసన తెలుపుతున్న ఆంధ్రప్రదేశ్ ఎన్ఆర్ఐలు



## అమరావతిలోనూ రాజధాని

▸▸ కొన్ని కార్యాలయాలే తరలింపు: అవంతి

విశాఖపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి వికేంద్రీకరణ కోసం మూడుచోట్ల రాజధానులు ఏర్పాటు చేయాలని భావిస్తే, దానిపై ప్రాంతీయతత్వంతో ప్రజలను చంద్రబాబు రెచ్చగొడుతున్నారని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. రాజధాని అమరావతిలోనూ ఉంటుందని, కొన్ని కార్యాలయాలను మాత్రమే ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి వివరించారు. చంద్రబాబు ప్రతి విషయాన్నీ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మూడుచోట్ల రాజధాని నిర్ణయం అమలుకాకుండా ఢిల్లీలోని కొందరు నేతలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారని, న్యాయపరంగా అడ్డంకులు కల్పించాలనే ప్రయత్నం జరుగుతోందని, వారెవరో సమయం వచ్చినప్పుడు బయటపెడతామన్నారు.

### ఆందోళనల్లో రైతులు పదిశాతమే!

**ధర్నాల్లో బాబు బినామీలు.. రియల్ బ్రోకర్లు: ఆళ్ల**

మంగళగిరి, డిసెంబరు 29: రాజధానిలో జరుగుతున్న ఆందోళనల్లో పదిశాతం మంది రైతులు మాత్రమే పాల్గొంటున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. వ్యవసాయం చేయాలనుకునే వారికి ప్రభుత్వం భూములు వెనక్కి ఇచ్చే ఆలోచన చేస్తుందన్నారు. ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనడానికి రైతులు రావడంలేదని తెలిసిన చంద్రబాబు.. కృష్ణాజిల్లా, బయటి నుంచి కార్యకర్తలను తెచ్చుకుని మరీ ఆందోళన చేయిస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, చంద్రబాబు బినామీలు ధర్నాల్లో కూర్చొంటున్నారని ఆరోపించారు. రాజకీయాల పేరుతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడం భావ్యం కాదని హితవు పలికారు. చంద్రబాబును నమ్మి భూములు ఇవ్వవద్దని తాను ఆనాడే చెప్పానని, ఇప్పుడు అదే వాస్తవమైందని పేర్కొన్నారు. జీఎన్ రావు కమిటీ నివేదికను ప్రశ్నించే ముందు ఐదేళ్లలో చంద్రబాబు రైతులకు ఇచ్చిన వాగ్దానాల్లో ఎన్ని నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో రోడ్లు, తాత్కాలిక భవనాల పేరిట రూ.కోట్లు దోచుకున్న చంద్రబాబుకు కమిటీ నివేదికను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. రాజధాని రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని చెప్పారు.

# అమ్మో.. అంత దూరమా!

## విశాఖపై సీమ ప్రజలు గగ్గోలు

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అంటే రాత్రి బస్సెక్కితే ఉదయానికి దిగేలా ఉండాలి. విశాఖ అంటే ఎటు నుంచి చూసిన దాదాపు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. దీని కంటే పక్క రాష్ట్రాల రాజధానులు మేలు. ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకోవచ్చు. కడుపులో నీళ్ల కదలకుండా అమరావతికి వచ్చి పోయే రాయలసీమ ప్రజలు విశాఖ రాజధాని అనగానే గగ్గోలు పెడుతున్నారు. బాబోయ్.. రాజధానిగా ఆ నగరం మాకొద్దే వద్దని అంటున్నారు. భౌగోళికంగా సుదూర ప్రాంతం కావడంతో సీమ ప్రజలు విశాఖను రాజధానిగా అంగీకరించడానికి సుముఖంగా లేరు. దీని కంటే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాజధానులు తమకు దగ్గరగా ఉన్నాయని అంటున్నారు. చివరకు గోవాకైనా విశాఖ కంటే వేగంగా చేరుకోవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం రాయలసీమలోని నాలుగు జిల్లాల కేంద్రాల నుంచి విశాఖ చేరుకోవాలంటే సగటున 900 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. సీఎం జగన్ సొంత జిల్లా కడప ప్రజలు 14 గంటల పాటు బస్సులో ప్రయాణం చేస్తే తప్ప ఆ నగరానికి చేరుకోలేరు. కడప నగరం నుంచి విశాఖకు 732 కి.మీ. దూరం ఉంది. అనంతపురం విశాఖకు చేరుకోవాలంటే మూడు చెరువుల నీళ్ల తాగాల్సిందే. 890 కి.మీ. ప్రయాణం చేయాల్సి ఉంటుంది. 17 గంటల పాటు బస్సులో ప్రయాణిస్తే తప్ప చేరుకోలేరు. ఇదే జిల్లా రాయదుర్గం నుంచి విశాఖకు 977 కి.మీ. అంటే మరో రెండు గంటలు అదనపు ప్రయాణమన్న మాట. ఇక చిత్తూరు ప్రజల పరిస్థితి కూడా ఇలానే ఉంది. చిత్తూరు నగరం నుంచి విశాఖకు వెళ్లాలంటే 832 కి.మీ. 15 గంటల పాటు బస్సు ప్రయాణం చేయాలి. అదే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచైతే విశాఖకు 950 కి.మీ. దూరం. కర్నూలు ప్రజలు విశాఖ చేరుకోవాలంటే సుమారు 700 కి.మీ. దూరం ఉంది. ఇలా ఆ నాలుగు జిల్లాల ప్రజలు రాజధానికి వచ్చి వెళ్లడానికే సుమారు రెండ్రోజుల సమయం కేటాయించాలి. విశాఖ కంటే వారు హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు తక్కువ సమయంలో వెళ్లి రావచ్చు. కడప నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలంటే 415 కి.మీ, చెన్నైకి 260 కి.మీ, బెంగుళూరుకు 289 కి.మీ ప్రయాణం చేస్తే సరిపోతుంది. ఇక చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు 570 కి.మీ, చెన్నైకి 158 కి.మీ, బెంగుళూరుకు 181 కి.మీ ప్రయాణం చేసి కేవలం గంటల వ్యవధిలోనే చేరుకునే అవకాశం ఉంది. ఇక అనంతపురం నుంచి బెంగుళూరుకు 215 కి.మీ, హైదరాబాద్‌కు 360 కి.మీ, చెన్నైకి 464 కి.మీ ప్రయాణిస్తే విశాఖ కంటే చాలా తక్కువ సమయంలో చేరుకోవచ్చు. కర్నూలు ప్రజలు విశాఖ కంటే ఈ మూడు రాష్ట్రాల రాజధానులకు తక్కువ సమయంలో వెళ్లి రావొచ్చు. కర్నూలు నుంచి హైదరాబద్‌కు 218 కి.మీ, బెంగుళూరుకు 360 కి.మీ, చెన్నైకు 503 కి.మీ ప్రయాణం చేసి సులువుగా ఆయా ప్రాంతాలకు వెళ్లవచ్చు. కానీ విశాఖకు వెళ్లి రావాలంటే రాయలసీమ ప్రజలు చుక్కలు కనిపిస్తాయి. అనంతపురం నుంచి గోవాకు 467 కి.మీ మాత్రమే దూరం ఉంది.




### అమరావతే దగ్గర..

రాయలసీమ ప్రజలు రాజధానిగా విశాఖ కంటే అమరావతే మేలు అని భావిస్తున్నారు. ఆ నాలుగు జిల్లాల ప్రజలు రాత్రికి బస్సు ఎక్కితే ఉదయానికల్లా అమరావతికి చేరుకోవచ్చు. ఒక్క అనంతపురం మినహా మిగిలిన మూడు జిల్లాల ప్రజలు కేవలం ఏడు గంటల్లో అమరావతికి రావచ్చు. అనంతపురం నుంచి కూడా 9 గంటల్లో అమరావతికి చేరుకోవచ్చు. ఆ నాలుగు జిల్లాలకు అమరావతి 450 కి.మీ. లోపే ఉంది. అనంతపురం నుంచి అమరావతికి 438 కి.మీ దూరం. కేవలం 9 గంటల్లో రావచ్చు. కడప నుంచి కూడా 6 గంటల్లో 348 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే చేరుకోవచ్చు. చిత్తూరు ప్రజలు 447 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అత్యల్పంగా కర్నూలు ప్రజలు 297 కి.మీ. ప్రయాణం చేస్తే అమరావతికి సులువుగా చేరుకునే అవకాశం ఉంది.

## రైతుల నిర్బంధం

తెనాలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు వారంతా ప్రభుత్వం తరపున రాజలాంఛనాలు అందుకున్న రైతులు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతోనే వారి తలరాత కూడా మారిపోయింది. సన్మానాలు, సత్కారాలు అందుకున్న చోటే లాఠీ దెబ్బలు తగిలాయి. మీడియా ప్రతినిధులపై దాడిచేశారంటూ పోలీసులు వారిపై ఏకంగా హత్యాయత్నం కేసులే నమోదుచేశారు. మీడియాపై దాడి వీడియోలు చూసి అందులో కొంత మంది రైతులు ఉన్నారంటూ.. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు వారి ఇళ్ల గోడలు దూకి మరీ పోలీసులు లోపలకు ప్రవేశించారు. ఇంట్లోని మహిళలు నిలదీయడంతో.. మాట్లాడి పంపిస్తామన్న హామీతో తీసుకెళ్లారు. కానీ గుట్టుచప్పుడు కాకుండా వారిని తెనాలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసి అఖిలపక్ష నేతలు తెనాలి స్టేషన్‌ను ముట్టడించారు. మీడియా కంట కూడా పడడంతో.. చివరకు చేసేదిలేక మంగళగిరి కోర్టులో ఆరుగురినీ పోలీసులు హాజరు పరిచారు.

రాజధాని తరలింపును నిరసిస్తూ రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్న రైతులను అణచివేసేందుకు ప్రభుత్వం భారీసంఖ్యలో పోలీసులను మోహరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ఆందోళన చేస్తున్న రైతులు పెయిడ్ ఆర్టిస్టులన్న వ్యాఖ్యల నేపథ్యంలో కొన్ని టీవీ చానళ్ల (ఏబీఎన్ కాదు) రిపోర్టర్లపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో విజయవాడకు చెందిన నల్లమోతు దీప్తి పేరుతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆరుగురు రైతులపై వివిధ సెక్షన్ల (307, 342, 323, 324, 427, 506, రెడ్ విత్ 149) కింద కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో 'కొందరు' అని మాత్రమే చూపి.. తెల్లవారేలోపే ఆరుగురు రైతులను ఎంపిక చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున గుంటూరు జిల్లా తెనాలి టూటౌన్ పోలీసులు రాజధాని ప్రాంతంలోని ఏడుగురు రైతులను అదుపులోకి తీసుకున్నారు. మోదుగులింగాయపాలెం గ్రామానికి చెందిన బండారు నాగరాజు, ధనశ్రీ నరేష్, వెంకటపాలేనికి చెందిన గోగులపాటి సురేంద్ర, ప్రత్తిపాటి శ్రీనివాసరావు, నెక్కల్లుకు చెందిన రామినేని నరసింహస్వామి, వెలగపూడికి చెందిన భూక్యా లోకానాయక్‌ను అరెస్టు చేశారు. ఆయా రైతుల ఇళ్ల గోడలు దూకి వెళ్లి మరీ పోలీసులు వారిని అరెస్టుచేశారు. ఆరుగురిని తెనాలి తీసుకొచ్చినట్లు తెలియడంతో టీడీపీ నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, జనసేన, కాంగ్రెస్ నాయకులు పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టారు. రైతులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మధ్యాహ్నం వరకు ఆందోళన కొనసాగించారు. మీడియా హడావుడితో రైతులను వేరే స్టేషన్‌కు తరలించే ప్రయత్నాన్ని విరమించుకుని ఆదివారం రాత్రి అరెస్టు చూపించారు. రాత్రి తెనాలిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించారు. రాత్రి 10.30 గంటలకు మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీఏఎన్‌వీ లక్ష్మి ఇంటి వద్ద హాజరు పరిచారు. వారిని 14 రోజులు రిమాండ్‌కు పంపుతూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

### కన్నీటిపర్యంతం..

ఉద్యమాన్ని నీరుకార్చేందుకే ఈ దాడి కేసును అడ్డుపెట్టుకుని పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని రాజధాని ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా భూమి ఇచ్చిన తమకు మంచి బహుమానమే ఇచ్చారని, దాతృత్వం చూపినవారిని కటకటాల పాలుజేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డి సర్కారుకే దక్కుతుందని అరెస్టయిన రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

# ఆరని మంటలు



మందడంలో మహిళలు, రైతుల నిరసన



పోలీసులు అదుపులోకి తీసుకున్న రైతులు

(మొదటి పేజీ తరువాయి)

శిబిరాల్లో పాల్గొన్నారు. తుళ్లూరు శిబిరానికి తాడికొండ, అనంతవరం, నెక్కల్లు, వడ్డమాను, పెదకూరపాడు, మంగళగిరి, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు, ప్రజలు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యమాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. అర్ధరాత్రి దాటాక తమ ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేశారని.. కొందరిని అరెస్టు చేసి తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బిడ్డలను తీసుకెళ్లిన పోలీసులు.. తమను పెయిడ్ ఆర్టిస్టులని కించపరుస్తూ మాట్లాడిన వారిపై ఏం చర్యలు తీసుకుంటారని నిలదీశారు. మందడంలో ఉదయం రోడ్డుపై దీక్షా శిబిరానికి టెంటు వేస్తుండగా పోలీసు వాహనం 'వజ్ర' వేగంగా వచ్చి టెంటు కర్రకు ఢీకొట్టడంతో టెంటు కూలింది. ఈ ఘటనలో గ్రామస్థుడు గోడపాటి సాంబశివరావు తలకు గాయమైంది. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు..

### చేతులెత్తి మొక్కుతున్నాం..

బీజేపీ ఎంపీ సుజనాచౌదరి నేతృత్వంలో ఆ పార్టీ నేతల బృందం రాజధాని గ్రామాల్లో పర్యటించింది. ప్రధాని మోదీ రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. 'మీకు చేతులెత్తి దండం పెడతాం.. అన్ని విధాలుగా నష్టపోతున్నాం.. అభివృద్ధి చేయకపోగా శ్మశానం.. ఎడారి అంటూ ఎగతాళి చేస్తున్నారు.. నమ్మిన తల్లిని చావగొట్టిన దుర్మార్గులు గుర్తుకు వస్తున్నారు. మాకు మీరే దిక్కు..' అంటూ రాజధాని ప్రాంత మహిళలు సుజనాచౌదరి ఎదుట వాపోయారు. ప్రతి శిబిరం వద్ద మహిళలు చేతులెత్తి మోకాళ్లపై నిలబడి తమ గోడు వినిపించారు. 'పిల్లల భవిష్యత్ కోసం త్యాగం చేస్తే వారినే అరెస్టు చేస్తున్నారు. వేళ కాని వేళల్లో ఇళ్లల్లోకి వచ్చి మహిళలను ఫొటోలు తీస్తున్నారు. మమ్మల్ని పెయిడ్ ఆర్టిస్టులు అంటూ నీచంగా మాట్లాడుతున్నారు..' అని శిబిరం వద్ద దెందు శైలజ అనే మహిళ వాపోయారు. 'మా బతుకులు బాగుపడతాయని భూములు ఇచ్చి జగన్‌కు ఓట్లు వేస్తే బజారు పాల్జేశారు. తన తండ్రి వైఎస్ పాలనను గుర్తుకు తెస్తానంటే నమ్మాం.. ఇప్పుడు మోసపోయాం' అని ఓ మహిళ ఆవేదన వ్యక్తంచేసింది. పోలీసులు తమ పిల్లలను తీసుకెళ్లి.. ఎక్కడ ఉన్నారో కూడా చెప్పడం లేదని వెలగపూడి శిబిరం వద్ద మహిళలు కన్నీరు పెట్టుకున్నారు.

### ఇది మోదీకి అవమానం: సుజనాతో జేఏసీ

విజయవాడ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ గౌరవానికి భంగం వాటిల్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి తరలింపునకు సిద్ధపడుతోందని అమరావతి రాజధాని పరిరక్షణ జేఏసీ పేర్కొంది. అమరావతిపై కేంద్రం జోక్యం చేసుకునేలా చొరవ చూపాలని ఆదివారం విజయవాడలో బీజేపీ ఎంపీ సుజనా చౌదరికి వినతిపత్రం సమర్పించింది.

### అవినీతికి పాల్పడేందుకే తరలింపు : దేవధర్

అనంతపురం, డిసెంబరు 29(ఆంధ్ర జ్యోతి): వైసీపీ నేతలు అవినీతికి పాల్పడేందుకే రాజధానిని తరలిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్ ఆరోపించారు. ఆదివారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన పార్టీలు ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నాయని పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేకులపై విమర్శలు గుప్పించారు. ఈ చట్టాలపై అవగాహన కల్పించేందుకు 4న కడపలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.




రాజధాని తరలింపును నిరసిస్తూ విజయవాడ బెంజి సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న జనం

### గ్రామగ్రామానా దీక్షలు..

- రాజధాని అమరావతిలోనే ఉంచాలని డిమాండ్ చూస్తూ ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఆదివారం పుణ్యక్షేత్రం అమరావతిలోని సత్తెనపల్లి సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.
- దుగ్గిరాల మండలం చింతలపూడిలో ఆదివారం యువకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ పూర్వ ఇన్‌చార్జి గంజి చిరంజీవి సంఘీభావం తెలిపారు.
- మందడంలో స్థానిక మహిళలు పోలేరమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. రాజధాని తరలకుండా అమ్మ తమను కాపాడుతుందనే నమ్మకంతో నైవేద్యం సమర్పించినట్లు తెలిపారు. సీఎం జగన్‌కు మంచి మనసు ప్రసాదించాలని కోరుకున్నారు.
- రాజధాని అమరావతిని తరలించవద్దంటూ మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని రైతులు, గ్రామస్థులు, అఖిలపక్ష నేతలు ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. కొత్తపాలెంలో నలుపు రంగు జెండాలను చేతపట్టి, నిరసన ప్రదర్శన చేపట్టారు.
- రాజధాని ప్రాంత రైతులకు మద్దతుగా క్రోసూరు మండలం నాగరంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.
- రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు సంఘీభావంగా ఆదివారం మోతడక గ్రామంలో రాస్తారోకో, వంటావార్పు చేపట్టారు. రెండుగంటల పాటు జరిగిన రాస్తారోకోతో గుంటూరు-అమరావతి ప్రధాన రహదారిపై భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.
- రాజధానిపై ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ గుంటూరులోని హిమని సెంటర్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. రాజధానిని తరలిస్తే సర్కారు పతనం ఖాయమని అఖిల పక్ష నేతలు మండిపడ్డారు. మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, జనసేన నేత బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జంగాల అజయ్‌కుమార్, మహ్మద్ నసీర్, కొరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా పెదవడ్లపూడిలో దిష్టిబొమ్మను దహనంచేసి, రాస్తారోకో చేస్తున్న జనం

### రైతులపై హత్యాయత్నం కేసులా?

▸▸ ఐజీకి టీడీపీ, కాంగ్రెస్ నేతల ప్రశ్న

గుంటూరు, డిసెంబరు 29: "అమరావతి నుంచి రాజధానిని తరలించవద్దని కోరుతూ 12రోజులుగా తిండీతిప్పలు లేకుండా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు రోడ్లపై ఆందోళన చేస్తుంటే, చిన్న ఘటనను సాకుగా చూపి రైతులపై హత్యాయత్నం కేసులు నమోదు చేస్తారా" అని టీడీపీ, కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. రైతులను పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడంపై రాజధాని పరిరక్షణ రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి మండిపడింది. ఈ ఘటనపై జేఏసీ నేతలు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, టీడీపీ నాయకులు మన్నవ సుబ్బారావు, చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు తదితరులు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మీడియా ప్రతినిధులతో ఘర్షణను సాకుగా తీసుకుని ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఒకే ఘటనపై తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదు చేశారని, అందులో రెండు హత్యాయత్నం కేసులు బనాయించారన్నారు. అక్రమ కేసులు బనాయించడమే కాక అత్యాచారం, నేరస్థులు, తీవ్రవాదుల తరహాలో పోలీసులు గోడలు దూకి వెళ్లి రైతులను అరెస్టు చేశారన్నారు. అరెస్టయినవారికి, జరిగిన ఘర్షణకు సంబంధం లేదని చెప్పారు. వీడియో కెమెరాల ఆధారంగా గుర్తించామంటున్నారు కానీ వారు ఏం చేస్తుంటే గుర్తించారో చెప్పమంటే సమాధానం లేదన్నారు. వీరంతా ఆ గుంపులో ఉన్నట్లు పేర్కొంటున్నారని తెలిపారు. కేవలం ఉద్యమాన్ని అణచివేసే కుట్రలో భాగంగానే ఆయా గ్రామాల్లో ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. తక్షణం హత్యాయత్నం సెక్షన్లు తొలగించాలని, రైతులపై కక్ష సాధింపు మానుకోవాలని కోరారు. ఆయా కేసుల్లో నిందితులకు నోటీసులు ఇస్తే తామే తీసుకొచ్చి అప్పగిస్తామని, అంతేకాని రైతులను తీవ్రవాదులు, దోపిడీ దొంగల తరహాలో అరెస్టు చేయరాదని సూచించారు. నిర్బంధాలు, తప్పుడు కేసులతో ఉద్యమం మరింత తీవ్రరూపం దాలుస్తుందని హెచ్చరించారు.

### 'మూడు'తో రాష్ట్రాభివృద్ధికి నష్టం

▸▸ అప్పుడోమాట.. ఇప్పుడోమాట జగన్‌కు తగదు: రాఘవులు



విశాఖపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన 'మూడు రాజధానుల' ప్రకటన వల్ల రాష్ట్ర అభివృద్ధికి నష్టం కలుగుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం ఆయన విశాఖలో మాట్లాడుతూ రాజధాని పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టొదని జగన్‌కు హితవు పలికారు. రాజధాని ఏకఖండంగా ఉండాలి తప్పితే, ప్రభుత్వం మారినప్పుడల్లా రాజధాని మార్చడం ప్రజలను గందరగోళంలోకి నెట్టినట్లవుతుందన్నారు. గతంలో అమరావతి రాజధాని అన్నప్పుడు స్వాగతించిన జగన్... అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం తగదన్నారు. ఒకేచోట 1,500 ఎకరాల్లోనే రాజధాని ఉండాలన్నది తమ పార్టీ విధానమని, దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చిన తర్వాతే తమ వైఖరి తెలియజేస్తామన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నడపాలని చిత్తశుద్ధి ఉంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాయింట్ వెంచర్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను పోస్కోకు కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి దీనిపై కనీసం మాట్లాడకపోవడం ఎంతవరకూ సమంజసమని ఆయన ప్రశ్నించారు.

### మభ్యపెట్టడానికే కమిటీలు: రామకృష్ణ

కడప, అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, రాజధాని నిర్ణయంపై అంటూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన హైపవర్ కమిటీ ఎవరిని మభ్యపెట్టడానికని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కడపలో మాట్లాడారు. గతంలో ఇలాగే ఎక్స్‌పర్ట్ కమిటీ వేసి, ఆ కమిటీ నివేదిక రాకముందే సీఎం జగన్ మూడు రాజధానులంటూ అసెంబ్లీలో ప్రకటన చేశారన్నారు. కేబినెట్‌కు ముందురోజే విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా పెడుతున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. వీరిద్దరే నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఈ కమిటీల డ్రామాలెందుకని ప్రశ్నించారు.

### నేడు జనసేన విస్తృతస్థాయి సమావేశం

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ముఖ్య నేతలతో విస్తృతస్థాయి సమావేశం సోమవారం మంగళగిరి కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరగనుంది. 'రాజధాని మార్పుపై జనసేన ఎలాంటి అడుగులు వేస్తుందో ఈ సమావేశం తర్వాత వెల్లడించే అవకాశాలున్నాయి.

## ఏడు పదుల వయసులో ప్రేమ పెళ్లి!



న్యూఢిల్లీ, డిసెంబరు 29: ప్రేమకు వయసు అడ్డుకాదని ఈ జంట నిరూపించింది. ఏడుపదుల వయసులో వీరిద్దరూ ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. అది కూడా ఓ వృద్ధాశ్రమంలో. ఈ దంపతుల పేర్లు లక్ష్మీ అమ్మాల్(65), కొచ్చనియాన్ మెనన్(67). లక్ష్మీ భర్త చనిపోయాడు. దీంతో త్రిశూర్‌లోని ఓ వృద్ధాశ్రమంలో ఉంటోంది. కుటుంబసభ్యులు ఆదరించకపోవడంతో కొచ్చనియాన్ కూడా ఇదే ఆశ్రమంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం చిగురించి ప్రేమగా మారింది. దీంతో పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు.

## మహాదళపతి గరిష్ఠ వయో పరిమితి 65

న్యూఢిల్లీ, డిసెంబరు 29: మహా దళపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) గరిష్ఠ వయో పరిమితిని 65 ఏళ్లుగా కేంద్రం నిర్ణయించింది. ఆర్మీ నిబంధనలు 1954లో ఈ మేరకు ప్రభుత్వం మార్పులు చేసిందని రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. త్రివిధ దళాల సేవలకు సంబంధించిన అన్ని విషయాల్లో రక్షణ మంత్రికి సీడీఎస్ ముఖ్య సైనిక సలహాదారుడిగా వ్యవహరిస్తారు.

## ఆరేళ్ల కనిష్ఠానికి ఢిల్లీ ఉష్ణోగ్రత



గడ్డ కట్టిన నల్లా నీళ్లు

శ్రీనగర్/న్యూఢిల్లీ, డిసెంబరు 29 : దేశ రాజధాని ఢిల్లీని చలిగాలులు వణికిస్తున్నాయి. ఆదివారం ఉత్తర ఢిల్లీలోని మంగేశ్‌పూర్‌లో 1.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గత ఆరేళ్లలో హస్తినలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే. ఇక పొగమంచు కమ్ముకోవడంతో రెండు విమానాలను రద్దు చేయగా, ఆరింటిని దారిమళ్లించారు. ఢిల్లీ మీదుగా రాకపోకలు సాగించే 500 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. మరోవైపు శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఘనీభవించింది. అక్కడ ఈ సీజన్‌లోనే అత్యల్పంగా మైనస్ 6.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

### హెల్మెట్‌లేని స్కూటరిస్టుతో ప్రియాంక ప్రయాణం

## వాహన యజమానికి జరిమానా



లఖ్‌నవూ/హైదరాబాద్, డిసెంబరు 29: లఖ్‌నవూలో హెల్మెట్ ధరించని స్కూటరిస్టుతో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ప్రయాణించారు. ఇందుకుగానూ ఆ వాహన యజమానికి పోలీసులు రూ.6300 జరిమానా విధించారు. రిటైర్డ్ ఐపీఎస్ ఎస్ఆర్ దారాపురి ఇంటికి డ్రైవర్ ధీరజ్ గుర్జార్‌తో కలిసి స్కూటీపై ప్రియాంక వెళ్లారు.

### పోలీసుల తీరు హేయం: ఉత్తమ్, ఖుంటియా

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ విషయంలో లఖ్‌నవూలో పోలీసులు ప్రవర్తించిన తీరు హేయమని టీపీసీసీ చీఫ్, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి ఆర్సీ ఖుంటియా అన్నారు. కాగా, బీజేపీ ప్రభుత్వ సూచనతో ప్రియాంక పట్ల పోలీసుల తీరు సిగ్గు చేటని కాంగ్రెస్ నేత శత్రుఘ్న సిన్హా అన్నారు.

## దేశ విభజనకు మోదీ యత్నం: ఒవైసీ

కిషన్‌గంజ్, డిసెంబరు 29: సీఏఏ, ఎన్పీఆర్, ఎనార్సీతో దేశ విభజనకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ఆదివారం బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో 'రాజ్యాంగాన్ని కాపాడండి' అన్న నినాదంతో నిర్వహించిన ర్యాలీలో ఒవైసీ మాట్లాడారు. ఎన్పీఆర్, ఎనార్సీకి తేడా లేదన్నారు. దేశ విభజన సమయంలో ఇక్కడే ఉండాలని ముస్లింలు నిర్ణయించుకున్నపుడే వారి దేశభక్తి నిరూపితమైందని, ఇప్పుడు కొత్తగా నిరూపించుకోవడానికి ఏముందని ప్రశ్నించారు.

# యువ గళం.. దేశానికి బలం

### నవభారత నిర్మాణంలో వారే కీలకం.. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ, డిసెంబరు 29: రాబోయే దశాబ్దం యువతదేనని, నవభారత నిర్మాణంలో వారిదే కీలకపాత్ర అని ప్రధాని మోదీ అన్నారు. దేశంలోని యువత అరాచకత్వం, కులతత్వం, బంధుప్రీతిని అసహ్యించుకుంటోందని చెప్పారు. ఆదివారం ఆయన ఈ ఏడాదికి చివరిదైన మన్‌కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం యువత వ్యవస్థను బలంగా నమ్ముతోందని, ఒకవేళ వ్యవస్థ సరిగా పనిచేయకపోతే ప్రశ్నించడానికీ వెనకాడడం లేదని ప్రశంసించారు. "వ్యవస్థను యువత ప్రశంసిస్తోంది. అనుసరిస్తోంది. కొన్ని సందర్భాల్లో వ్యవస్థ సరిగా పనిచేయనప్పుడు ధైర్యంగా ప్రశ్నించేందుకు ముందుకు వస్తోంది" అని మోదీ పేర్కొన్నారు. ఈ లక్షణం చాలా బలమైందని తాను నమ్ముతానన్నారు. నవ భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ నిర్మాణంలో యువశక్తే ప్రధానమన్న స్వామి వివేకానంద జన్మదినమైన జనవరి 12న ఈ దిశగా యువతీయువకులందరూ ఓ తీర్మానం చేయాలని పిలుపునిచ్చారు. నవతరం కోసం భారతదేశం వేచి చూస్తోందన్నారు. దేశ ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. 2022కు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతాయని, కనీసం అప్పటి వరకైనా దేశీయంగా తయారైన ఉత్పత్తులనే కొనాలని పిలుపునిచ్చారు. దేశంలో శ్రమైక జీవుల కష్టానికి తగిన విలువనిద్దామన్నారు. "మనం స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయలేమా? మన ప్రతిష్ఠను ఇనుమడింపజేసుకోలేమా?" అని అడిగారు. వందేళ్ల కిందట మహాత్మా గాంధీ 'స్వదేశీ' ఉద్యమాన్ని ఉధృతంగా ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. 'నూతన సంవత్సరం, నూతన దశాబ్దం, నూతన తీర్మానాలు కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయి. మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాలి. సాధించాల్సింది చాలా ఉంది. దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాల్సి ఉంది. ఆ దిశగా తీసుకునే చర్యలపై ఎంతో నమ్మకముంచాలి. 130 కోట్ల భారతీయుల సంకల్పంపై నమ్మకం ఉంచుదాం' అని మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.



విశ్వేశతీర్థ స్వామీజీకి తుది వీడ్కోలు పలుకుతున్న భక్తులు





ఇఫ్తార్ విందులో స్వయంగా వడ్డిస్తున్న విశ్వేశతీర్థ (ఫైల్)

### పెజావర మఠాధిపతి

# భగవదైక్యం

(మొదటి పేజీ తరువాయి)

మధ్వాచార్యుడు 8 శతాబ్దాల క్రితం నెలకొల్పిన అష్ట మఠాల్లో కీలకమైన పెజావర మఠానికి విశ్వేశతీర్థ 32వ అధిపతి. దాని తరఫున పెద్దఎత్తున సామాజిక, విద్యాసేవలు అందించిన ఆయన.. రామజన్మభూమి ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించారు. శ్వాస సంబంధిత సమస్యలతో ఈ నెల 19న ఆయన్ను మణిపాల్‌లోని కేఎంసీ ఆస్పత్రిలో చేర్చారు. శనివారం(28న) పరిస్థితి విషమించి అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్వామీజీ ఆకాంక్ష మేరకు వైద్యుల సలహాతో ఆయన్ను ఉడిపిలోని పెజావర మఠానికి తరలించారు. అక్కడే ప్రత్యేక ఐసీయూను ఏర్పాటు చేసి చికిత్సలు కొనసాగించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిమ్స్ బృందం వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. అప్పటికే స్వామీజీ మెదడు నిష్క్రియగా మారడంతో భగవదైక్యం చెందినట్లు ప్రకటించారు. ఆయన పార్థివ దేహాన్ని ఉడుపి శ్రీకృష్ణ మఠానికి తీసుకెళ్లారు. అక్కడ పవిత్ర మధ్వ సరోవరంలో స్నానం చేయించి.. దైవ దర్శనం అనంతరం కాషాయ వస్త్రంతో, తులసిమాలలతో అలంకరించి.. వెదురు పేటికలో ఉంచారు. భక్తులు కడసారి దర్శించుకునేందుకు వీలుగా ఓపెన్ టాప్ జీపులో ఊరేగింపుగా అజ్జర్‌కడ్ స్టేడియానికి తీసుకెళ్లారు. విశ్వేశతీర్థ భగవదైక్యం పొందిన సమయంలో ముఖ్యమంత్రి యడియూరప్పతోపాటు అనేకమంది ప్రముఖులు ఉడిపి మఠంలోనే ఉన్నారు. బెంగళూరులోని పూర్ణప్రజ్ఞ విద్యాపీఠంలో 'బృందావనం' ఏర్పాటు చేయాలన్న ఆకాంక్ష మేరకు ఉడిపి నుంచి ప్రత్యేక సైనిక హెలికాప్టర్లో పార్థివదేహాన్ని ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బెంగళూరు హెచ్ఏఎల్ వీఐపీ విమానాశ్రయానికి తీసుకొచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు భక్తులు తుది నివాళులు అర్పించిన అనంతరం మధ్వ బ్రాహ్మణ సంప్రదాయాల ప్రకారం బెంగళూరు శ్రీనివాసనగర్‌లోని పూర్ణప్రజ్ఞ విద్యాపీఠంలో అంత్యక్రియలను(బృందావనం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. పోలీసులు తుపాకులు గాలిలోకి పేల్చి వందనం సమర్పించారు. కేంద్రప్రభుత్వం తరఫున ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరై స్వామీజీ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. స్వామీజీ మృతదేహంపై యడియూరప్ప జాతీయ పతాకాన్ని కప్పారు. కాగా, స్వామీజీతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని బీజేపీ అగ్రనేత ఆద్వాణీ తెలిపారు. స్వామీజీ మరణంతో హైందవ మతం ఓ ప్రధాన మార్గదర్శిని కోల్పోయిందని సీఎం యడియూరప్ప వ్యాఖ్యానించారు. అసమానతలను పోగొట్టడానికి దళితులతో సహభోజనం చేశారని కొనియాడారు.

### స్వామీజీ మార్గదర్శి: మోదీ

పెజావర స్వామీజీ మరణం పట్ల ప్రధాని మోదీ, బీజేపీ అగ్ర నేత లాల్‌కృష్ణ ఆద్వాణీ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'లక్షలాది మంది ప్రజల హృదయాల్లో ఉడుపి ఎప్పటికీ నిలిచిపోతుంది. వారందరికీ వెలుగుచూపించే మార్గదర్శి స్వామీజీ. సేవలు, ఆధ్యాత్మికతల్లో అగ్రగణ్యుడు. ఆయన్నుంచి నేర్చుకోవడానికి నాకు అనేక అవకాశాలు దొరకడం నా అదృష్టం' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

### ఏడేళ్ల వయసులోనే సన్యాసం

రామకుంజలో శివల్లి మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో నారాయణాచారయ్య, కమలమ్మ దంపతులకు 1931 ఏప్రిల్ 27న వెంకటరమణగా జన్మించిన విశ్వేశతీర్థ.. గ్రామంలోనే సంస్కృతంలో ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. ఏడో ఏట గాయత్రీ మంత్రోపదేశం పొంది వేద అధ్యయనం ప్రారంభించారు. ఆటలాడుకునే వయసులోనే మఠంలోని శ్రీకృష్ణ భగవానుడి పూజలను ఆసక్తిగా గమనించేవారు. పెజావర మఠాధిపతి శ్రీవిశ్వ మాన్య తీర్థరు సమక్షంలో ఏడేళ్లకే సన్యాసం తీసుకున్నారు. ఆజన్మాంతం శ్రీకృష్ణుడి సేవలో తరించారు. మధ్వాచార్యుడి ప్రియ శిష్యుడు అధోక్షజానంద తీర్థరు పెజావర్ మఠానికి తొలి అధిపతి కాగా.. విశ్వేశతీర్థ 32వ అధిపతి.

### ఎన్నార్సీపై నిరసన 'ముగ్గులు'

## చెన్నైలో ఏడుగురి నిర్బంధం




నిరసన ముగ్గులు వేస్తున్న మహిళలు

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం (కా), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్నార్సీ)లకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్, కేరళ, యూపీ, ఢిల్లీ, అసోం, తమిళనాడులో ఆదివారం ఆందోళనలు కొనసాగాయి. చెన్నై బీసెంట్ నగర్ వీధుల్లో మహిళలు నిరసన ముగ్గులు వేసి రంగులు అద్దారు. దీనిపై పోలీసులు నలుగురు మహిళలు సహా ఏడుగురిని నిర్బంధించారు. అనుమతి లేకుండా నిరసన వ్యక్తం చేస్తున్నారని కేసులు నమోదు చేశారు. ఈ చర్యపై డీఎంకే అధినేత స్టాలిన్ ఫేస్‌బుక్ వేదికగా మండిపడ్డారు. సీఏఏను సమర్థించినందుకు మధ్యప్రదేశ్ బీఎస్పీ ఎమ్మెల్యే రమాబాయ్‌ని పార్టీ అధినేత్రి మాయావతి సస్పెండ్ చేశారు.

### రాష్ట్రాలను సంప్రదించాకే ఎన్నార్సీ: రవిశంకర్ ప్రసాద్

జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) కోసం సేకరించిన 'కొంత' సమాచారాన్ని ఎన్నార్సీకి వాడవచ్చు, లేదా వాడకపోవచ్చునని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా ఎన్నార్సీ అమలుకు ముందు చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు రాష్ట్రాలను సంప్రదిస్తామన్నారు. 'భారత మాతకు జై' అని నినదించిన వారే ఈ దేశంలో ఉండేందుకు అర్హులని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సీఏఏను వ్యతిరేకించేవారు దళిత వ్యతిరేకులని బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఆరోపించారు. యూనివర్సిటీల్లో రాజకీయాలను సహించబోమంటూ మానవ వనరుల శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ తీవ్రంగా హెచ్చరించారు.



జార్ఖండ్ 11వ సీఎంగా హేమంత్ సోరెన్ ఆదివారం రాంచీలో ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్ సీఎంలు అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాఘేల్, మమతా బెనర్జీ, సీపీఎం నేత ఏచూరి, డీఎంకే నేత స్టాలిన్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ పాల్గొన్నారు. తొలి కేబినెట్‌లోనే 'పత్తల్ గడీ' కేసులను ఎత్తివేశారు.



### అంగుళం కదిలినా

# ఊరుకోం!

- కేంద్రంతో మాట్లాడే చెప్తున్నా
- రాజధాని రాష్ట్ర నిర్ణయమే..
- కానీ ఇప్పుడు మార్పు కుదరదు
- అమరావతికి రూ.8వేల కోట్లు చాలు
- బీజేపీ ఎంపీ సుజనా చౌదరి వెల్లడి

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతి ఒక్క అంగుళం కదిలినా ప్రజలు, బీజేపీ చూస్తూ ఊరుకోవు. కేంద్రంతో చర్చించే ఈ మాట చెప్తున్నా. కేంద్రం అధికారాలేంటో అవసరమైన సందర్భంలో చెప్తాం' అని బీజేపీ ఎంపీ సుజనా చౌదరి ఉద్ఘాటించారు. అమరావతి తరలింపు విషయంలో కేంద్ర ప్రభుత్వ అంగీకారం ఉందన్న వైసీపీ వర్గాల మాటలకు అర్థం లేదన్నారు. ఇలాంటి మూడు రాజధానుల పనికి ఎవరైనా మద్దతిస్తారా? అని ప్రశ్నించారు. ఇదేదో రెండు జిల్లాల ప్రజలు, రైతుల సమస్య కాదని, మొత్తం 13 జిల్లాల రైతుల సమస్య అని పేర్కొన్నారు. రాజధాని రైతులకు మద్దతు తెలిపేందుకు ఆదివారం రాజధాని ప్రాంతంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మొదట మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో పూజలు నిర్వహించారు. అనంతరం తుళ్లూరు, మందడం, వెలగపూడి, కృష్ణాయపాలెంలో ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి ప్రసంగించారు. అమరావతి నిర్మాణానికి ఇప్పటికే వేలకోట్లు ఖర్చుచేశారన్నారు. అమరావతిలో రాజధాని పెట్టాలని ఆరోజు రైతులు అడగలేదని, నాటి ప్రభుత్వం, ప్రతిపక్షం, ఎమ్మెల్యేలంతా కలిసి నిర్ణయించి పెట్టారన్నారు. ఆనాడు అమరావతికి మద్దతుగా మాట్లాడిన జగన్మోహన్‌రెడ్డే.. రాజధాని నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలన్నారని గుర్తు చేశారు. 'ఆ రోజు ప్రభుత్వం వద్ద డబ్బులేక భూసేకరణ పద్ధతిలో కాకుండా.. భూసమీకరణ విధానంలో వెళ్లింది. ఇప్పుడు రాజధాని మారుస్తాం అంటే రైతులకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి. దాదాపు 34వేల ఎకరాలకు అది సుమారు రూ.1.5లక్షల కోట్లు అవుతుంది' అని సుజనా అన్నారు. రేపు విశాఖపట్నం రైతు కూడా సుఖంగా ఉంటారని చెప్పలేమన్నారు.

### రాష్ట్ర నిర్ణయమే అయినా..

రాజధాని ఎక్కడుండాలో నిర్ణయించుకునేది రాష్ట్ర ప్రభుత్వమే అయినా కేంద్రానికీ కొన్ని హక్కులుంటాయని సుజనాచౌదరి పేర్కొన్నారు. 'రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94(3) ప్రకారం రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం అందిస్తామని కేంద్రం పేర్కొంది. ఎన్డీయే హయాంలో మూడు రాష్ట్రాలు ఏర్పాటైతే వాటి రాజధానుల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితుల్లో విడిపోవాల్సి రావడంతో రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులిస్తామన్నారు. ఆనాడు అసెంబ్లీలో ఏకగ్రీవంగా జగన్, వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలతో సహా అంతా అమరావతి రాజధాని అని తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. ఒక్క ఎమ్మెల్యే కూడా వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. అలా పంపాకే కేంద్రం రూ.1500 కోట్లు ఇచ్చింది. ఇక్కడ రాజధాని ఉందన్న కారణంతోనే విజయవాడ-గుంటూరు ప్రాంతాన్ని స్మార్ట్‌సిటీ పథకం కింద ఎంపిక చేసి వెయ్యికోట్లు ఇచ్చింది. అదేవిధంగా 130 కేంద్ర ప్రభుత్వ సంస్థలు అమరావతిలో భూములు కొన్నాయి. రూ.940 కోట్లకు 1293 ఎకరాలను కొనుగోలు చేయగా... అందులో రూ.540కోట్లను ఆయా సంస్థలు ఇప్పటికే చెల్లించాయి. హ్యాపీనెస్ట్ పేరుతో ప్రజలకు ఫ్లాట్ల ప్రాజెక్టులో రూ.72 కోట్లు కొనుగోలుదారులు చెల్లించారు. 350 మంది అఖిలభారత సర్వీసు అధికారులు తమకిచ్చిన స్థలాలకు రూ.87.5 కోట్లు చెల్లించారు. అన్నింటికీ మించి రైతులు త్యాగాలు చేశారు. దాదాపుగా పూర్తికావస్తున్న రాజధానిని ఇప్పుడు తరలిస్తామనేందుకు వీలులేదు. అలా తరలిస్తే అది దేశ వృద్ధిరేటుపైనా ప్రభావం చూపిస్తుంది. కేంద్రానికీ కొన్ని హక్కులుంటాయి. అవేంటో అవసరమైన సందర్భంలో చెప్తాం' అని సుజనా స్పష్టం చేశారు.

### అదనపు ఖర్చెందుకు?

'అమరావతి నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు పెట్టే పరిస్థితుల్లో రాష్ట్రం లేదని మంత్రులు చెప్తున్నారు. ఒకప్పుడు చంద్రబాబు కూడా రాజధాని నిర్మాణానికి రూ.4లక్షల కోట్లు కావాలన్నారు. అంత డబ్బు అవసరం లేదు. రాజధాని నిర్మాణానికి మరో రూ.8వేల కోట్లు సరిపోతాయి. ఇంకా అదనంగా కావాలంటే డబ్బులున్నప్పుడే చిన్నగా నిర్మించుకోవచ్చు. డబ్బుల్లేవని అంటున్న ప్రభుత్వం అసలు తరలింపు పేరుతో అదనపు ఖర్చు పెట్టడమెందుకు? ఇక్కడ సచివాలయం ఉంది. హైకోర్టు నడుస్తోంది. ఒకవేళ హైకోర్టును కర్నూలుకు తీసుకెళ్లినా ఇబ్బంది లేదు. రాజ్‌భవన్ కూడా ఏర్పాటుచేశారు. గవర్నర్ ఏమైనా ఆ రాజ్‌భవన్ సరిపోవడం లేదన్నారా?' అని సుజనాచౌదరి ప్రశ్నించారు. పొరపాట్లు జరుగుతుంటాయని, ఇప్పటికైనా వాటిని సరిదిద్దుకుని ముందుకెళ్లాలని సూచించారు.

### విజయసాయి స్థాయిలేని వ్యక్తి

ఇన్‌సైడర్ ట్రేడింగ్ విషయంలో తనపైనా ఆరోపణలు చేశారని, సీబీసీఐడీ అధికారులు తన గ్రామంలో కూడా తిరిగి విచారించారని సుజనాచౌదరి చెప్పారు. కానీ ఎక్కడా ఒక్క తప్పు కూడా పట్టుకోలేకపోయారన్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ పేరిట అసెంబ్లీలో కూడా పలువురి పేర్లు చదివిన ముఖ్యమంత్రి జగన్... తన పేరు చదవలేకపోయారని, 'ఏమైనా భయమేమో' అని సుజన వ్యాఖ్యానించారు. ఇప్పుడు కొత్తగా సీబీఐ విచారణ అంటున్నారని, అంటే రాష్ట్రంలో పనికిరాని సీబీసీఐడీ వ్యవస్థ ఉందని అర్థమా? అని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి మీపై సీబీఐ విచారణ చేయాలని రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు కదా? అని ప్రశ్నించగా... 'విజయసాయిరెడ్డి స్థాయి లేని వ్యక్తి. అనుకోని పరిస్థితుల్లో నాయకుడైన మనిషి. సీబీఐ విచారణ చేయాలని గతంలోనే స్వాగతించిన వ్యక్తిని నేను. వైసీపీ గౌరవాధ్యక్షురాలు విజయమ్మ కేసు వేస్తే... అంతా స్టేకు వెళ్లారు. నేను స్టేకు కూడా వెళ్లకుండా స్వాగతించా. సాక్షి పత్రికలోనే కోటి రూపాయల ప్రకటన ఇచ్చి... ఎవరైనా వచ్చి విచారించుకోవచ్చని చెప్పా' అని గుర్తు చేశారు.

### బుగ్గనపై పరువునష్టం దావా: రావెల

సుజనాచౌదరిపై విమర్శలు చేసే స్థాయి విజయసాయిరెడ్డికి లేదని రావెల కిషోర్‌బాబు పేర్కొన్నారు. సుజనా కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు అరుణ్‌జైట్లీతో మాట్లాడి పలు నిధులను రాష్ట్రానికి తెచ్చారని, సాయిరెడ్డి రాష్ట్రానికి తెచ్చింది ఏముందని ప్రశ్నించారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసినట్లు మంత్రి బుగ్గన తనపై ఆరోపణలు చేశారని, మైత్రి సంస్థ పేరుతో తాను 40.48 ఎకరాలు కొన్నానని ఆరోపించారన్నారు. వీటికి ఆధారాలు బయటపెట్టాలని, లేకుంటే రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేస్తానని రావెల అన్నారు.

### తలదన్నేవాడు ఢిల్లీలో ఉన్నాడు!

'రాజధాని రైతులారా ఇది మీ ఒక్కరి సమస్య కాదు. ఇది రాష్ట్ర సమస్య. అధైర్య పడొద్దు. తాడిని తన్నేవాడు ఇక్కడ ఉంటే... తలను తన్నేవాడు ఢిల్లీలో ఉన్నాడు. చూస్తూ ఊరుకోం!"... ఇవీ రాజధాని రైతులను ఉద్దేశించి సుజనాచౌదరి చెప్పిన ఓదార్పు మాటలు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, ఒక ప్రభుత్వం రైతులకు హామీలు ఇచ్చి మరో ప్రభుత్వం కుదరదంటే కోర్టులు చూస్తూ కూర్చోవన్నారు. సీఆర్‌డీఏతో రైతులు చేసుకున్న ఒప్పందంలో నిబంధనలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేశామన్నారు. దాని ప్రకారం అభివృద్ధి చేస్తామంటేనే రైతులు భూములు ఇచ్చేందుకు సంతకాలు చేశారన్నారు. ప్రభుత్వం వెనక్కు తగ్గితే రైతులు లక్ష కోట్లు అడిగే హక్కు ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకొని నిర్మాణాలను ప్రారంభించారన్నారు. ఇప్పుడు వారు కోర్టుకు వెళితే భారీగా పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇదే జరిగితే ఏపీ మునిగిపోతుందని సుజన వ్యాఖ్యానించారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు, అక్రమాలకు వైసీపీ వారికి అవకాశం లేదనే విశాఖ మీద పడ్డారని ఆయన ఆరోపించారు.

### మోదీ మీ చెవిలో

# చెప్పారా?



మీ మాటేమైనా శాసనమా?
చంద్రబాబుకు తొత్తువా..?

- వ్యాపారం తప్ప మీకేం తెలుసు?.. సుజనాపై మంత్రి బొత్స ఆగ్రహం
- హైదరాబాద్‌ను తలదన్నేలా విశాఖ!.. 10 వేల కోట్లు ఖర్చుపెడితే చాలు
- బాబు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?.. అన్ని ప్రాంతాల అభివృద్ధికే హైపవర్ కమిటీ
- హోదా కోసం నిరంతర ఒత్తిడి: బొత్స

విశాఖపట్నం/శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ సుజనా చౌదరిపై మంత్రి బొత్స సత్యనారాయణ విరుచుకుపడ్డారు. 'టీడీపీ నుంచి ఇంకో పార్టీలో చేరిన ఓ నేత.. రాజధాని ఒక అంగుళం దాటినా బీజేపీ ఒప్పుకోదని అంటున్నారు. ఆయన మాటేమైనా శాసనమా? చంద్రబాబుకు తొత్తువా? లేకపోతే మోదీ నీకు చెవిలో చెప్పారా? ఎందుకు అలా ఘీంకరిస్తున్నావు' అని మండిపడ్డారు. ఆదివారం విశాఖలోని వైసీపీ కార్యాలయంలో, శ్రీకాకుళం మండలం రాగోలులో ఆయన మాట్లాడారు. సుజనా చౌదరికి వ్యాపారం చేసుకోవడం, ఆస్తులు పెంచుకోవడం తప్పితే అభివృద్ధి గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తొలి పది నగరాల్లో ఒకటైన విశాఖలో రూ.10 వేల కోట్లు ఖర్చుపెడితే హైదరాబాద్‌ను తలదన్నే నగరంగా తయారవుతుందని బొత్స అన్నారు. 'హైదరాబాద్‌లో ఏమేం ఉన్నాయి.. విశాఖలో ఏం చేస్తే ఆ స్థాయికి చేరుతుందనేది గుర్తించి ఆ మేరకు నిధులు కేటాయిస్తే సరిపోతుంది. అభివృద్ధి అంటే సచివాలయం, అసెంబ్లీ కాదని మాజీ సీఎం చంద్రబాబు గతంలో చెప్పారు.

ఇప్పుడు విశాఖలో సచివాలయం, సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తామంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రులు హైదరాబాద్‌ను కోల్పోతున్నామని, అలాంటి నగరాన్ని మనం తయారుచేసుకోగలమా అని ఆందోళన చెందారు. ఇప్పుడా మాటలు గుర్తు చేసుకుంటే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో విశాఖ మాత్రమే సరైనది చెప్పక తప్పదు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగానే కాకుండా, మంత్రిగా కూడా విశాఖ రాజధానిగా సరైనదనడంలో సందేహం లేదు. ఆదాయ వనరులు పెంచుకోవడానికి, రాష్ట్రానికి చేయూతగా ఉండడానికి విశాఖ అనుకూలం. అయితే చంద్రబాబు దీనిపై మాట్లాడుతున్న తీరు దురదృష్టకరం. వెనుకబడిన ఉత్తరాంధ్ర, కరువుతో అల్లాడుతున్న ప్రాంతాలను అభివృద్ధి చేయడం ఇష్టమో కాదో ఆయన చెప్పాలి. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినపుడల్లా రాజధానులు మారవు. అయినా జరిగిన తప్పులను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఉత్తరాంధ్రకు చెందిన అశోక్‌గజపతిరాజు ఐదేళ్లపాటు కేంద్ర మంత్రిగా పనిచేసి ఈ ప్రాంతానికి ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయారు' అని ఆరోపించారు.

### రాజధానిపై ఖర్చు 5,400 కోట్లేనా?

రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి రూ.1.95 లక్షల కోట్లు అప్పుతెచ్చి, దానిలో రాజధానికి రూ.5,400 కోట్లు మాత్రమే ఎందుకు ఖర్చుపెట్టాల్సి వచ్చిందో చంద్రబాబు చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. సీఎం జగన్ ఢిల్లీ వెళ్లినపుడల్లా ప్రత్యేకహోదా కోసం ఒత్తిడి తెస్తున్నారని, అది నిరంతరం కొనసాగుతుందన్నారు. జగన్ అసెంబ్లీ సమావేశాల ముగింపు రోజున విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉందని చెప్పారని, శనివారం విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు ఈ విషయాన్ని ఎందుకు ప్రకటించలేదని విలేకరులు ప్రశ్నించగా.. అసెంబ్లీ వేరు, విశాఖ పర్యటన వేరంటూ మంత్రి దాటవేశారు. చంద్రబాబు తన ఊసరవెల్లి రాజకీయాల కోసం అమరావతి ప్రాంత రైతులను రెచ్చగొట్టడం ఆపేయాలని కోరారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను పక్కనపెట్టిన ఆయన.. తన స్వార్థం కోసం అప్పటి రాష్ట్ర మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కమిటీ వేసి అమరావతిలో రాజధాని ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల కొంతమందికి లబ్ధి కలిగినా రాష్ట్రానికి తీరని నష్టాన్ని మిగిల్చిందని విమర్శించారు. రాజధాని ఏర్పాటుపై జగన్ ఇప్పటికే జీఎన్ రావు కమిటీ వేశారని, దీనితోపాటు మరింత అధ్యయనం చేసేందుకు బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూపునకు బాధ్యతలు అప్పగించారని, ఆ కమిటీ వచ్చేనెల 3న నివేదిక అందజేస్తుందన్నారు. ఆ రెండు కమిటీలు ఇచ్చిన నివేదికలను పరిశీలించిన తర్వాత రాజధానిపై రూట్ మ్యాప్ తయారుచేసి ఇచ్చేందుకు హైపర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ మూడు వారాల్లో సమగ్ర నివేదిక తయారుచేసి కేబినెట్‌కు అందజేస్తుందన్నారు. అక్కడ చర్చ జరిగాక అసెంబ్లీలో ప్రవేశపెట్టి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు., రాజధాని అంశం కొలిక్కి వచ్చాక కొత్త రాజధానుల అభివృద్ధికి విభజన చట్టం ప్రకారం రావలసిన నిధులను కేంద్రం నుంచి రాబడతామన్నారు.

### హిందూ ఆలయాలపైనే

## ప్రభుత్వ పెత్తనం ఎందుకు?

- ఏప్రిల్ 2న అయోధ్యలో శంకుస్థాపన
- మధుర, వారణాశి ఆలయాలనూ పరిరక్షించుకోవాలి
- టీటీడీలో ఆడిటింగ్ అస్తవ్యస్తం
- నిధుల దుర్వినియోగంపై సిట్‌తో విచారించాలి
- జగన్ పాలన భేష్: సుబ్రమణ్యస్వామి



తిరుమల, తిరుపతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మసీదులు, చర్చిల విషయాల్లో జోక్యం చేసుకోని ప్రభుత్వాలు హిందూ దేవాలయాలపైనే ఎందుకు పెత్తనం చెలాయిస్తున్నాయని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి ప్రశ్నించారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో, తిరుమలలో మీడియాతోనూ ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 4 లక్షలకు పైగా ఉన్న హిందూ దేవాలయాలను ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆదాయం పెరిగే ఆలయాలన్నింటినీ ప్రభుత్వాలు అధీనంలోకి తీసుకుంటున్నాయన్నారు. లౌకిక ప్రభుత్వాలు ఏ మతానికి చెందిన ప్రార్థనాలయాల్లోనూ జోక్యం చేసుకోరాదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ప్రభుత్వాలకు ఆలయాల ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దే అధికారం మాత్రమే ఉంది తప్ప, ఇతర అంశాల్లో జోక్యం చేసుకునే అవకాశం లేదన్నారు. కానీ దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను పూర్తిగా సివిల్ సర్వెంట్లతో ప్రభుత్వాలు నడిపిస్తున్నాయని, వారికి పూజారుల విధుల గురించి ఏమాత్రం అవగాహన ఉండటం లేదన్నారు. ప్రభుత్వ పెత్తనం తప్పించి స్వతంత్రంగా నడిపించేందుకే దేశవ్యాప్తంగా సేవ్ టెంపుల్స్ ఉద్యమం మొదలుపెట్టామన్నారు. అయోధ్యలో రామజన్మభూమి తరహాలోనే మధుర, వారణాశి ఆలయాలను కూడా పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 2న అయోధ్యలో రామమందిర నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. ఏపీలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆశాజనకంగా పాలిస్తోందని, గత పాలనలో జరిగిన అవినీతిని తిరగదోడి సరిచేయడానికి పూనుకుందని కితాబిచ్చారు. తిరుమలను క్రైస్తవ కేంద్రంగా మారుస్తున్నారంటూ జగన్‌పై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్యమతస్తుడంటూ చేసిన ప్రచారంలో వాస్తవంలేదన్నారు. శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకలకు లెక్కలు లేవని, టీటీడీలో ఆడిటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. గడిచిన ఐదేళ్లలో స్వయం ప్రతిపత్తి సంస్థ ద్వారా ఆడిటింగ్ జరగలేదన్నారు. టీటీడీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సిట్‌తో విచారణ చేయాలని సీఎం జగన్‌ను కోరానని చెప్పారు. టీటీడీని అన్యమతస్తులతో నింపారని ప్రచారం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరిగితే మొదట తానే స్పందిస్తానన్నారు. టీటీడీలో 44మంది సిబ్బందిని అన్యమతస్తులుగా గుర్తించారని, వారిని తొలగిస్తామని అధికారులు చెప్పారని వివరించారు.

### టీటీడీలో హిందువులే ఉండాలి: పరిపూర్ణానంద

22 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్న టీటీడీలో హిందువులే ఉద్యోగులుగా ఉండాలని కాకినాడ శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద స్పష్టం చేశారు. సీఎం జగన్ ఇతర మతాల వారికి క్రైస్తవ మిషనరీలు, చర్చిలలో ఉద్యోగాలు ఇచ్చుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. హిందూ దేవాలయాలు రాజకీయాలకు అడ్డాగా మారకూడదన్నారు.

ఏడాది కాలం కరిగిపోయింది! మరికొన్ని గంటల్లో 2019 కూడా 'చరిత్ర'లో కలిసిపోతోంది. కాలమనే కాన్వాస్‌పై ఈ సంవత్సరం కూడా చెరిగిపోని అనేక ముద్రలు వేసింది. ఇంకా చెప్పాలంటే... ఆధునిక భారత చరిత్రను మలుపు తిప్పిన, మార్చివేసిన అనేక ఘటనలకు 2019 వేదికైంది. ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, ఆర్టికల్ 370 రద్దు, రూపు మార్చుకున్న జమ్మూ కశ్మీర్, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్య తీర్పు... ఇలా ఎన్నెన్నో విశేషాలు! అనేక మెరుపులు... కొన్ని మరకలు! ఒక్కసారి పునరావలోకనం చేసుకుంటే... 'ఔను... ఇది ఈ ఏడాదిలోనే జరిగింది కదా!' అనే విస్మయం!




# 2019 కదిలే కాలం... చెదరని జ్ఞాపకం

## మోదీ... ఔర్ ఏక్ బార్!

సార్వత్రిక ఎన్నికల పండుగ! మోదీ మళ్లీ గెలుస్తారా? లేక... కాంగ్రెస్‌ను రాహుల్ గెలిపిస్తారా? యావద్భారతాన్ని ఈ ప్రశ్న ఊపేసింది. 2019 ఏప్రిల్ 11తో మొదలుపెట్టి ఏడు విడతల్లో మే 19వరకు పోలింగ్ జరిగింది. మే 23వ తేదీన ఫలితాలు వచ్చాయి. మోదీ-షా మ్యాజిక్ పని చేసింది. కమల దళం అంచనాలకు మించి స్థానాలు గెలుపొందింది. మిత్రులతో సంబంధం లేకుండా బీజేపీయే సొంతంగా 303 చోట్ల నెగ్గింది. ఇక... కాంగ్రెస్‌కు కొత్త కళ తెస్తాడనుకున్న రాహుల్ గాంధీ రెండుచోట్ల పోటీ చేయగా... అమేఠీలో ఓటమి పాలయ్యారు. వయనాడులో గెలుపు సాధించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితం కమల దళానికి కొత్త ఊపు తెచ్చింది. దశాబ్దాలుగా 'పెండింగ్'లో ఉన్న తన అజెండాను అమలు చేసేందుకు సిద్ధమైంది.

## ధనాధన్... అభినందన్



ఫిబ్రవరి 14... కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా లెత్‌పొరా ప్రాంతం! సీఆర్పీఎఫ్ బలగాల వాహనంపై ఆత్మాహుతి దాడి జరిగింది. వాహనం తుత్తునియలైపోయింది. 40మంది జవాన్లు బలైపోయారు! ఇది పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పనే అని స్పష్టమైంది. యావద్భారతం రగిలిపోయింది. పాక్ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పి తీరాల్సిందే అని సర్కారు నిర్ణయించుకుంది. ఫిబ్రవరి 26వ తేదీన మన యుద్ధ విమానాలు నియంత్రణ రేఖను దాటి... పాక్ ఆధీనంలోని బాలాకోట్ పరిధిలో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో పెద్దసంఖ్యలో ఉగ్రవాదులు మరణించినట్లు భారత్ ప్రకటించింది. కానీ, తమకు ఎలాంటి నష్టం జరగలేదని పాక్ బుకాయించింది. అంతేకాదు, ఆ మరుసటి రోజునే ఒక దుస్సాహసానికి ఒడిగట్టింది. ఎఫ్-16లతో మన దేశ గగనతలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీనిని మన వైమానికదళం గట్టిగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో అభినందన్ వర్ధమాన్ మిగ్-21 బైసన్ విమానం నడుపుతూ ఒక ఎఫ్-16ను కూల్చివేశారు. ఇదే క్రమంలో ఆయన విమానం అదుపుతప్పి... పాక్ భూభాగంలో పడిపోయింది. అభినందన్‌ను పాక్ సైన్యం అదుపులోకి తీసుకుంది. ఈ వార్త ఇరు దేశాలతో పాటు ప్రపంచమంతా సంచలనం సృష్టించింది. భారత్‌తో పాటు అంతర్జాతీయ దౌత్య ఒత్తిడికి పాక్ తలొగ్గక తప్పలేదు. మార్చి 1న అభినందన్‌ను అత్యంత మర్యాదతో భారత్‌కు తిరిగి అప్పగించింది. పాక్ సైన్యం అదుపులో ఉన్నప్పటికీ అభినందన్ నిబ్బరంగా ఉన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు... 'సారీ... నేను దీనికి సమాధానం ఇవ్వకూడదు' అని తెలిపారు. టీ ఎలా ఉంది... అని అడిగినప్పుడు 'టీ ఈజ్ ఫెంటాస్టిక్' అని చెప్పారు. ఈ డైలాగ్‌తో పాటు... అభినందన్ మీసాలు యూత్‌లో కొత్త ట్రెండ్ సృష్టించాయి.




అఖండ గోదావరి మధ్య అందమైన దృశ్యాన్ని ఆవిష్కరించేవి పాపికొండలు! ఆ విహారయాత్ర పెను విషాద యాత్రగా మారింది. సెప్టెంబరు 15వ తేదీన 77 మంది పర్యాటకులతో బయలుదేరిన పర్యాటక పడవ... కచ్చులూరు వద్ద మునిగిపోయింది. 46మంది మృతదేహాలు లభించగా... మరో ఐదుగురి ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదు. గోదావరిలో జరిగిన అతి ఘోరమైన ప్రమాదాల్లో ఇదీ ఒకటి. బాధితుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు.

## సరిలేరు నీకెవ్వరూ!

వాట్సాప్ పరిచయం ప్రేమగా మారింది. అమ్మాయి ఒంటరిగా ఉన్నప్పుడు ఇంటికి వెళ్లాడు. మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చాడు. ఆమె మత్తులోకి జారుకోగానే.... ఘోరానికి ఒడిగట్టాడు. కిచెన్‌లోకి వెళ్లి మొత్తం ఉల్లిపాయలు తీసుకెళ్లాడు!... ఇలా ఉల్లిపాయలపై సోషల్ మీడియాలో వచ్చిన జోకులు ఎన్నెన్నో! ఈ ఏడాది ఉల్లి ధర సెంచరీ దాటి... కొన్ని రాష్ట్రాల్లో రూ.200కు కూడా చేరింది. ఇప్పటికీ రూ.100 వరకు పలుకుతోంది.




## చట్టం

తేనెతుట్టెను కదిలించినట్లే... కొరివితో తల గోక్కున్నట్లే... అని దశాబ్దాలుగా అనుకుంటున్న వాటినే మోదీ సర్కార్ కదిలించింది. అనుకున్నది సాధించింది. దశాబ్దాలుగా తన అజెండాలో ఉన్న 'ఆర్టికల్ 370'ని రద్దు చేసింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించింది. అంతేకాదు... లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించింది. జమ్మూ కశ్మీర్‌లోనూ ప్రస్తుతానికి రాష్ట్రపతి పాలన విధించింది. మరో అత్యంత వివాదాస్పద అంశమైన పౌరసత్వ సవరణ బిల్లును కూడా ఆమోదించింది. బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్‌లలో మతపీడనను భరించలేక మన దేశానికి వచ్చే ముస్లిమేతరులకు పౌరసత్వం ఇస్తామని ప్రకటించింది. ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, తక్షణ తలాక్ బిల్లులకు ఆమోదం వంటి సంచలన చట్టాలూ 2019లోనే అమలులోకి వచ్చాయి.






ఢిల్లీలో శీతాకాలపు చలి! మరికాసేపట్లో తెల్లారుతుంది. అంతలోనే... అగ్గి రాజుకుంది. నాలుగంతస్తుల భవనంలో... నిద్రిస్తున్న వలస కార్మికులను చుట్టుముట్టింది. మంటలు... దట్టమైన పొగ! బయటికి వచ్చే దారి కనిపించలేదు. ఊపిరాడక కొందరు, మంటల్లో కొందరు... మొత్తం 43 మంది మరణించారు. డిసెంబరు 8వ తేదీ ఢిల్లీలోని అనాజ్‌మడీలో జరిగిన దారుణమిది.

## ఈ ఏటి పదం... ప్లాగింగ్

జాగింగ్ తెలుసు... ఫాగింగ్ తెలుసు! మరి... ఈ ప్లాగింగ్ ఏమిటి? అని చాలా మంది నెట్‌లో వెతికేశారు. ప్లాగింగ్ అంటే... అలా జాగింగ్/వాకింగ్ చేస్తూ, దారిలో కనిపించే చెత్తా చెదారాన్ని ఏరివేయడం! ఆరోగ్యానికి ఆరోగ్యం... పర్యావరణానికి హితం! మహాబలిపురం సముద్ర తీరంలో ప్రధాని మోదీ ఇదే పని చేశారు. అక్టోబరు 12న ఆయన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. మరుసటి రోజు బీచ్‌లో నడుస్తూ 'ప్లాగింగ్' చేశారు.

## మాటల మంట



రాజకీయ నాయకులన్నాక అప్పుడప్పుడు నోరు జారడం మామూలే. కానీ... బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ తన వివాదాస్పద వ్యాఖ్యలతో అనేకసార్లు వార్తల్లోకి వచ్చారు. "మాలేగావ్ పేలుళ్ల కేసులో నన్ను ఇరికించి, హింసించిన ఏటీఎస్ చీఫ్ హేమంత్ కర్కరే నా శాపం వల్లే ముంబై ముట్టడిలో మరణించారు" అని ఎన్నికల సమయంలో వ్యాఖ్యానించారు. అరుణ్‌జైట్లీ, సుష్మా స్వరాజ్, మనోహర్ పర్రీకర్... ఇలా బీజేపీ నేతల వరుస మరణాలకు కాంగ్రెస్ 'చేతబడే' కారణమని మరోసారి అన్నారు. ఇక... మహాత్మా గాంధీని హత్యచేసిన నాథూరాం గాడ్సేను దేశభక్తుడిగా అభివర్ణించారు. తాజాగా... విమానంలో సిబ్బందితో, ప్రయాణికులతో వాగ్వాదానికి దిగి మరోసారి వార్తల్లోకి వచ్చారు.



## న్యాయం



స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన, అతి సుదీర్ఘమైన కేసు.... అయోధ్య! ఈ వివాదానికి 2019లో తెరపడింది. ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం నవంబరు 9న సంచలన తీర్పు చెప్పింది. వివాదాస్పద స్థలం రామ్‌లల్లాకే చెందుతుందని స్పష్టం చేసింది. దీనిపై తర్వాత దాఖలైన రివ్యూ పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇక... శబరిమల ఆలయానికి అన్ని వయసుల మహిళలను అనుమతించడంపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు 'వాయిదా' వేసింది. ఈ అంశం ఒక్క శబరిమలకు మాత్రమే పరిమితం కాదని, కొన్ని ఇతర ఆలయాలు, మసీదులు, దర్గాల్లోకీ మహిళలను అనుమతించరని తెలిపింది. ఈ సంగతి తేల్చాల్సిన బాధ్యతను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించింది.

## సెలవంటూ వెళ్లి పోయారు

నిబద్ధత, సమర్థత, కార్యశీలత... వీటికి మారుపేర్లే మనోహర్ పర్రీకర్, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్! బీజేపీలోని ముఖ్యనేతలైన ఈ ముగ్గురూ 2019లోనే తిరిగిరాని లోకాలకు తరలిపోయారు. బీజేపీకే చెందిన అనంతకుమార్ కూడా కన్నుమూశారు. వీరితోపాటు... టీఎన్ శేషన్, రామ్ జెఠ్మలానీ, జైపాల్ రెడ్డి, షీలా దీక్షిత్, జార్జి ఫెర్నాండెజ్ తదితరులు తుది శ్వాస వదిలారు.











## మిస్ యూ 'మామా'

చందమామ రావే... జాబిల్లి రావే... అని పాడుకున్నాం! ఆ చందమామను చేరుకోవాలని ప్రయత్నించాం. కానీ... చందమామ కొంచెంలో మిస్ అయ్యాడు! భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 'చంద్రయాన్-2'ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇస్రో బాహుబలిగా పిలుచుకునే జీఎస్ఎల్వీ మార్క్3ఎం1 జూలై 15వ తేదీన ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేసింది. కానీ... కౌంట్‌డౌన్ ముగిసేందుకు 56 నిమిషాల ముందు చిన్న సాంకేతిక లోపం బయటపడటంతో, ప్రయోగాన్ని నిలిపివేసింది. ఆ లోపాన్ని సరిదిద్ది జూలై 22వ తేదీ మధ్యాహ్నం 2.43 గంటలకు మళ్లీ ప్రయోగాన్ని చేపట్టింది. ఈసారి ప్రయాణమంతా, ప్రతి దశా సాఫీగా సాగిపోయింది. సెప్టెంబరు 2న చంద్రకక్ష్యలో ఆర్బిటర్ నుంచి విక్రమ్ ల్యాండర్, రోవర్లు విడిపోయాయి. 48 రోజుల్లో 382 లక్షల కిలోమీటర్ల ప్రయాణం సాగింది. సెప్టెంబరు 6వ తేదీ అర్ధరాత్రి దాటాక... మరో మూడు నిమిషాల్లో చంద్రుడు చిక్కేవాడే! కానీ... చంద్రుడి ఉపరితలానికి 2.1 కిలోమీటర్ల ఎత్తు నుంచి చంద్రయాన్-2 మాడ్యూల్ కుప్పకూలిపోయింది. ఈ ఘటన శాస్త్రవేత్తలను, యావత్ భారతీయులనూ కంటతడి పెట్టించింది. ఈ స్వల్ప వైఫల్యం మినహాయిస్తే... ఇస్రో ఈ ఏడాది 5 రాకెట్లను ప్రయోగించింది. వీటిద్వారా 50 విదేశీ, 6 స్వదేశీ ఉపగ్రహాలను నింగిలోకి పంపింది.

## భళా మేళా

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) త్రివేణీ సంగమంలో 2019 జనవరిలో అర్ధ కుంభమేళా జరిగింది. ఈ మహా ఆధ్యాత్మిక సంబరంలో దాదాపు 12 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. కుంభ్ నిర్వహణకు ఉత్తరప్రదేశ్‌లోని యోగి సర్కారు కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేసింది. ట్రాఫిక్ నిర్వహణ, నగర సుందరీకరణ, పారిశుధ్య ఏర్పాట్లు.... ఈ మూడు అంశాల్లో గిన్నిస్ రికార్డు సృష్టించింది.



## ఈ ఏటి ఫొటో

నిండా కాషాయం కప్పుకుని... గుహలో ధ్యానం చేస్తున్న మోదీ చిత్రమిది! కేదార్‌నాథ్ సమీపంలో ఏర్పాటు చేసిన 'పాక్షిక కృత్రిమ' గుహ పేరు... 'రుద్ర ధ్యాన గుహ'. ఇందులో మే 18వ తేదీన ప్రధాని ధ్యానం చేశారు.



## దిశ... దశ



'నిర్భయ' తర్వాత దేశాన్ని కదిలించిన ఘోరమైన ఘటన.. దిశపై అత్యాచారం, హత్య! హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్‌పై వెటర్నరీ వైద్యురాలు దిశ (అసలు పేరు వేరే) బైక్‌లో గాలి తీసి, సహాయం చేస్తామని నమ్మించిన నలుగురు దుర్మార్గులు ఆమెపై అత్యాచారం చేశారు. చంపేసి... ఆనవాళ్లు కనిపించకుండా పెట్రోలు పోసి తగలబెట్టారు. ఈ ఘోరం తెలుగు రాష్ట్రాలతోపాటు మొత్తం దేశాన్ని కదిలించింది. 'జస్టిస్ ఫర్ దిశ' అని నినదించింది. నవంబరు 27న ఈ సంఘటన జరగగా... డిసెంబరు 6వ తేదీన నలుగురు నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఆ తర్వాత... ఆంధ్రప్రదేశ్‌లో అత్యాచార కేసుల్లో స్పష్టమైన ఆధారాలుంటే మూడు వారాల్లోనే దోషులకు ఉరి శిక్ష విధించేలా కొత్త చట్టం చేశారు. దీనికి 'దిశ' అని పేరు పెట్టారు.

— (సెంట్రల్ డెస్క్)



## హారతి ఇచ్చిందని టీవీ పగలగొట్టాడు

### అఫ్రీది దుందుడుకు చర్య



**లాహోర్:** పాకిస్థాన్ జట్టులో హిందూ క్రికెటర్ అయిన డానిష్ కనేరియాపై మత వివక్ష చూపారనే చర్చ ఓవైపు సాగుతుండగానే మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రీదికి సంబంధించి రెండేళ్ల క్రితం నాటి ఓ వివాదాస్పద వీడియో వెలుగులోకి వచ్చింది. దీంట్లో హిందూ సంప్రదాయాలను అఫ్రీది ఎగతాళి చేయడం కనిపించింది. అలాగే కూతురు టీవీ ముందు హారతి ఇచ్చినందుకు తాను టీవీని ఎలా పగలకొట్టిందీ వివరించాడు. దీనికి ఆ చాట్‌షోలో కూర్చున్న అమ్మాయిలంతా చప్పట్లతో మద్దతు పలికారు. 'స్టార్ ప్లస్‌లో వచ్చే హిందీ సీరియళ్లను కూతురుతో కాకుండా ఒంటరిగా చూడమని నా భార్యకు చెబుతుంటాను. అయితే ఓసారి నేను బయట నుంచి వచ్చే సరికి నా కూతురు టీవీలో వస్తున్న హారతిని అనుకరిస్తూ తను కూడా అలాగే చేస్తూ కనిపించింది. దీంతో నాకు చిర్రెత్తుకొచ్చి ఆ టీవీని పగలగొట్టా' అని అఫ్రీది తెలిపాడు. ఈ చిన్న బిట్‌ను భారత అభిమాని ఒకరు ట్విటర్‌లో పోస్ట్ చేయగా.. నెటిజన్లు పాక్ మాజీ ఆల్‌రౌండర్‌పై విరుచుకుపడ్డారు. అఫ్రీది వ్యాఖ్యలను బట్టి చూస్తే పాకిస్థాన్‌లో సెక్యులరిజం ఏ విధంగా ఉందో గమనించాలంటున్నారు.

## ఫైనల్లో హుస్సాముద్దీన్

- నేడు గౌరవ్‌తో అమీతుమీ
- ఒలింపిక్ క్వాలిఫయర్ ట్రయల్స్



**బెంగళూరు:** తెలంగాణకు చెందిన యువ బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించేందుకు అడుగుదూరంలో నిలిచాడు. ఫిబ్రవరిలో చైనా వేదికగా జరిగే ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టు కోసం ఆదివారం సెలెక్షన్ ట్రయల్స్ ప్రారంభమయ్యాయి. ఇందులో 57 కిలోల విభాగం నుంచి పోటీపడ్డ హుస్సాముద్దీన్ ప్రిలిమినరీ బౌట్‌లో 6-3 స్కోరు తేడాతో సచిన్ సివాచ్‌ను చిత్తు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సోమవారం జరిగే తుదిబౌట్‌లో గౌరవ్ సోలంకితో హుస్సాముద్దీన్ తలపడతాడు. మరో బౌట్‌లో సోలంకి 6-3తో కవీందర్‌ను ఓడించాడు. 69 కిలోల విభాగంలో వికాస్ క్రిషన్, దుర్యోధన్ నేగి ఫైనల్ చేరారు. 91 కిలోల నుంచి నవీన్ కుమార్, నమన్ తన్వర్ తుదిపోరులో నిలిచారు. 75 కిలోల విభాగం ఫైనల్ బౌట్‌లో ఆశిష్ కుమార్ 9-0తో అంకిత్‌పై, +91 కిలోల్లో సతీష్ 6-3తో నరేందర్‌పై గెలిచి ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించారు.

## హంపికి అభినందన

**అమరావతి (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ మహిళల చెస్ ర్యాపిడ్ చాంపియన్‌గా నిలిచిన కోనేరు హంపికి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఈ విజయంతో హంపి తెలుగు ప్రజల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు.

## బ్లిట్జ్‌లోనూ జోరు

**మాస్కో:** ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ర్యాపిడ్ విభాగంలో విజేతగా నిలిచిన తెలుగమ్మాయి కోనేరు హంపి.. ఇదే టోర్నీ బ్లిట్జ్ కేటగిరీలోనూ టైటిల్ దిశగా దూసుకెళుతోంది. ఆదివారం మొదలైన ఈ విభాగంలో తొలిరోజు తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి హంపి ఏడు పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. ఆరు రౌండ్లు గెలిచిన హంపి.. రెండింటిని డ్రాగా ముగించి, మరో రౌండ్‌లో ఓటమిపాలైంది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక 6.5 పాయింట్లతో 12వ స్థానంలో కొనసాగుతోంది. 5 రౌండ్లు గెలిచి, మూడింటిని డ్రా చేసుకొన్న హారిక.. ఓ రౌండ్‌లో ఓడింది. ఇక.. పురుషుల విభాగంలో తెలుగు కుర్రాడు హర్ష భరత్‌కోటి 3.5 పాయింట్లతో 155వ స్థానంలో నిలిచాడు.



కోనేరు హంపి

# ఆ ఒక్కటే మిగిలింది

**భారత చెస్ క్వీన్ కోనేరు హంపి రికార్డుల పుటలో మరో కలికితురాయి చేరింది. మాస్కో వేదికగా జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ర్యాపిడ్ విభాగంలో పసిడి పతకం కైవసం చేసుకొని చరిత్ర సృష్టించిందీ తెలుగు క్రీడాకారిణి. మూడేళ్ల కిందట 2600 ప్లస్ ఎలో రేటింగ్ పాయింట్లతో కెరీర్‌లో ఉచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు అనూహ్యంగా ఆటకు బ్రేక్ ఇచ్చిన ఈ చెస్ క్వీన్ పునరాగమనంలోనూ అంతే స్పీడ్‌తో దూసుకుపోతోంది. ఒక పాపకు జన్మనిచ్చి కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మరోవైపు చెస్ కదనరంగంలో ప్రత్యర్థులకు దడ పుట్టిస్తోంది ఈ తొలి తెలుగు మహిళా గ్రాండ్‌మాస్టర్. తాజా ప్రదర్శనతో ప్రపంచ టైటిల్ కల నెరవేర్చుకున్న హంపి.. నెంబర్‌వన్‌గా నిలవడమే తన ముందున్న లక్ష్యమని చెబుతోంది.**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** మూడేళ్ల విరామానంతరం ఈ ఏడాది జూన్‌లో తన సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించిన హంపి తొలుత తడబడినా.. ఆ తర్వాత పుంజుకొని విజయాల బాట పట్టింది. గత సెప్టెంబరులో మొనాకో గ్రాండ్ ప్రీ సాధించి గెలుపు ట్రాక్ ఎక్కిన ఆమె వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంక్ సాధించాలనే తన చిరకాల స్వప్నం దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. మాస్కో ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్ డాగ్‌గా బరిలోకి దిగిన హంపి ప్రత్యర్థుల ఎత్తులు, అంచనాలను చిత్తు చేస్తూ అనూహ్యంగా ఫైనల్ చేరింది. రసవత్తరంగా సాగిన ఫైనల్లో ఒక దశలో ప్రత్యర్థి లీ టింగ్‌జి (చైనా) డ్రా చేసుకుందామని సంకేతమిచ్చినా విజయం కోసం రాజీపడేది లేదంటూ తుదివరకు పోరాడి ఫలితం రాబట్టింది. మొత్తానికి భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన రెండో భారతీయురాలిగా, తొలి మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా హంపి చరిత్రకెక్కింది.

### అపూర్వమైన విజయమిది

'ఇది వేడుక చేసుకోవాల్సిన సమయం. ఈ టైటిల్ చాలా అపురూపమైనది. పాపకు జన్మనిచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లు ఆటకు పూర్తిగా దూరమయ్యా. దీంతో నా ఆట కొంతమేర గాడి తప్పింది. కొంత అసంతృప్తిగా ఫీలయ్యా. ఇటీవల మొనాకో గ్రాండ్ ప్రీ నెగ్గడం ఉత్సాహాన్నిచ్చింది. ఈ విజయం ఇచ్చిన ఆత్మ విశ్వాసంతో ప్రపంచ టోర్నీకి సిద్ధమయ్యా. ఇన్నాళ్లూ అందని ద్రాక్షలా మిగిలిన ప్రపంచ టైటిల్‌ను అందుకున్నా. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ సాధించాలన్న లక్ష్యంతో కొంతకాలంగా కఠోరంగా చేస్తున్న సాధనకు ప్రతిఫలం దక్కింది. కెరీర్‌లో తొలి వరల్డ్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నందుకు ఆనందంగా ఉంది. క్లాసిక్ చెస్‌లో మాదిరి ర్యాపిడ్, బ్లిట్జ్ గేమ్‌ల్లో అంతగా నైపుణ్యం లేకపోయినప్పటికీ.. హేమాహేమీలను ఓడించి టైటిల్ సొంతం చేసుకోవడం చాలా గొప్పగా అనిపిస్తోంది. గతంలో అత్యుత్తమంగా ప్రపంచ రెండో ర్యాంకులో నిలిచా. ఇక.. వరల్డ్ నెంబర్ వన్‌గా నిలవడమే నా ముందున్న టార్గెట్. అమ్మానాన్నలతో పాటు భర్త అన్వేష్ ఇస్తున్న ప్రోత్సాహంతోనే కెరీర్‌లో రాణించగలుగుతున్నా. నన్ను ఆదరిస్తున్న అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు.' అని హంపి వివరించింది.



అమిత్ పంఘాల్

**ఓవైపు చరిత్రలో నిలిచిపోయే ప్రదర్శనతో అమిత్ పంఘాల్ భారత బాక్సింగ్‌ను ఓ మెట్టు పైకి ఎక్కించగా.. మరో వైపు ఎంపిక వివాదాలకు తోడు పేరున్న బాక్సర్లు కూడా డోపింగ్‌లో దొరికిపోయి ఆటకు కళంకం తెచ్చారు. అటు ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో విజేందర్ సింగ్ అజేయ ప్రదర్శనను కొనసాగించాడు. ఇక దేశవ్యాప్తంగా కుతూహలం రేపిన మేరీ కోమ్.. నిఖత్ జరీన్ బౌట్‌లో ఉద్రిక్త పరిస్థితులే నెలకొన్నాయి. ఇలా ఈ ఏడాది బాక్సింగ్‌లో కాస్త వెనకడుగు ఉన్నా ఎక్కువ శాతం విజయాలతోనే గడిచిపోవడం శుభపరిణామం.**

రివైండ్ 2019

## వివాదాలున్నా...

# అదరగొట్టారు

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఈ ఏడాది మెరుపుల విషయానికి వస్తే.. భారత బాక్సింగ్‌లో 23 ఏళ్ల అమిత్ పంఘాల్ తన అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. పురుషుల వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలిసారిగా రజతం అందించి చరిత్ర సృష్టించాడు. అలాగే దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ కూడా టాప్ ఫామ్‌లో కొనసాగి అంతర్జాతీయంగా పతకాలు సాధించింది. ఇక విజేందర్ సింగ్ తన శక్తివంతమైన పంచ్‌లకు నిలదొక్కుకునే మరో ప్రో బాక్సర్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఇదంతా నాణేనికి ఓవైపు అయితే మరో వైపు ఒలింపిక్ క్వాలిఫయర్ ట్రయల్స్ కోసం బాక్సర్ల ఎంపిక వివాదాస్పదంగా మారింది. మేరీ కోమ్‌ను నేరుగా తీసుకోవడంపై నిఖత్ పోరాటం అందరి దృష్టినీ ఆకర్షించింది. మహిళా బాక్సర్ నీరజ్ ఫొగట్‌తో పాటు పురుషుల్లో సుమిత్ సంగ్వాన్ డోపింగ్‌లో విఫలమై అందరినీ షాక్‌కు గురిచేశారు.

### స్ట్రాండ్జా మెమోరియల్‌లో..

సీజన్ ఆరంభంలోనే యూరప్‌లో అతి పురాతనమైన టోర్నీగా పేరున్న స్ట్రాండ్జా మెమోరియల్‌లో భారత బాక్సర్లు పతకాలతో మెరిశారు. కెరీర్‌లో చివరిసారిగా 49కేజీల విభాగంలో తలపడి అమిత్ పంఘాల్ స్వర్ణం సాధించి పుల్వామా ఉగ్రదాడుల్లో అమరులైన జవాన్లకు అంకితమిచ్చాడు. అటు తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్, మీనా కుమారి దేవి మహిళల విభాగాల్లో విజేతగా నిలిచారు.

### ఆసియా చాంపియన్‌షిప్‌లో..

ఏప్రిల్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ భారత బాక్సర్ల సంతృప్తికర ప్రదర్శన కొనసాగింది. ఇక తొలిసారి 52 కేజీల విభాగంలోకి మారిన తర్వాత పాల్గొన్న ఈ ఈవెంట్‌లోనూ అమిత్ స్వర్ణంతో సత్తా నిరూపించుకున్నాడు. మహిళల్లో పూజా రాణి (81కేజీ) కూడా అత్యుత్తమ ప్రదర్శనతో దేశానికి రెండో స్వర్ణం అందించింది. ఓవరాల్‌గా ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఏడు కాంస్యాలతో మొత్తం 13 పతకాలు దక్కించుకుంది. ప్రపంచ చాంపియనషిప్స్ సన్నాహకాల కోసం మేరీ కోమ్ ఈ టోర్నీలో పాల్గొనలేదు.

### అమిత్ చరిత్ర..

ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్ తరపున అమిత్ పంఘాల్ రికార్డు ప్రదర్శన కనబరిచాడు. పురుషుల విభాగంలో రజతం సాధించిన ఏకైక బాక్సర్‌గా నిలిచాడు. విజేందర్‌సింగ్, వికాస్ క్రిషన్, శివ థాపా, గౌరవ్ బిధూరి గతంలో కాంస్యాలతోనే సరిపెట్టుకున్నారు. అయితే అమిత్ మాత్రం తొలిసారి ఫైనల్లో ప్రవేశించగలిగాడు. మహిళల నుంచి 20 ఏళ్ల మంజు రాణి (48 కేజీ) కూడా రజతం సాధించింది. 51 కేజీల విభాగంలో మేరీ కోమ్ కాంస్యం సాధించింది. ఈ టోర్నీలో స్వర్ణం, రజతాలు సాధించిన బాక్సర్లకు ఒలింపిక్ అర్హత టోర్నీలో నేరుగా ఆడిస్తామని భారత బాక్సింగ్ సమాఖ్య ప్రకటించింది. మొత్తంగా పురుషుల్లో ఓ రజతం, ఓ కాంస్యం రాగా, మహిళల విభాగం ఒక రజతం, మూడు కాంస్యాలతో ఆధిక్యం ప్రదర్శించింది.

### డోపింగ్ కలకలం..



నిఖత్

ఈ ఏడాది చివర్లో ఇద్దరు ప్రముఖ బాక్సర్లు డోపింగ్‌లో దోషులుగా తేలడం కలకలం రేపింది. స్ట్రాండ్జా మెమోరియల్‌లో కాంస్యం సాధించిన మహిళా బాక్సర్ నీరజ్ ఫొగట్ (57 కేజీ) నిషేధిత ఉత్ప్రేరకం లిగాండ్రోల్ తీసుకున్నట్టు తేలడంతో తాత్కాలిక నిషేధం విధించారు. అలాగే స్టార్ బాక్సర్ సుమిత్ సంగ్వాన్ (91కేజీ) కూడా రెండు నెలల క్రితం డోపింగ్ టెస్టులో పాజిటివ్‌గా తేలాడు. దీంతో ఈనెల 27న అతడిపై సమాఖ్య ఏడాది నిషేధం విధించింది. దీంతో ఒలింపిక్ క్వాలిఫయర్స్ ట్రయల్స్‌కు అతడు దూరం కానున్నాడు.

### ఎంపిక వివాదం..

మహిళల ఒలింపిక్ ట్రయల్స్‌కు మేరీ కోమ్‌ను నేరుగా ఎంపిక చేయడంపై తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ చేసిన పోరాటం భారత బాక్సింగ్‌లో చర్చనీయాంశమైంది. ఇండియా ఓపెన్, ఇండోనేషియా టోర్నీలో స్వర్ణాలు సాధించడంతో ఆమెను ఎంపిక చేశామని సమాఖ్య తెలిపింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న తీరుపై జోక్యం చేసుకోవాలని క్రీడా మంత్రికి కూడా జరీన్ లేఖ రాసింది. ఎట్టకేలకు ఇటీవల ట్రయల్స్ జరిగినా 51 కేజీ విభాగం ఫైనల్ బౌట్‌లో నిఖత్‌ను మేరీ కోమ్ ఓడించింది. అయితే ఆ తర్వాత మేరీ ఆమెతో ప్రవర్తించిన తీరు కారణంగా ఈ ఏడాది కాస్త వివాదాస్పదంగానే భారత బాక్సింగ్ ముగిసినట్టయింది.

## వాళ్లలా డబ్బుల కోసం దేశం పరువు తీయలేదు



కనేరియా

**లాహోర్:** డబ్బు కోసం ఫిక్సింగ్‌కు పాల్పడిన వారిని సైతం పాకిస్థాన్ జట్టులోకి ఆహ్వానిస్తున్నారని మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా ఆరోపించాడు. తాను రక్తం చిందించి జట్టు కోసం సేవలందించానని గుర్తుచేశాడు. హిందువైన కనేరియాపై పాక్ ఆటగాళ్లు కొందరు వివక్ష చూపారంటూ ఇటీవల షోయబ్ అక్తర్ వెల్లడించడంతో ఈ మాజీ బౌలర్ వార్తల్లోకి వచ్చాడు. అలాంటిదేమీ జరగలేదంటూ పలువురు మాజీలు తోసిపుచ్చారు. వివక్ష నిజమైతే పదేళ్లపాటు డానిష్‌కు అవకాశం ఎలా దక్కుతుందంటూ, డబ్బుకోసం అతనేదైనా మాట్లాడతాడంటూ మియాందాద్ విమర్శించాడు. 'చీప్ పబ్లిసిటీ కోసమే ఇదంతా మాట్లాడుతున్నానని అంటున్నారు. కానీ ముందుగా ఈ వివాదం ప్రారంభించింది నేను కాదు. ఓ జాతీయ చానెల్‌లో అక్తర్ ఈ సంగతి వెల్లడించాడు. నేను పదేళ్లు రక్తం ధారపోసి క్రికెట్‌కు సేవలందించిన విషయం తెలుసుకోవాలి. గాయంతో నా వేళ్లు రక్తమోడుతున్నా జట్టుకోసం ఆడా. కానీ కొందరు డబ్బుకోసం దేశాన్ని అమ్ముకున్నా, వారిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకున్నారు' అని కనేరియా విమర్శించాడు.

**ఇంతటితో ఆపండి: అక్తర్**

కనేరియాపై పాక్ ఆటగాళ్లు వివక్ష చూపారన్న తన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపడంతో అక్తర్ వివరణ ఇచ్చుకున్నాడు. పాక్ జట్టులో మొత్తంగా మత వివక్ష ఉందని చెప్పలేదని, ఒకరిద్దరికి మాత్రమే అతడిపై అలాంటి అభిప్రాయం ఉండేదని గుర్తుచేశాడు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి మర్రే అవుట్



**లండన్:** బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ మర్రే వచ్చేనెలలో జరిగే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరం కానున్నాడు. పొత్తి కడుపు నొప్పితో బాధపడుతున్నందున ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడడం లేదని 32 ఏళ్ల మర్రే ప్రకటించాడు.

## రబాడ విజృంభణ

### ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా విజయం



రబాడ (4/103)

**సెంచూరియన్:** ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడ (4/103) చెలరేగాడు. దీంతో 107 పరుగులతో విజయం సాధించిన సఫారీలు నాలుగు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉన్నారు. 376 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ శనివారం ఆట ముగిసే సమయానికి 121/1 స్కోరుతో పటిష్ఠ స్థితిలోనే ఉంది. అలాగే, ఆటకు మరో రెండు రోజుల సమయం ఉండడంతో పర్యాటక జట్టు విజయంపై కన్నేసినట్టే కనిపించింది. కానీ ఆదివారం నాలుగో రోజు ఆటలో పేసర్లు రబాడ, ఎన్రిచ్ నోర్జే (3/56) కట్టుదిట్టమైన బంతులకు ఇంగ్లండ్ 93 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ బర్న్స్ (84), కెప్టెన్ రూట్ (48) మినహా ఎవరూ రాణించలేదు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో ప్రొటీస్ 284, ఇంగ్లండ్ 181 పరుగులు సాధించాయి.

## ఆసీస్‌దే సిరీస్

### రెండో టెస్టులో ఘనవిజయం



**మెల్‌బోర్న్:** న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా 247 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్ దక్కించుకున్నట్టయింది. చివరిదైన మూడో టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీలో జరుగుతుంది. 488 పరుగుల ఛేదన కోసం ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్‌ను స్పిన్నర్ నాథన్ లియాన్ (4/81), పేసర్ ప్యాటిన్సన్ (3/35) దెబ్బతీశారు. ఓపెనర్ బ్లండెల్ (121) మినహా ఎవరూ రాణించకపోవడంతో కివీస్ 71 ఓవర్లలో 240 పరుగులకే ఆలౌటైంది. అంతకుముందు ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 54.2 ఓవర్లలో 168/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. వాగ్నర్‌కు మూడు వికెట్లు దక్కాయి. అలాగే ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులు చేయగా కివీస్ 148 పరుగులకే కుప్పకూలింది.



### పీటర్ సిడిల్ రిటైర్మెంట్

ఆస్ట్రేలియా సీనియర్ పేసర్ పీటర్ సిడిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2008, అక్టోబర్‌లో భారత్‌పై టెస్టు అరంగేట్రం చేసిన సిడిల్ 67 టెస్టుల్లో 221 వికెట్లు తీశాడు. ఈ ఏడాది ఇంగ్లండ్‌లో జరిగిన యాషెస్ సిరీస్ ఐదో టెస్టులో చివరిసారిగా ఆడాడు. ఇక 2009లో తొలి వన్డే ఆడిన సిడిల్ ఈ ఫార్మాట్‌లో కేవలం 20 మ్యాచ్‌లకే పరిమితం కాగా రెండు అంతర్జాతీయ టీ20లు ఆడాడు.

## ఐఎస్‌ఎల్‌లో హైదరాబాద్ ఓటమి

**ముంబై:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు మరోసారి నిరాశాజనక ప్రదర్శన చేసింది. ముంబై ఎఫ్‌సీ జట్టు చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ముంబై 2-1 గోల్స్ తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. మొదొవు సొగు (6వ, 78వ నిమిషంలో) డబుల్ గోల్స్‌తో విజృంభించి ముంబైని గెలిపించాడు. హైదరాబాద్ జట్టులో ఏకైక గోల్‌ను బొబొ 81వ నిమిషంలో సాధించాడు. ఆరంభం నుంచి పూర్తిగా వెనుకబడ్డ హైదరాబాద్ ఆటగాళ్లు ఆఖర్లో పుంజుకొని గోల్ చేసినా ఫలితం లేకపోయింది.

*Printed and Published by* ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : K. Srinivas,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*